ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
23-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 143 పేజీలు: 8+4 వెల: 6.50

ఖతార్‌లో భారీ అగ్ని ప్రమాదం
12 మంది భారతీయులు మృతి
5లో

'నీట్'లో నకి'లీల'లు..
బీహార్‌లో 24 మంది అరెస్టు

## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా



### లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
### తదుపరి ప్రధాని రేసులో ఆండీ బర్న్‌హామ్, వెస్ స్ట్రీటింగ్
### జులై 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

**లండన్, జూన్ 22:** పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం పదవి నుంచి తప్పుకోనున్నట్లు ప్రకటించారు. అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని వివరించారు. >>2



## భగ్గుమన్న కోచింగ్ సెంటర్

### లక్నోలో భారీ అగ్నిప్రమాదం
### 18 మంది మృతి, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

**లక్నో, జూన్ 22:** ఉత్తర్‌ప్రదేశ్‌రాష్ట్రం లక్నో నగరం అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారని పోలీసులు తెలిపారు. మృతులు 20 నుంచి 24 యేళ్ల మధ్య వయస్సు వారని చెబుతున్నారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో, ప్రాంగణమంతా వేగంగా దట్టమైన పొగతో నిండి >>2

## భారీ వర్ష సూచన

**విజయవాడ, జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో సోమవారం భారీ వర్షాలు కురిసాయి. మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయ మయ్యాయి. మధ్యాహ్నమంతా తీవ్ర ఎండ తాపానికి ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రానికి ఒక్కసారిగా మేఘాలు చల్లబడి వర్షం కురవడంతో సేద తీరారు. వర్షం కురవడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

**ఈ నెల 23 నుంచి 26 వరకు భారీ వర్షాలు**

మరోవైపు రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్తర కోస్తా, కోస్తా, రాయలసీమ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. అదే >>2

# మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం

### ఉద్యోగులు వినూత్నంగా ఆలోచించాలి
### పనితీరు ఆధారంగా బాధ్యతల అప్పగింత
### అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
### ఆర్టీజిఎస్‌పై సమీక్షలో సిఎం చంద్రబాబు



ఆదివారం సచివాలయంలో ఆర్టీజిఎస్ సమావేశంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ., జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. పిజిఆర్ఎస్ సహా ప్రజలనుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టిజిఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది.

మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఎపికి బలమైన మానవ వనరుల వ్యవస్థఅవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ >>2



సోమవారం ఢిల్లీలో జరిగిన టివి సమ్మిట్‌లో మాట్లాడుతున్న లోకేష్

# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీసు

## మా విజయ రహస్యాలు అవే..

### 2028కి అమరావతిలో ప్రభుత్వ భవనాలు సిద్ధం
### ప్రాంతీయ పార్టీ అయినా జాతీయ భావం మాది
### 2047కు 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా ఎపి
### ఢిల్లీలో జరిగిన టీవీ సమ్మిట్‌లో మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి కేవలం ప్రభుత్వ కార్యకలాపాలకే పరిమితం కాకుండా, ఎపికి ఒక ఆర్థిక శక్తిగా (ఎకనామిక్ పవర్‌హౌస్‌గా) మారాలన్నదే మా లక్ష్యం. 2028 నాటికి అమరావతిలోని అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు లాంటి ప్రభుత్వ భవనాలన్నీ సిద్ధం చేస్తాం. ఇది మేం ఇచ్చిన మాట, కచ్చితంగా నిలబెట్టుకుంటాం. ఇక రాజధాని కోసం 60వేల కోట్లు సేకరించబోతున్నాం. కేవలం ప్రభుత్వ భవనాలే కాదు. ఇప్పటికే బిట్స్ వాళ్లు తమ క్యాంపస్ నిర్మిస్తున్నారు, వచ్చే యేడాది అడ్మిషన్లు కూడా స్టార్ట్ అవుతాయి. వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఆసుపత్రులు, హోటళ్లు, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ అన్నీ వస్తున్నాయి. నేను ఇందాక చెప్పిన 2.4 ట్రిలియన్ ఎకానమీ అనేది ఒకే నగరంతో సాధ్యం కాదు. అందుకే విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను వేర్వేరు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖను ఐటీ, డేటా సెంటర్లకు కేరాఫ్‌గా మార్చుతున్నాం. అమరావతిలో క్వాంటం ఎకోసిస్టమ్ డెవలప్ చేస్తున్నాం. ఇక రాయలసీమ (తిరుపతి ప్రాంతం)లో మాన్యుఫ్యాక్చరింగ్ (తయారీ) రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రాజధాని అమరావతే అయినా, మిగతా రాష్ట్రాన్ని కూడా సమానంగా అభివృద్ధి చేస్తున్నామని ఢిల్లీ వేదికగా జరిగిన రిపబ్లిక్ టీవీ సమ్మిట్ 2026లో ఎపి ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ టివి సంపాదకుడు అర్నాబ్‌గోస్వామి ప్రశ్నలకు ఆయన సవివరంగా బదులిస్తూ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభమేనని, అమరావతి ఒక సెల్ఫ్‌ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్ అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఇచ్చిన మాట ప్రకారం ముందు అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని అన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో ఎపి ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర >>2

## పెరిగిన ఎరువుల ధరలు

**హైదరాబాద్, జూన్ 22, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న అన్నదాతలకు ఖరీఫ్ ఆరంభంలోనే పెరిగిన ఎరువుల ధరలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయంలో పెట్టుబడుల భారం రోజురోజుకు పెరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు తోడు తాజాగా ఎరువుల ధరలు కూడా భారీ పెరిగడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధానంగా కాంప్లెక్స్, డిఎపి, సూపర్ ఫాస్ఫేట్, పొటాష్ వంటి ఎరువుల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. దీంతో అన్నదాతకు పెరిగిన ఎరువుల ధరలు మరింత కుంగదీస్తున్నాయి. ఈ సీజన్‌లో సాగు చేసే వరి, పత్తి తదితర పంటలకు కాంప్లెక్స్ ఎరువులు తప్పనిసరి. ఈ తరుణంలోనే కాంప్లెక్స్ ఎరువుల ధరలను ప్రభుత్వం భారీగా పెంచి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. మరోవైపు ఎరువుల వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు ఎకరాకు ఒకటి నుంచి రెండు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులను వాడాల్సిందే. గ్రోమోర్, యూరియా యథాతథంగా ఉన్నా కాంప్లెక్స్ ఎరువులపై రూ.300రూ. 550వరకు పెంచారు. యూరియా, డీఏపీ ధరలు స్థిరంగానే ఉన్నప్పటికీ మిశ్రమ ఎరువుల ధరలు ఆకాశాన్నంటడం >>2

# ఎఐ ఆధారిత సేవలు భేష్

### కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు జోహాన్నెస్ జుట్



సోమవారం విశాఖ కెజిహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్

**విశాఖపట్నం, జూన్ 22 ప్రభాత వార్త:** విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్), ఆంధ్ర మెడికల్ కాలేజీని ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్ సోమవారం సందర్శించారు. ఈ పర్యటనలో రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె. పద్మావతి, ప్రపంచ బ్యాంక్ హెల్త్ టీమ్ ప్రతినిధి అమిత్ నాగరాజ్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్, డా. డి. రాధకృష్ణన్, డి. సిఎస్ ఆర్ ఎంఓ .డాక్టర్ కుమార్, డి. సి. హెచ్ ఎస్.డాక్టర్ నరేంద్ర సింగ్, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి. కిరణ్ కుమార్ ఇతర జిల్లా అధికారులు, మంత్రిత్వ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎమ్ సంధ్యా దేవి అతిథులకు స్వాగతం పలికి, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కెజిహెచ్ శతాబ్ద కాల చరిత్ర, వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన విజయాలు, ఆధునిక వైద్య రంగంలో తీసుకొచ్చిన వినూత్న ఆవిష్కరణలను వివరించారు. అనంతరం పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉషా ప్రసాద్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ఆధారంగా గర్భిణీ స్త్రీలలో ప్రసవానికి ముందు శిశువుల ఆరోగ్య పరిస్థితి, గుండె వేగాన్ని డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ ద్వారా ఎలా పర్యవేక్షిస్తున్నారో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సాంకేతికత ద్వారా పుట్టబోయే బిడ్డకు ప్రమాద సూచనలు ఉంటే ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స అందించడం ద్వారా శిశువును సురక్షితంగా కాపాడవచ్చని తెలిపారు.అంతేకాకుండా, ఈ పరికరాలను నిపుణులైన వైద్యులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే, అక్కడ పనిచేస్తున్న ఎఎన్ఎంలు, నర్సింగ్ సిబ్బంది లేదా ఇతర ఆరోగ్య సిబ్బంది పరీక్షల వివరాలను వెంటనే నిపుణులకు పంపించి వారి సూచనల మేరకు అత్యవసర వైద్య సహాయం అందించవచ్చని వివరించారు. దీనివల్ల శిశుమరణాలరేటుతో పాటు మాతృ మరణాల రేటునుకూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈఅంశంపై నిర్వహించిన పరిశోధనకు ఇటీవల మెడ్‌టెక్ >>2

## సాయికృష్ణ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు

### కుటుంబ సభ్యుల వాంగ్మూలం నమోదు

**విజయవాడ, జూన్ 22. ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. సోమవారం సాయికృష్ణ ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు సేకరించారు. తమకు తెలిసిన విషయాలన్నీ చెప్పామని సాయికృష్ణ మేనమామ నవరంగ్ చెప్పారు.

కేసులో న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉందన్నారు. సాయికృష్ణ అదృశ్యం ఘటనపై ప్రభుత్వం సిట్ వేయటం ఆహ్వానించదగ్గ విషయమని సాయికృష్ణ మేనమామ నవరంగ్ అన్నారు. తమకు న్యాయం చేస్తామని సిఎం హామీ ఇచ్చారని, ఈ కేసులో నిందితులపై కఠిన చర్యలు ఉంటాయనే నమ్మకం తమకు ఉందన్నారు. నూతన సిట్ సభ్యులు కృష్ణలంక లోని సాయికృష్ణ ఇంటికి >>2



సోమవారం హైదరాబాద్‌లో బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి రజతోత్సవంలో కేంద్రమంత్రులు అనుప్రియా పటేల్, పెమ్మసాని, సిఎం చంద్రబాబు తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, వెంకయ్యనాయుడు, బాలకృష్ణ తదితరులు

## లాభాపేక్ష లేని ఆస్పత్రులవసరం

### ఎన్టీఆర్ విజన్‌తోనే బసవతారకం కేన్సర్ ఆస్పత్రి: సిఎం చంద్రబాబు
### అమరావతిలో కేన్సర్ ఆస్పత్రి: రజతోత్సవ వేడుకల్లో బాలకృష్ణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్22:** ఇండో అమెరికన్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ తన సేవామార్గంలో 25 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం హైటెక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎపి సిఎం నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, విశాఖ ఎంపీ భరత్, ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ బాలకృష్ణ,నారా బ్రాహ్మణి,నటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజోత్సవ కార్యక్రమాన్ని సిఎంచంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ >>2

## రాష్ట్రంలో నెత్తురోడిన రహదార్లు

### 12 మంది మృతి, 45 మందికి గాయాలు


(ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్)

ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పన్నెండు మంది మృతి చెందగా 45 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాల్లో చిన్నారులు ముగ్గురు సైతం ప్రాణాలు వదిలారు. జరిగిన ప్రమదాలతీరును పరిశీలిస్తే అధికభాగం డ్రైవింగ్ నిర్లక్ష్యమే కారణమని పోలీసులు పేర్కొంటున్నారు. విజయనగరంలో అతివేగంగా వస్తున్న కారు ఏకంగా డివైడర్ దాటి ఎదురుగా వచ్చే లారీని ఢీకొంది. భోగాపురం వద్ద ఈ ప్రమాదం జరగ్గా కారు ముందు సీటులో కూర్చొని ఉన్న తాత, 18 నెలల మనవడు మృతి చెందారు. కృష్ణా జిల్లా ఎ కొండూరులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ డ్రైవర్ సడన్ బ్రేక్‌వేయడం కిందపడి మృతి చెందింది. తిరుపతి జిల్లా ఉడుంవారిపల్లి వద్ద లారీని బస్సు ఢీకొన్న ఘటనలో చిన్నారి, మరో వ్యక్తి మృతి చెందారు. బస్సులో ఉన్న సుమారు 25 మందికి గాయాలు తగలడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు వద్ద ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. పల్నాడు జిల్లా కామేపల్లిలో లారీ ఆటో ఢీకొన్నఘటనలో ముగ్గురు మృతిచెందగా 5గురుగాయపడ్డారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడు వద్ద బైక్‌ను కారు ఢీకొట్టగా ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. -వివరాలు లోపలి పేజీల్లో

## ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

### భార్య, పిల్లలకు విషం ఇచ్చి ఆపై ఫ్యానుకు ఉరి వేసుకున్న భర్త
### తన డబ్బులతోనే దహన సంస్కారాలు చేయాలని పేపర్‌పై ఫోన్‌పే పిన్ నంబర్ రాసి ఆత్మహత్య చేసుకున్న వైనం
### చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లిలో విషాదం

**చిత్తూరు, జూన్ 22 ప్రభాతవార్త:** భార్యకు వచ్చిన బ్రెయిన్ స్ట్రోక్ వ్యాధికి సరైన చికిత్స చేయలేక, ఆర్థిక ఇబ్బందులతో జీవించలేని ఓ భర్త తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలకు విషం తాగించి ఆపై తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిత్తూరు జిల్లాలో సంచలనం కల్గించింది. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన దామోదర్, అతని భార్య నిర్మల, 8వ తరగతి చదవుతున్న కుమారుడు దిలీప్, 6వ తరగతి చదువుతున్న కుమార్తె శ్రీవిద్య ఒకే రోజు వారి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. దామోదర్ తన భార్య నిర్మల, పిల్లలు దిలీప్, శ్రీవిద్యలకు విషం కలిపిన పాలు తాగించి తాను ఇంట్లో వున్న ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒకేసారి ఒకే కుటుంబంలో నలురుగు ప్రాణాలు కోల్పోవడంతో చిత్తూరు రూరల్ మండలంతో పాటు చిత్తూరు నగర పరిసరాల్లో ఈ వార్త సంచలనంగా మారింది. ఎన్‌ఆర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ వార్తకు సంబంధించిన వివరాలిలా వున్నాయి. చిత్తూరు రూరల్ మండలం బంగారెడ్డిపల్లి గ్రామంలో దామోదర్ కుటుంబం నివాసం వుండేది. దామోదర్‌కు భార్య నిర్మలతోపాటు కుమారుడు దిలీప్, కుమార్తె శ్రీవిద్యలు వున్నారు. ఈ పరిస్థితిల్లో దామోదర్ భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ >>2




సోమవారం ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఇజ్రాయెల్ రక్షణ శాఖ డైరెక్టర్ జనరల్ అమీర్ బరామ్ భేటీ అయిన దృశ్యం

# భగ్గుమన్న కోచింగ్ సెంటర్

>> పోయి, అక్కడున్న విద్యార్థులు, ఇతరులు భయాందోళనలతో ప్రాణాలతో బయటపడాలనే తీవ్ర ప్రయత్నంలో, కొందరు పై అంతస్తుల నుండి, టెర్రస్ నుండి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మధ్యాహ్నం భవనం నుండి మొదటగా దట్టమైన పొగ రావడం కనిపించిందని, ఆ తర్వాత మంటలు వేగంగా వ్యాపించి భవనం మొత్తాన్ని చుట్టుముట్టాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మంటలు, పొగతో బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో, భయాందోళనలకు గురైన విద్యార్థులు కిటికీలు, పైకప్పు వైపు పరుగులు తీశారు. కొందరు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి నేలపైకి దూకినట్లు సమాచారం. అగ్నిమాపక దళం, పోలీసులు, జిల్లా యంత్రాంగం నుండి పలు బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్‌తో సహా ఉన్నతాధికారులు ఘటనా స్థలంలో ఉండి, సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షించారు. భవనం గోడకు రంధ్రం చేసి లోపల చిక్కుకున్న వారిని సహాయక బృందాలు రక్షించాయి. ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, క్షతగాత్రులకు కేంద్రం రూ.50 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. అలీగఢ్ పర్యటనలో ఉన్న సిఎం ఆదిత్యనాథ్ హుటాహుటిన లక్నోకు తిరిగి వచ్చి ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు.

# లాభాపేక్ష లేని ఆస్పత్రులవసరం

>> 'బసవ తారకం కాన్సర్ ఆస్పత్రి ప్రస్థానం వెనుక ఓ కథ ఉంది. మా అత్తగారు బసవతారకం స్ఫూర్తితో ఇది నిర్మితమైంది.ఆమెకు సోకిన క్యాన్సర్ వ్యాధి చికిత్స కోసం ఆ సమయంలో ఎక్కడా ఆస్పత్రి లేని పరిస్థితి. ముంబై, చెన్నై లాంటి ప్రాంతాల్లోనే క్యాన్సర్ ఆస్పత్రులు ఉండేవి, ఆగస్టు సంక్షోభం సమయంలోనే ఆమె క్యాన్సర్ కారణంగా మృతి చెందారు. క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందక ఇక ఎవరూ చనిపోకూడదనే ఆలోచనతో ఈ ఆస్పత్రిని నిర్మించారు' అని చెప్పారు. ఎన్టీఆర్ విజన్‌తో పాటు పేదలకు వైద్య చికిత్స అందించాలన్న సంకల్పంతో ఆస్పత్రి నిర్మాణం చేశాం, తొలుత 100 పడకల ఆస్పత్రిగా ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిని ప్రారంభించాం.మొక్కగా నాటిన ఈ ఆస్పత్రి ఇప్పుడు మహా వృక్షంగా ఎదిగింది. 25 యేళ్ల ప్రస్థానంలో ఎందరో త్యాగాలు ఉన్నాయి, వివిధ సవాళ్లను అధిగమించి ఈ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్‌గా బాలకృష్ణ నియమితులు అయ్యారు అని చెప్పారు. అన్ స్టాపబుల్‌గా బాలకృష్ణ ఈ ఆస్పత్రి కోసం పనిచేస్తున్నారు. ఎంత బిజీగా ఉన్నా బసవతారకం ఆస్పత్రికి వెళ్లి రోగులను పరామర్శిస్తూ వారికి స్వాంతన కలిగిస్తున్నారు అని పేర్కొన్నారు. లాభాపేక్ష లేని సంస్థగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని నడుపుతున్నారు. 650 పడకల ఆస్పత్రిగా ప్రస్తుతం ఇక్కడ సేవలందుతున్నాయి. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నారు ఏడాదికి 3 లక్షల పైచిలుకు మంది రోగులకు ఈ ఆస్పత్రి సేవలు అందిస్తోందన్నారు. పబ్లిక్ హెల్త్ రంగంలో ప్రభుత్వం ఒక్కటే ప్రజారోగ్యాన్ని కాపాడలేదు. లాభాపేక్ష లేని ఆస్పత్రులు కూడా వస్తే పేదలకు వైద్య సేవలు మెరుగ్గా అందుతాయన్నారు. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రుల లాంటి లాభాపేక్ష లేని ఆస్పత్రులు మరిన్ని రావాల్సి ఉందన్నారు.ప్రతి ఒక్కరూ భారతీయ సనాతన ధర్మం బోధించిన ఆరోగ్యకరమైన జీవన శైలికి మళ్లాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. వైద్య రంగంలో "ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్" అన్నది అత్యంత ముఖ్యమైన సూత్రమని, వ్యాధి వచ్చాక బాధపడటం కంటే రాకుండా చూసుకోవడం ఉత్తమమని స్పష్టం చేశారు. కేన్సర్ పట్ల సమాజంలో భయాన్ని పోగొట్టి, అవగాహన పెంచడం,ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సుల ద్వారా పల్లె పల్లెకూ వెళ్లి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తూ, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడంలో బసవతారకం ఆసుపత్రి చేస్తున్న కృషి అమోఘమైనదన్నారు.ఈ సందర్భంగా మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. బసవతారకం ఆస్పత్రిలో నాణ్యమైన సేవలు అందుతున్నాయని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు తక్కువ ధరకే అందిస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో కాన్సర్ రిజిస్ట్రీ మెయింటెన్ చేస్తున్నామన్నారు. కాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించామని వెల్లడించారు. బాలకృష్ణ మాట్లాడుతూ మా అమ్మ బసవతారకం క్యాన్సర్‌తో చనిపోయారని పేర్కొన్నారు. క్యాన్సర్‌తో బాధపడేవారికి అండగా ఉండాలనే ఈ ఆస్పత్రి నిర్మించామన్నారు. దేశంలోనే ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రిగా పేరు తెచ్చుకున్నామని వెల్లడించారు. క్యాన్సర్‌తో అనేక కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. బసవతారకం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలు చూసి గర్వపడుతున్నామన్నారు. అమరావతిలో కేన్సర్ ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు.

# అర్జీల పరిష్కారం

>> ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి."అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు

**పాత కేసుల ట్రేసింగ్.**

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఎస్ సాయి ప్రసాద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కీర్ స్టార్మర్ రాజీనామా

>> "తాను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నా" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. యుకెలో 14 యేళ్ల కన్జర్వేటివ్ ప్రభుత్వం తర్వాత, 2024లో లేబర్ పార్టీని భారీ విజయానికి నడిపించిన బ్రిటిష్ ప్రధానమంత్రికి ఇది ఒక తీవ్రమైన ఎదురుదెబ్బగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**తదుపరి ప్రధాని ఎవరంటే?:**

లేబర్ పార్టీ నాయకుడిగా తద్వారా బ్రిటన్ ప్రధానిగా స్టార్మర్ స్థానాన్ని భర్తీ చేయడానికి నామినేషన్ల ప్రక్రియ జులై 9న ప్రారంభం కానుంది. "ఈ పోటీ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రధానమంత్రిగా కొనసాగుతాను" అని స్టార్మర్ చెప్పారు. "అలాగే, అధికార బదిలీ సజావుగా జరిగేలా చూసేందుకు నా వంతు కృషి చేస్తాను" అని పేర్కొన్నారు.

తదుపరి ప్రధాని రేసులో మాంచెస్టర్ మాజీ మేయర్ ఆండీ బర్న్‌హామ్ ముందంజలో ఉన్నారు. ఆదివారం జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించిన ఆయన బ్రిటన్ పార్లమెంటుకు తిరిగి వస్తున్నారు. గతంలో ఆయన రెండుసార్లు లేబర్ పార్టీ నాయకత్వానికి పోటీ చేశారు. స్టార్మర్ ప్రకటన వెలువడిన రెండు గంటల లోపే, పార్టీ నాయకుడిగా, ప్రధానిగా ఆయన స్థానాన్ని భర్తీ చేయడానికి తాను పోటీ చేస్తానని బర్న్‌హామ్ ధ్రువీకరించారు.

# పెరిగిన ఎరువుల ధరలు

>> మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. రాష్ట్రంలోని జిల్లాల్లో అత్యధికంగా వినియోగించే 20:20:0:13 కాంప్లెక్స్ ఎరువు గత నెల రోజుల కిందట 50 కిలోల బస్తాకు గరిష్ట ధర రూ. 1,450 ఉండేది. ఒక్కసారిగా ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రూ.350 పెరిగింది.ఇప్పుడు రైతులు ఇంకా సేద్యం మొదలు పెట్టక ముందే మరో రూ.350 పెంచారు. ఫలితంగా దుకాణాల్లోకి కొత్తగా వచ్చే కాంప్లెక్స్ ఎరువులు ఇప్పుడు బస్తా ధర రూ.2,150 కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. అంటే నెలన్నర రోజుల వ్యవ ధిలోని రూ.600 పెరగడం కర్షకునికి కంటిమీద కునుకు లేకుండాచేస్తుంది.

రాష్ట్రం మొత్తం మీద అత్య ధికంగా వినియోగించే ఎరువులకు పెరగడం విశేషం. ముఖ్యంగా 12:32:16 ఎరువులు బస్తా రూ.1,900 ఉండగా, రూ.550 పెరిగిన రూ.2,450కి చేరింది. అలాగే బస్తా రూ.1,950 ఉన్న 10:26:26 ఎరువులకు రూ.500 పెరిగి ఇప్పుడది రూ.2,450కి, రూ.615 ఉన్న సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పి)కు రూ.385 పెరిగి రూ.1,000కి, రూ.1,800 ఉండే 20:20:0:13 ఎరువులకు రూ.350 పెరిగి రూ.2,150కి, చేరింది.

## వారం - వర్జ్యం

23-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
నవమి సా.4.43,
హస్త ఉ.11.56
వర్జ్యం : రా.8.38-రా.10.22
దు.ఉ.8.13-ఉ.9.05,
(2)రా.11.58-రా.12.50
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** చెప్పుకోదగిన మార్పు ఆలోచనా ధోరణిలో ఏర్పడుతుంది. జీవిత భాగస్వామితో రాజీధోరణి. అవలంభించడం మేలు.

**వృషభం:** రాజకీయ, కళారంగాలలో వారికి విదేశీ పర్యటనలు. స్థలాలు కొనుగోలు చేస్తారు. నూతన విద్యావకాశాలు కలవు.

**మిథునం:** నిదానమే ప్రధానమన్న నానుడిని గుర్తుపెట్టుకుని ఒకటి రెండు మార్లు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** ఇంటర్వ్యూలు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఊహించని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి.

**కన్య :** కష్టపడి పైకి రావాలన్న మీ ధ్యేయం నెరవేరుతుంది. లోన్లు మంజూరు అవుతాయి. బంధువుల కలయిక.

**తుల :** గతంలో మీకు సానుకూలపడని వ్యవహారాలు అనూహ్యంగా సానుకూల పడతాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. కళాకారులు సన్మాన, సత్కారాలు పొందుతారు. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** మొండికేసిన స్థిరాస్తి రిజిస్ట్రేషన్ కాకుండానే స్వాధీనములోని వచ్చుట జరుగుతుంది. ప్రముఖుల కలయిక.

**మకరం:** ముఖ్యమైన ప్రయాణాలు తత్సంబంధిత యత్నాలు కొంత ఆలస్యముగా సానుకూలపడతాయి.

**కుంభం:** తనఖాలో ఉంచిన డాక్యుమెంట్స్‌ను విడుదల చేసుకుంటారు. ఇతరులకు సహాయం అందిస్తారు.

**మీనం :** వీసా, పాస్‌పోర్ట్ అంశాల కలిసి వస్తాయి. వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎఐ ఆధారిత సేవలు భేష్

>> ఇన్నోవేషన్ విభాగంలో ప్రత్యేక ప్రశంసలు లభించాయని, ఆ వివరాలను కూడా ప్రపంచ బ్యాంక్ బృందానికి వివరించారు. ఈ వినూత్న కార్యక్రమాల గురించి తెలుసుకున్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు బృందం కేజీహెచ్ వైద్యులు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు.తదుపరి కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్రసూతి,గైనకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సౌమిని, ప్రొఫెసర్ డాక్టర్ శైలజా కలిసి గర్భాశయ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే సరికొత్త ఎఐ డయాగ్నోస్టిక్స్ సాంకేతికతపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సాంకేతికత పనితీరును చూసి ప్రపంచ బ్యాంక్ బృందం ఎంతో ఆసక్తి కనబరిచి, ఈ వినూత్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా అభినందించింది.లైవ్ డెమోకు ముగ్ధులైన వరల్డ్ బ్యాంకు హెల్త్ టీమ్ అధికారులు.ప్రజెంటేషన్ల అనంతరం అధికారుల బృందం నేరుగా గైనకాలజీ విభాగంలోని లేబర్ రూమ్ కాంప్లెక్స్, మెటర్నల్ ఐసీయూను సందర్శించింది. అక్కడ ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఎఐ ఆధారిత డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ వ్యవస్థ, రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్, ఎఐ డయాగ్నోస్టిక్ పరికరాల పనితీరును స్వయంగా పరిశీలించారు.వైద్య సేవల్లో డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్న తీరుపై ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు జోహాన్నెస్ జుట్ సంతృప్తి వ్యక్తం చేశారు.

కేజీహెచ్ ఆంధ్ర మెడికల్ కాలేజీలో అమలవుతున్న ఈ వినూత్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేజీహెచ్ పరిపాలనావిభాగాన్ని, ఈకార్యక్రమాన్ని సమర్థ వంతంగా ముందుకు తీసుకెళ్తున్న ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల వైద్య బృందాలను ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ అధ్యాపకులు, వైద్యులు, అధికారులు, మంత్రిత్వ శాఖ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీడ్, స్టెబిలిటీ, సర్వీసు

>> ప్రభుత్వ కూటమిలో ఎపి నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో ఎపి గొంతు ఎంతో బలంగా వినిపిస్తోందని అని లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు (ఎపి 3ఎస్ స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో (ఎఫ్‌డిఐ) 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం అని లోకేష్ ప్రకటించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం (వైజాగ్) ఐటీ హబ్ అమరావతి నాలెడ్జ్ హబ్ రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు.రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన జనరేషన్ షిఫ్ట్ (నాయకత్వ మార్పు) కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక నాయకుడితో 15-20 యేళ్ల కలిసి ప్రయాణించాక, మనమంతా ఆయనకు కార్బన్ కాపీలా మారిపోతాం. ఆ వర్క్ కల్చర్ మనకూ వస్తుంది. మేం ప్రాంతీయ పార్టీ అయినా ఎప్పుడూ దేశం గురించే ఆలోచించాం. మా విధానాల వల్ల దేశానికి లాభం చేకూరింది. వ్యాపారవేత్తలు దేశ నిర్మాతలు, వాళ్లు జాబ్స్ ఇస్తారు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ నిర్మిస్తారు. అయితే, వాళ్ల పెట్టుబడుల కోసం ఎపి మాత్రమే కాదు, అన్ని రాష్ట్రాలూ పోటీ పడుతున్నాయి. ఎపిలో పెట్టుబడులు పెడుతున్న సంస్థలు చాలా పెద్దవి, వాళ్లకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం కావాలి. నేను చేస్తోంది అదే. వాళ్ల ప్రాజెక్ట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తాను. ఎందుకంటే వాళ్లు పెట్టుబడులు పెడితేనే మా దగ్గర ఉద్యోగాలు వస్తాయి, స్థానికంగా ఆర్థిక వృద్ధి జరుగుతుంది.ఎక్కువ మంది ఎంపీలు ఉంటే మన మాట గట్టిగా వినిపించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. కానీ దానివల్ల రాష్ట్రానికి, నాకు ఏం లాభం కలిగింది? ప్రధానితో కలిసి డిన్నర్ చేసే అవకాశం దొరికింది. మోడీ గారు చాలా ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారు. ఆయన విజన్ ఏంటో నాకు అర్థమైంది. కేంద్రం అద్భుతమైన పాలసీలు తీసుకొస్తోంది. ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు, కానీ ఆచరణలో పెట్టాల్సింది రాష్ట్రాలే. ఆ విషయంలో ఎపి మిగతా రాష్ట్రాల కంటే చాలా వేగంగా ముందుకెళ్తోంది, అందుకే మాకు తగిన గుర్తింపు వస్తోంది. ఇతర రాష్ట్రాలు సైలెంట్‌గా ఉన్నప్పుడు, నేను డిఫెన్స్ మినిస్టర్ దగ్గరికి వెళ్లి మాకు ప్రాజెక్ట్ ఇవ్వండి, మా దగ్గర భూమి రెడీగా ఉంది అని అడిగితే ఆయనెందుకు కాదంటారు? 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమి ఇచ్చాం, దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అదే మా స్పీడ్. ప్రధాని కూడా ఇలా స్పీడ్‌గా పనిచేసే రాష్ట్రాల వైపే చూస్తున్నారు. రాష్ట్రాలు పోటీ పడితేనే దేశం గెలుస్తుందని నా నమ్మకం. అమరావతి విషయానికొస్తే.. ప్రాజెక్ట్ మొదలుపెట్టడానికి వాళ్లు మొదట 1213 వేల కోట్ల స్టార్టప్ క్యాపిటల్ ఇచ్చారు. కానీ అది కేవలం ప్రారంభం మాత్రమే. మేమే సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నాం. ఇదొక సెల్ఫ్‌ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. దేశం గర్వపడేలా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తున్నాం. ఇకపై మనం విదేశాల్లోని నగరాల గురించి కాదు, ఇండియాలోని అమరావతి గురించే మాట్లాడుకుంటాం. అదే మమ్మల్ని మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతుందన్నారు.



సోమవారం ఢిల్లీలో దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్ హోతో మంత్రి లోకేష్ భేటీ అయిన దృశ్యం

# దక్షిణ కొరియా రాయబారితో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** భారత్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) రాయబారి లీ సియోంగ్ హోను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో కొరియన్ కంపెనీల విస్తరణ, భవిష్యత్తులో ఇరు దేశాల నడుమ మరింత సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. సెమీకండక్టర్లు, మైక్రో ఎలక్ట్రానిక్స్, స్టోరేజ్, నౌకా నిర్మాణం, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో కొరియా ప్రపంచ అగ్రగామిగా ఉంది. భారతదేశంలో కొరియన్ కంపెనీలకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదనే అంశంపై మంత్రి లోకేష్ చర్చించారు.

# కొనసాగుతున్న దర్యాప్తు

>> వచ్చి కుటుంబసభ్యుల స్టేట్ మెంట్స్ నమోదు చేశారు. సాయికృష్ణ తల్లి, మేనమామలు, న్యాయవాది స్టేట్ మెంట్లను రికార్డు చేశారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చి వివరాలు తీసుకున్నారు. ఎస్పీ అమిత్ బర్దార్, ఎఎస్పీ సుధాకర్ బృందం విచారణ జరిపింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్టేట్ మెంట్స్ తీసుకున్నారు. మార్కాపురం నుంచి విజయవాడ ఎప్పుడు తీసుకువచ్చారు? ఎవరు తీసుకువచ్చారు. సాయికృష్ణ ఆఖరిగా ఎప్పుడు మాట్లాడారు? అదృశ్య ఘటనపై అనుమానాలు ఏమి ఉన్నాయి? తదితర విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. సాయికృష్ణ అదృశ్యంపై తమకు తెలిసిన అన్ని విషయాలు చెప్పామని సాయికృష్ణ మేనమామ నవరంగ్ అన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ నాగరాజుపై చట్టపరమైన చర్యలుంటాయని తెలిపారు. విజయవాడ కృష్ణలంక రౌడీషీటర్ సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తును సిట్ చేపట్టింది, నిన్న విజయవాడ చేరుకున్న సిట్ బృందం సభ్యులు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంతో పాటు కృష్ణలంక స్టేషన్‌ను సందర్శించారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు వివరాలు, అధికారులు, సిబ్బంది స్టేట్‌మెంట్లను పరిశీలించారు.

# దువ్వాడ అరెస్టు?

## సోషల్ మీడియా పోస్టుతో ఉత్కంఠ

## పిఎస్ వద్ద దివ్వెల మాధురి ధర్నా

**కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా), జూన్ 22 ప్రభాతవార్త) :** ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారా? లేక ఇంకా కేవలం విచారణ మాత్రమే కొనసాగుతోందా? అనే ప్రశ్న సోమవారం రాత్రి వరకు రాజకీయ, న్యాయ వర్గాల్లో తీవ్రచర్చకు దారి తీసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన పరిణామాలు కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఉత్కంఠభరిత వాతావరణాన్ని సృష్టించాయి. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌పై ఒక టివి చర్చా కార్యక్రమంలో దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు జనసేన కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీశాయంటూ హిరమండలం మండలం గొట్ట గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వంజరాపు సింహాచలం ఫిర్యాదు చేయడంతో, కొత్తూరు పోలీసులు క్రైం నంబర్ 21/2025 కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని ఇప్పటికే మూడు సార్లు నోటీసులు జారీ చేశారు. నోటీసుల మేరకు సోమవారం దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరులు దివ్వెల మాధురి, సోదరుడు దువ్వాడ శ్రీధర్ బాబాలతో కలిసి హీరమండలం పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ సిఐ చింతాడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనను సుదీర్ఘంగా విచారించారు. అయితే విచారణ జరుగుతుండగానే దువ్వాడ సోదరుడు బాబా సోషల్ మీడియాలో 'దువ్వాడ అరెస్ట్' అంటూ పోస్టు చేయడంతో ఒక్కసారిగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఆ పోస్టు వైరల్ కావడంతో దివ్వెల మాధురి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా బయటకు వచ్చిన సిఐ చింతాడ ప్రసాద్, "దువ్వాడ శ్రీనివాస్‌ను అరెస్టు చేయలేదు.. ప్రస్తుతం విచారణ మాత్రమే కొనసాగుతోంది" అని స్పష్టం చేసినప్పటికీ, మధ్యాహ్నం 12.30 గంటలకు స్టేషన్‌లోకి వెళ్లిన దువ్వాడ రాత్రి వరకు బయటకు రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇక దువ్వాడపై నమోదు చేసిన బిఎన్ఎస్ సెక్షన్ 353(2), 351(2)తోపాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67లపై న్యాయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి బెయిలబుల్‌నా? నాన్‌బెయిలబుల్‌నా? అనే అంశంపై న్యాయ నిపుణులు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. ఒకవేళ పోలీసులు అరెస్టుచేసినా కోర్టులో బెయిల్ పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలా ఉండగా, దువ్వాడ సోదరుడు, న్యాయవాది అయిన శ్రీధర్‌బాబా హైకోర్టు సీనియర్ న్యాయవాదుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు "విచారణ" పేరుతో గంటల తరబడి స్టేషన్‌లో ఉంచడంపై రాజకీయ వర్గాలు, న్యాయవాదుల్లో చర్చ సాగుతోంది. ఇదిలాఉండగా దువ్వాడ శ్రీనివాస్ అరెస్ట్ హైడ్రామా అనంతరం రాత్రి 8.30 గంటల తర్వాత విడిచిపెట్టారు.

# సిఎంను కలిసిన కర్ణాటక మంత్రి బోస్‌రాజు

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబుని సచివాలయంలో కర్నాటక రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్ఎస్ బోసురాజు, ఎమ్మెల్యే బసవరాజు, ఎమ్మెల్సీ బసవన్న గౌడ కలిశారు. ఈ నెల 25న తుంగభద్ర ప్రాజెక్టు కొత్తగేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరుతూ సిఎంకు ఆహ్వానపత్రిక అందించారు. సిఎం వారితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

# భారీ వర్ష సూచన

>> విధంగా భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్లసంభవించే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది.కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాయలసీమలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం, భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఒకటీ రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని, ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. ఏపీలో రాగల 72 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

>> వ్యాధి సంక్రమించింది. ఈ వ్యాధిని నయం చేయడానికి సుమారు రూ.10 లక్షలు ఖర్చుచేసినా నిర్మల వ్యాధి నయం కాకపోవడం, వైద్యం కోసం మరింత డబ్బులు ఖర్చు చేయాల్సి వుండటం, మరోవైపు పిల్లల చదువులు, కుటుంబ పోషణకు సైతం ఆర్థిక పరిస్థితి సంకటంగా మారడంతో దామోదర్‌కు జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం టివి చూసిన దామోదర్ కుటుంబసభ్యులు రాత్రి 12 గంటల సమయంలో ముందుగా దామోదర్ తన భార్య నిర్మలకు విషం ఇచ్చి తాగించాడు. ఆపై కుమారుడు దిలీప్, కుమార్తె శ్రీవిద్యలకు విషం ఇచ్చి తాగించాడు. వీరు ముగ్గురు విషం సేవించిన అనంతరం తాను సైతం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించిన దామోదర్ ఇంట్లో వున్న సీలింగ్ ఫ్యానుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకోవడానికి దామోదర్ ఒక తెల్ల కాగితంపై తనతో పాటు తన కుటుంబసభ్యులను దహన సంస్కారాలు చేయడానికి సైతం ఇతరుల డబ్బు వినియోగించవద్దని, తన బ్యాంకు అకౌంట్‌లో వున్న డబ్బులను ఫోన్ పే ద్వారా డ్రా చేసి ఉపయోగించాలని, కాగితంపై ఫోన్‌పే పిన్ నెంబర్‌ను రాసి వుంచి ఇంట్లో వున్న టివికి ఈ పేపర్‌ను అతికించి ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇదేమి తెలియన దామోదర్ సోదరి తెల్లవారుజాము దామోదర్ ఇంటికి వెళ్లి ఇంట్లో వున్న వారిని లేపడానికి ప్రయత్నించడంతో ఈ విషాదం వెలుగులోకి వచ్చింది. ఈ సమాచారంను దామోదర్ సోదరి స్థానికులకు తెలియజేయడంతో అక్కడ స్థానికులు గుమిగూడి విషయం తెలుసుకుని ఎన్ఆర్ పేట పోలీసులకు సమాచారం అందించారు. ఎన్ఆర్ పేట పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 15% వృద్ధిరేటు లక్ష్యం: సిఎం చంద్రబాబు

## ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్‌తో ఒప్పందం



సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ మధ్య అవగాహనా ఒప్పందం

**విజయవాడ, జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2014 –19మధ్య 13.5 శాతం మేర సీఏజీఆర్ సాధిచామని, వివిధ కారణాల వల్ల ప్రస్తుతం 11 శాతం మేర వృద్ధిరేటు నమోదైందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధనలో పది సూత్రాల అమలుపై ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాధన్ ఒప్పందాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్ ఏర్పాటుతో పాటు కార్యక్రమం అమలుపై ఐఎఫ్ఎంఆర్ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. జీరో పావర్టీ మిషన్, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చి సంస్థ రాష్ట్రంలో ప్రభుత్వంతో పని చేయనుంది. ఈ ఒప్పందంలో భాగంగా క్షేత్ర స్థాయిలో అధ్యయనం, విధాన పరమైన సూచనలు అందిస్తుంది. ఈ 10 సూత్రాలకు సంబంధించి కొత్త పద్దతులకు సిఫారసు చేస్తుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపై పనిచేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు డీప్ టెక్‌ను ఇంటిగ్రేషన్ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్ ఆటో మొబైల్, మెటల్స్, స్టీల్, రేర్ ఎర్త్ మినరల్స్, సెమీకండక్టర్స్, డిఫెన్స్ లాంటి రంగాల్లో ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయని అన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీని కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎమ్ఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు హాజరయ్యారు.

# ఎల్‌నినోను ఎదుర్కొందాం

## ముందస్తు ప్రణాళికలతో నష్టాలను నివారిద్దాం:-మంత్రి అచ్చెన్నాయుడు



రైతుల కోసం ప్రత్యేక సమాచార సంచిక ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎల్‌నినోపై రైతాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక సూచనల ద్వారా రైతులకు అండగా నిలుస్తామని ఆయన తెలిపారు. సచివాలయంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ శాఖ రూపొందించిన "ఎల్‌నినోను సమర్థవంతంగా ఎదుర్కొందాం అనే ప్రత్యేక సమాచార సంచికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, వర్షపాతం లోపాలు, అధిక ఉష్ణోగ్రతలు వంటి ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని వివిధ వ్యవసాయ వాతావరణ మండలాలకు అనుగుణంగా పంటల ఎంపిక, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, నేల తేమ సంరక్షణ చర్యలు, విత్తనాల వినియోగం, పంటల సంరక్షణకు సంబంధించిన సమగ్ర సూచనలను ఈ సమాచార సంచికలో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సమాచార సంచిక ద్వారా రైతులు శాస్త్రీయ అవగాహన పెంపొందించుకొని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు నష్టాలను తగ్గించుకునే అవకాశం కలుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీ. రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలానీ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చైతన్య కేంద్రాలుగా ఆలయాలు

## మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి



**సచివాలయం,జూన్ 22,ప్రభాతవార్త:** ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత దేవాదాయ ధర్మాదాయ శాఖలో విస్తృతస్థాయి సంస్కరణలు చేపట్టి ఆలయాలను ఆధ్యాత్మిక,సాంస్కృతిక, సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రెండేళ్ళ పరిపాలన–నమ్మకం–విశ్వాసం కార్యక్రమంలో భాగంగా దేవాదాయ శాఖ రెండేళ్ళ ప్రగతి నివేదికను మీడియాకు వివరించిన ఆయన, గత ప్రభుత్వ హాయాంలో దేవాలయాలు,భక్తుల విశ్వాసాలు దెబ్బతిన్నాయని,ఎన్డీఏ ప్రభుత్వం వాటి పునరుద్దరణకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 6,137 ఆలయాల్లో ధూపదీప నైవేధ్య పథకాన్ని అమలుచేస్తు ప్రతి నెల రూ.10వేల చొప్పున జమ చేస్తున్నామని, ఇందుకోసం ఏటా రూ.73కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. సర్వశ్రేయ నిధి ద్వారా 692ఆలయాలు పునర్నిర్మాం,అభివృద్ధికి రూ.813కోట్లతో పనులు ప్రారంభించామని వెల్లడించారు.రాష్ట్ర వ్యాప్తంగా 5వేల శ్రీవాణి భజన మందిరాల నిర్మాణ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాదుతోందని,ఇప్పటికే 1270భజన మందిరాలకు రూ.267కోట్ల నిధులు మంజూరు చేశామని చెప్పారు.ఎస్సీ, ఎస్టీ,బిసి, గిరిజన ప్రాంతాలు,కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.తొలి శ్రీవాణి ఆలయం నెల్లూరు జిల్లా ఆత్మకూరు టిడ్కో కాలనీలో సిద్ధమైందన్నారు. ఎన్డీఏ ఎన్నికల మేనిఫెస్టోలో దేవాదాయ శాఖకు ఇచ్చిన 11హామీల్లో 10హామీలు ఇప్పటికే అమలు చేశామని మంత్రి ఆనం పేర్కొన్నారు.చెప్పిన మాట నిలబెట్టుకోవడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని,భక్తుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా దేవాదాయ శాఖ పనిచేస్తుందని ఆయన స్పష్టంచేశారు.

# సాయికృష్ణను క్రిమినల్ అనడంలో పవన్ ఉద్దేశమేమిటి?: అంబటి రాంబాబు



**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అదుపు తప్పి మాట్లాడుతున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడ సాయికృష్ణ అదృశ్యం కేసు అంశంపై పవన్ చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించారు. అంబటి మీడియాతో మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెబుతుందన్నారు.అదే ప్రభుత్వంలో కీలక బాధ్యతలో ఉన్న పవన్ సాయికృష్ణను ఒక క్రిమినల్ అన్నట్టు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానిం చారు. ఆయనకు ఈ విషయంలో అవగాహన లేదా అన్నారు. జనసేన నేత సామినేని ఉదయ భాను మాత్రం బాధితుడి ఇంటికి వెళ్లి పవన్ పంపిస్తేనే వచ్చామంటున్నారన్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సిట్ నాటకాలు ఆపి, సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.వైసీపీ నేతల తాటతీస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై అంబటి తీవ్రంగా స్పందించారు. "రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి మాట్లాడే భాషేనా ఇది? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా?పవన్. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి అనిత సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందన్నారు.అందుకే పవన్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని వ్యంగంగా మాట్లాడారు. ఒక ఘటన జరిగినప్పుడు వాస్తవాస్తవాలును విచారించి మాట్లాడాల్సిన పవన్ అన్నింటిని ఆయన కోణం చూసి మాట్లాడేస్తే సరిపోదన్నారు.సాయికృష్ణ ఆచూకిని ప్రభుత్వం వెల్లడించాలని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

# శివయ్య సేవలో తెలంగాణ గవర్నర్



సోమవారం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాల యంలో సోమవారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు ఆలయ ఇఓ బికె వెంకటేశు,శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డిల సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం చెప్పారు. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు.

**అద్భుతమైన ఆలయం: సంప్రదాయ పూజలు: గవర్నర్**

దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందని ఇక్కడి ఆలయాన్ని చూసిన తాను శిల్పకళను చూసి ఆశ్చర్యపోయానని అభివర్ణించారు. ఆలయం ఎప్పుడు నిర్మించారు. శిల్పకళను ఎంతో జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ పూజా విధానాలు ఏమిటి? అని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సంప్రదాయాలు చాలా చక్కగా ఉన్నాయని ఆలయ నిర్వహణ అద్భుతంగా ఉందని గవర్నర్ కితాబు ఇచ్చారు.ఆలయాలు మన సంప్రదాయాలకు నిలయాలని అక్కడ ధార్మికతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సేవా కార్యక్రమాలు కూడా చక్కగా ఉన్నాయని అభినందించారు. ఆయనతో పాటు లైజనింగ్ అధికారి విజయభారత్ రెడ్డి ఉన్నారు. స్వామి అమ్మవార్ల ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్న గవర్నర్ కుటుంబానికి ఆలయ మర్యాలతో గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు,స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఓ బికె వెంకటేశు అందించారు. స్వాగతం పలికిన వారిలో ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ టివి సుబ్రమణ్యం, ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్.ధర్మ కర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి తదితరులున్నారు.

## రొయ్యల మేత ధరల మానిటరింగ్‌కు కమిటీ

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రొయ్యల మేత సామగ్రి ధరల మానిటరింగ్‌కు కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో సాంకేతిక సంస్థలు, భాగస్వామ్యదారులు ఉండనున్నారు. మత్స్య శాఖ కమిషనర్ అధ్యక్షతన మొత్తం 10 విభాగాల నుంచి ప్రతినిధులతో కమిటీ ఉండనుంది. రొయ్యల మేత ధరల నియంత్రణ, ప్రత్యామ్నాయ ఫీడ్ అందుబాటులోకి తెచ్చేలా సూచనలు చేయనుంది.

## నేడు పులివెందులకు వైసీపీ అధినేత జగన్

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మంగళవారం నుంచి తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. రేపటి నుండి జూన్ 25 వరకు సాగే ఈ పర్యటనలో ఆయన స్థానిక నేతలతో సమీక్షలు జరపడంతో పాటు ప్రజలను నేరుగా కలవనున్నారు. మంగళవారం సాయంత్రానికి జగన్ పులివెందులకు చేరుకుంటారు. అక్కడ ఉన్న తన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు అక్కడికక్కడే ప్రజాదర్బార్ కూడా నిర్వహించనున్నారు.పర్యటనలో భాగంగా రెండో రోజైన జూన్ 24ఉదయం వేముల మండలం భూమయ్యగారిపల్లిలోని శ్రీలక్ష్మీ నరసింహా స్వామి ఆలయాన్ని జగన్ సందర్శించనున్నారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నానికి మళ్లీ పులివెందుల క్యాంప్ ఆఫీస్‌కు వచ్చి ప్రజలు, పార్టీ శ్రేణులతో ముఖాముఖి మాట్లాడుతారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితుల అర్జీలను స్వీకరిస్తారు. అనంతరం మూడు రోజుల పర్యటన ముగించుకుని జూన్ 25వ తేదీ గురువారం ఉదయం పులివెందుల నుంచి తిరుగుపయనమవుతారు.

## సైనిక సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ స్వర్ణ కుమారి కన్నుమూత

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సైనిక సంక్షేమ శాఖ మాజీ డైరెక్టర్ టి.స్వర్ణ కుమారి విజయవాడలో కన్నుమూశారు. రాష్ట్ర విభజన తర్వాత, రెండుగా విడిపోయిన ఈ శాఖ ఏపీ విభాగానికి స్వర్ణకుమారి పదేళ్లపాటు హెచ్ఓడి బాధ్యతలను నిర్వహించారు.పదవీ విరమణ తర్వాత స్థానికంగా గుంటుపల్లిలో ఆమె నివాసం ఉంటున్నారు. కొంత కాలంగా అస్వస్థతగా ఉంటున్న ఆమె, స్థానికంగా వైద్య ఆరోగ్య సేవలు పొందారు. భర్త రిటైర్డ్ బ్యాంక్ఆఫీసర్ కాగా, వారికి ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు. ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతి పట్ల సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేసారు.

## సమస్యలకు పరిష్కారం కోసమే డయల్ యువర్ సిఎండి

### శివశంకర్ లోతేటి



**తిరుపతి,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థ సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. ఏస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 54 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండీకి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని పరిష్కరించేందుకు సంస్థ అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్‌శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 , 1800 425 155333కు కాల్ చేయడం,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశే షయ్య, జె.రమణా దేవి, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్,లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## కొండ కిటకిట: వెంకన్న సర్వదర్శనానికి 18గంటలు



**తిరుమల,జూన్ 22 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగిసినా, వారాంతం సెలవులు గడచిపోయినా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు సోమవారం కొండపై ఉన్నారు. ఎటుచూసినా భక్తులతో కొండ కిటకిటలాడుతోంది. సోమవారం ఉదయం 5గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం–1,2 క్యాకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఏనిమిదిగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ,మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 41వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. దర్శనం చేసుకోలేని భక్తులు అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి వెనుదిరుగుతున్నారు.

## భోగశ్రీనివాసమూర్తికి రేపు ప్రత్యేక సహస్రకలశాభిషేకం



**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంలో కొలువైన పంచబేరాలలో అత్యంత విశిష్టమైన, నిత్య అర్చనలందుకునే భోగ శ్రీనివాసమూర్తి ప్రతిష్ఠాపన దినోత్సవం 24వ తేదీన ఆలయంలో అత్యంత వైభవంగా జరగనుంది. ఆలయ గర్భాలయంలో విశేష సహస్ర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించేందుకు సర్వసిద్ధం చేస్తోంది. ఈ విశేష ఉత్సవానికి తిరుమల క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లవ రాణి సామవై (కాడవన్ పెరుందేవి) క్రీస్తు శకం 966వ సంవత్సరంలో భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకమూర్తి) వెండి విగ్రహాన్ని తిరుమలకు కానుకగా సమర్పించారు. పల్లవ రాణి ద్వారా ఆలయంలో ఈ ప్రతిష్ఠాపన జరిగిన చారిత్రక పవిత్ర దినాన్ని పురస్కరించుకుని ఏటా ఈ విశిష్ట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం తిరుమల ఆలయ గర్భాలయం నుండి దేవేరులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామితో బాటు, భోగ శ్రీనివాసమూర్తిని, ఆలయ రక్షకుడైన విష్వక్సేనులవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో గరుడాళ్వార్ సన్నిధికి ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక వేదికపై ఆశీనులను చేస్తారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వైదిక క్రతువులతో ఈ మహాపూజ ప్రారంభమవుతుంది.

## 29న పౌర్ణమి గరుడసేవ



**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** పౌర్ణమి ఘడియలో పున్నమివెలుగుల్లో 29వతేదీ సోమవారం సాయంత్రం తిరుమలలో గరుడసేవ జరగనుంది. ఆ రోజు మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతినెలా పౌర్ణమిరోజు గరుడసేవ టిటిడి నిర్వహిస్తోంది. భక్తుల కోరిక మేరకు విశేష ఆభరణాల అలంకృతుడై గరుడసేవ చేపట్టి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

## 7,938 కిలోల మిశ్రమ బియ్యం ఇ వేలం



**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాలకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన బియ్యాన్ని జూలై 7వ తేదీ ఇవేలం ద్వారా విక్రయించనున్నారు. టిటిడి ఆధ్వర్యంలో 7,938 కిలోల మిశ్రమ బియ్యాన్ని (20 లాట్లు) విక్రయిస్తారు. ఇ వేలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఆక్షన్ ఐడీ నంబర్ 26120 కింద జరగనుంది.వేలంలో పాల్గొనదలచిన వారు 50వేల రూపాయలు ఇఎండీ చెల్లించాలి. వివరాలకు హెచ్‌టిటిపి://కొనుగోలు. ఎపి.జివొవి. ఇన్‌వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అదేగాక టిటిడి వేలాల విభాగం జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని 0877-2264429నంబర్‌లో సంప్రదించవచ్చు.

## ఛార్జీల దోపిడీపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

### తిరుమలలో ప్రత్యేక తనిఖీలు



**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రికుల రద్దీతో తిరుమలకు వచ్చే భక్తులను తిరిగి తిరుపతికి వెళ్ళే వారిని నిలబెట్టి అధిక ధరలు వసూలుచేయడంపై తిరుమల పోలీసులు కొరఢా ఝుళిపించారు. భక్తుల ఫిర్యాదుతో సోమవారం తిరుమలలో అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె. విజయ శేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ పర్యవేక్షణలో ట్యాక్సీ డ్రైవర్లపై తనిఖీలు చేశారు. తిరుమల నుండి తిరుపతికి ప్రయాణించే భక్తుల నుంచి నిర్ణీత బస్సు చార్జీల కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న వాహనాలపై దృష్టి సారించారు. మొత్తం 42 వాహనాలను తనిఖీ చేయగా, అందులో 25 వాహనాలు భక్తుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తించి వాహనాలను సీజ్ చేయడం జరిగింది. నిబంధనలను ఉల్లంఘించినందుకు ప్రతి వాహనానికి వెయ్యి రూపాయలు లెక్కన మొత్తం 25వేల రూపాయలు జరిమానా విధించారు. వాహన యజమానులు , డ్రైవర్లకు భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రభుత్వం సంబంధిత శాఖలు నిర్ణయించిన చార్జీల ప్రకారమే రవాణా సేవలు అందించాలని ఆదేశించారు. భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా భక్తుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేయడం, జరిమానాలు విధించడం వంటి చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. తిరుమలకు వచ్చే భక్తులు కూడా అధిక చార్జీలు వసూలు చేసినట్లయితే వెంటనే ట్రాఫిక్ పోలీసులకు,సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## మృత్యుంజయునికి ప్రత్యేక పూజలు



**శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. ఆలయంలో మృత్యుంజయ స్వామికి ప్రతి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి.సాధారణంగా వర్షాభావంతో జనం తల్లడిల్లే సమయంలోనూ,. కరువుతో తల్లడిల్లుతున్న సమయంలో ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు పూజలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో సోమవారం మృత్యుంజయస్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకార జరిపారు.ఈ పూజల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశు పాల్గొన్నారు.

# ఓటర్ల నమోదుపై మంత్రి నారాయణ సమీక్ష



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 22 ప్రభాతవార్త :** నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 15నుంచి వచ్చేనెల 14వరకు ఓటర్ల జాబితా నమోదు, సవరణలు ప్రక్రియ ముమ్మరంగా సాగాలని ఆదేశించారు. ఫామ్–6, 7,8చే ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పేర్లసవరణలు, ఎలాంటి లోపాలు లేకుండా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల బిఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ పారాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, వచ్చేనెల 14లోపు ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని డెడ్‌లైన్ విధించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, అదనపు కమిషనర్ హిమబిందు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వార్త

బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడిన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

-ఆండర్సన్

# సర్దుకుందామా? సర్దుకుపోదామా!

దేశ రాజకీయ పార్టీల అధికారిక చట్టసభల సభ్యుల్లో ఒకింత చలనం వచ్చి సంచలనాలకు దారితీస్తోంది. నైతిక బలంతో ముందుకు సాగిపోవాల్సిన సభ్యులు అధికారం లేకుంటే ఏమీ చేయలేమనో గిట్టుబాటు కాదనో నెమ్మదిగా సొంత పార్టీల నుంచి జారుకుంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో తామున్న పార్టీలు ఇటీవల ఎన్నికలలో ఓటమి చెందగానో తమ నేతల ప్రవర్తన బాగోలేదనో, మరో ఐదేళ్ల చేసేదేమీ ఉండదనో పక్క చూపులు చూస్తున్నారు. అధికారం ఉన్నాన్నాళ్లూ అధినాయకుని, అధినేత్రి కనుసన్నుల్లో మెలిగిన వారు సైతం 'నాకేంటి' అన్న ధోరణిలో మెలగుతున్నారు. మరో ఐదేళ్ల అధికారంలో ఉంటానో ఉండనో దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకో వచ్చుననే రాజకీయ క్రీడా వినోదాలు ప్రేక్షకునికి, పాఠకునికి, విశ్లేషకులకు మంచి అవకాశాన్ని కలిగిస్తున్నాయి. తమిళనాడులో అధికారం మారగానే చిన్నచితకా పార్టీలు సైతం అతిపెద్ద పార్టీల కూటమి నుంచి బయటకొచ్చేస్తున్నారు. పరాయి పార్టీ అధికారంలోకి రాగానే అసలు సిసలు ఇన్నాళ్లూ అంటిపెట్టుకున్న పార్టీలకు గుడ్‌బై చెప్పడం చూస్తున్నాం.ద్రవిడ పార్టీలుగా దాదాపు అర్ధశతాబ్దం పాటు తమిళ రాజ్యాన్నేలిన పార్టీలు ఇప్పుడు కకావికలౌతున్నాయి. ఎన్నికలయ్యేవరకు ఒక సిద్ధాంతం, ఎన్నికలయ్యాక మరోసిద్ధాంతం, మరో జాతీయ పార్టీలతో స్నేహహస్తం కోసం ఇంకో సిద్ధాంతం తీరా పరిపాలనలోసొంత అజెండా ఇవన్నీ ఆయా పార్టీలకు అనుభవైక వైద్యమే. అధికారంలో ఉన్నప్పుడు ఆధిపత్య ధోరణిలో పాలనా పగ్గాలు చేపట్టి వారిలో అంటకాగి తాజాగా అధికారం కోల్పోయాక కాడి, మేడిని తన్నితగలేసి ఒక్కొక్కరూతమ దారి తాము చూసుకుంటున్నారు. ఒకనాడు వీరందరి ఆసరాతో 'మళ్లీ మేమే' అని మీసం తిప్పిన పెద్ద పార్టీలు ఇప్పుడు బోర్లాపడ్డున్నాయి. తమిళనాడులో దళపతి విజయ్ స్థాపించిన కొత్త పార్టీ టి.వి.కె (తమిళగ వెట్రి కజగం) అధికారంలోకి రాగానే తాము పాత దొరలతోటే అన్న వివిధ పార్టీల తంబిలు రొంబ విన్యాసాలు చేస్తున్నాయి. అన్నాడిఎంకె అధినేత నిర్ణయాలతో విబేధించి ఆ పార్టీ నుంచి చీలిక తేవాలని చూసిన వారు ప్రస్తుతానికి అక్కడే సర్దుకుపోయారు. కొందరైతే ప్రజాస్వామ్య పద్ధతిలో రాజీనామాలు చేసి మరో 'టివికె' పంచన చేరారు. ఒక విధంగా ఇదొక మంచి పద్ధతే. 'మా దయా దాక్షిణ్యాల మీదనే మళ్లీ ఎన్నికలు తక్షణమే రాకూడదనే టివికెకి ఒక అవకాశమిచ్చాం' అని చెప్పుకునే ద్రవిడమున్నేట కజగంపార్టీకే ఇప్పుడు షాక్‌ల మీద షాకులు తగులుతున్నాయి. డిఎంకెతో దాదాపు మూడు దశాబ్దాలుగా కలిసి కట్టుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, తొలినాడే తమ కూటమికి తిలోదకాలిచ్చేసింది. 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికయ్యది' అన్న ధోరణిలో డిఎంకె కూటమి పార్టీలు ఆలోచనలు వేగవంతం చేశాయి. రాష్ట్రంలో వచ్చిన కాలమాన రాజకీయ పరిస్థితులంటూ తాజాగా ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) డిఎంకె కూటమికి బైబై చెప్పేసింది. వారిది అయిదున్నర దశాబ్దాల స్నేహ ప్రమాణం. ఈ మధ్యకాలంలో దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలలో పొత్తు కుదుర్చుకునే సందర్భంలోనే 'మా పొత్తు ఎన్నికల వరకే... తర్వాత సంగతి తర్వాత తెలుస్తాం' అని ముందస్తు వ్యాఖ్యలలో 'లొల్లి' లేకుండా బయటపడే ప్రయత్నం చేసింది. పొత్తు మాటల్లో సామాజిక సమీకరణాలు తేలక, అంతర్గత విభేధాలు, అయినా భాగస్వామ్యంలో కొనసాగాల్సి వచ్చినప్పుడు ఇలాంటి మాటలు దొర్లడం సహజం. ఆ పిమ్మట కూటమి గెలిస్తే ఓ మాట,గెలవకపోతే ఓమాట అక్కరకొస్తుంది. కూటమి గెలిచినప్పుడు అధికార ప్రాతినిధ్యం దగ్గర ఎలాగూ పేచీలు తప్పవు. ఇచ్చేవాళ్లు, పుచ్చుకునే వాళ్లుగా విడిపోయి అంతర్గత పోరులో గత్యంతరంలేక సర్దుకుపోతారు.తాజా పరిస్థితులలో తనకు ఇన్నాళ్లూ వెన్నంటిఉన్న మైనారిటీ భాగస్వామిని కోల్పోవడం డిఎంకెకు తీవ్ర నష్టమే. సిఎం విజయం నేతృత్వంలోని టివికెకు ఐయుఎంఎల్‌సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అన్నాడిఎంకె కూటమిలో ఉన్న ఎండిఎంకె అధినేత ప్రేమలత విజయ్ గెలుపొందగానే ఆ కూటమి నుంచి బయటపడకపోయినా వేరే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి తద్వారా జనం కోసం ఉద్యమిస్తానన్నారు. తానెపుడూ ప్రజాసేవకు అందు బాటులోనే ఉంటానని సంకేతాలు పంపారు. 108స్థానాలను కైవసం చేసుకున్న టి.వి.కె దళపతి విజయ్ పార్టీని ప్రకటించగానే ఎన్నో సమూహాలు అతని పక్కనచేరాయి. దాంతో తాజాగా 2కోట్ల సభ్యత్వం పెరిగింది. ఆ ఊపుతో తన పార్టీవిస్తరణ కార్యక్రమాన్ని 'మై టివికె' అనే మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వం చేపట్టారు.దీనికేవిశేష స్పందన లభించింది. రెండు కోట్లసభ్యత్వ నమోదు లక్ష్యంఇప్పుడు నెరవేరింది. కేవలం తమిళ తంబిలకు వారి కుటుంబాలకు మాత్రమే ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వంటి ధృవీకరణ పత్రాలతో సభ్యత్వాన్ని కల్పిస్తున్నారు. తమిళ రాజకీయాల్లో వేగుచుక్క మాదిరి విజయ్ పాలనాపగ్గాలు చేపడితే మాజీ ఐపిఎస్ అధికారి, మాజీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు అన్నామలై పాత్రనుకూడా విశేషంగా చెప్పుకోవాలి.ఇతని ఆత్మస్థైర్యాన్ని విశేషంగా చెప్పుకోవాలి.ఇద్దరూ దాదాపు తమిళనాడులో ద్రవిడపార్టీ అధిపత్యాన్ని సవాల్ చేస్తున్నవారే.అధికారం లేకపోయినా అన్నామలై పిలుపుకు వెంట వచ్చినవారూ తక్కువేం కాదు. 'వుయ్ దిలీడర్' ఇదొక స్వచ్ఛంద వేదిక. ప్రజాసమస్యల కేంద్ర బిందువుగా పనిచేయడానికి ఏర్పాటైన సంస్థ. ఇప్పుడా సంస్థలో చేరిన సభ్యుల సంఖ్య 18లక్షలమంది సభ్యత్వం తీసుకున్నారు. రాజకీయాల్లో చేరని వారు,చేరలేనివారు,ఆసక్తి నచ్చునివారే ఈ వేదిక సభ్యులు కాగలగుతారు. అదే నిజమైతే ప్రజాసమస్యల్ని బయటపెట్టడంలో అన్నామలై, వాటి పరిష్కారంలో ముఖ్యమంత్రి విజయ్ తమిళులకు సమాంతర దిక్సూచిలుగా మారతారేమో చూడాల్సిందే.



మీరు చేయబోయే పని ఆధారంగా పేరు ప్రఖ్యాతులు పొందలేరు. చేసిన పని ద్వారా మాత్రమే.

హెన్రీఫోర్డ్



బలహీనులు అదృష్టాన్ని నమ్ముకుంటే, బలవంతులు కృషిని నమ్ముకుంటారు.

ఎమర్సన్

## ప్రజావాక్కు

### యోగాంధ్ర

అంతర్జాతీయ యోగాదినోత్సవం రోజు రాందేవ్ బాబాచే శిక్షణ ఇప్పించేందుకు ఆయన్ను ఆహ్వానించేందుకు ప్రభుత్వం కొంతమందిని హరి ద్వారా పంపి అక్కడనుండి రామ్‌దేవ్‌ను అమరావతి తీసుకొచ్చారు. కల్తీ సరుకులు , కల్తీమందులు అమ్మినందుకు సుప్రీం కోర్టు రాందేవ్‌కు అరెస్ట్ వారెంట్లు ఇచ్చింది. ఎన్నోసార్లు చీవాట్లు పెట్టింది. ఈవిషయం మీకు తెలియదా చంద్రబాబు గారూ. ఈయన సరుకులను, మందులను కొన్ని రాష్ట్రప్రభుత్వాలు నిషేధించాయి. చంద్రబాబును మంచి చేసుకొని విశాఖపట్నం దగ్గర గతంలో స్వరూపానందకు కాన్సిల్ చేసిన కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములను కొట్టేయడానికి రాందేవ్ పన్నాగం.ఎక్కడైనా పాలకులు, ప్రజలు, కార్యక్రమాలకు శాస్త్రవేత్తలను ఆహ్వానిస్తారు. కానీ మనదేశంలో పాలకులు సాధువులను, సన్యాసులును ఆహ్వానిస్తారు. వారికి సాష్టాంగ పడతారు. చాలా విచారకరం. ఈరోజు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు యోగా పిచ్చి బాగా పట్టింది. యోగా శాస్త్రీయం కాదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అవసరం

లీక్ అనే పదానికి పెద్దపులే భయపడినట్టు ఒక స్టోరీ గత పదవ తరగతి సిలబస్‌లో ఉండేది.కానీ ఎర్రర్ ఫ్రీ క్వశ్చన్ పేపర్ ఇవ్వవలసిన బాధ్యత విద్యాశాఖ అందరి అధికారులపై ఉంటుంది. తీగలాగితే డొంకంతా కదులుతుంది. ఎవరు ముందుపడితే వారిని టార్గెట్‌చేస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వారిని అయితే అంధేరా యూనివర్సిటీ అధికారులు అనవచ్చు. ఒకే క్వశ్చన్‌పేపర్ ఇచ్చి రెగ్యులర్ వాళ్ళకి గ్రేస్‌మార్కులు ఇస్తారు. బెటర్మెంట్ లేదా స్పెషల్ డ్రైవ్‌లో అదే క్వశ్చన్ పేపర్ వ్రాసిన వారికి ఎలాంటి గ్రేస్ మార్కులు ఇవ్వడం లేదు. భారతదేశం మొత్తం మీద కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అత్యంత అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తం

ఈ రోజుల్లో సైబర్ రకరకాల పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారు. అమాయకులైన రైతులు, వృద్ధులు, ప్రజలే వాళ్ల మొదటి టార్గెట్ చేసి ఫోన్లు చేసి సొమ్ము కాజేసుకుంటున్నారు. సైబర్‌నేరగాళ్ల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉందాం. పది మందికి అవగాహన కల్పిద్దాం. అందరూ జాగ్రత్తతో మెలగాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి

ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఫుట్‌బాల్ క్రీడ పట్ల ప్రదర్శిస్తున్న వివక్ష, క్రికెట్‌కు మాత్రమే లభిస్తున్న గుత్తాధిపత్యం, ప్రభుత్వనిధులు, ప్రసార మాధ్యమాల ప్రాధాన్యత మన క్రీడావ్యవస్థలోని తీవ్రలోపాన్ని సూచిస్తున్నాయి. దేశంలో అపారమైన స్థానిక ప్రతిభ ఉన్నప్పటికీ, దాదాపు తొంభై శాతానికి పైగా స్టేడియాలు ఆడేందుకులనువైన పచ్చటి మైదానాలుగా కాకుండా సాధారణ మట్టి నిలయాలుగానే మిగిలిపోవడం విచారకరం. ఫుట్‌బాల్ క్రీడకు ప్రభుత్వ క్రీడా బడ్జెట్ కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. క్రికెట్ వ్యవస్థ వెలుపల ఉన్న ఏ ఇతర క్రీడను ప్రోత్సహించడానికి తగిన రాజకీయ సంకల్పం లేదని ఇది నిరూపిస్తోంది.ఈ నిస్తేజ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా ప్రతి జిల్లాలో కార్పొరేట్ నిధుల మద్దతుతో నడిచే లీగ్‌లను తప్పనిసరి చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం ఒక అత్యాధునిక టర్ఫ్ మైదానాన్ని నిర్మించడం అత్యవసరం.

- సి.హెచ్.ప్రతాప్ , శ్రీకాకుళం

### విద్యుత్ అంతరాయాన్ని తొలగించాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఆక్వా రంగాన్ని ఆదుకోవడం అత్యవసరంగా మారింది. దేశ విదేశీ మార్పిడి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగంప్రస్తుతం తీవ్రసంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో రొయ్యలు, చేపల ధరలు పతనం కావడం, రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రైతులు కోట్లలో నష్టపోతున్నారు. ఆక్వాప్రాసెసింగ్ కంపెనీలు, మధ్యవర్తుల సిండికేట్ వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాధుల విజృంభణ వల్ల పంట నష్టం జరిగి పెట్టుబడులు కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈరంగాన్నిరక్షి ంచడానికి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. విద్యుత్ రాయితీలను పునరుద్ధరించి, అంత రాయం లేని విద్యుత్ అందించాలి.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### రాజకీయ బెదిరింపులు ఆపాలి

కొందరు రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రాజకీయ అండతో, పలుకుబడితో భూమి కబ్జాలు, రోడ్లు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలాచేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.వీరిపై పోలీస్‌శాఖ ద్వారా కౌన్సిలింగ్‌చేయాలి. వీరు చేపట్టే రాజకీయ బెదిరింపులను ఆపాలి.

-కదురు శ్రీనివాస్,వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పాదచారులకు భద్రత కల్పిస్తున్నామా?

**రోడ్డు ప్రమాదాలు సహజ విపత్తులు కావు. సరైన విధానాలు, మెరుగైన రూపకల్పన, రాజకీయ సంకల్పం ఉంటే వాటిని గణనీయంగా తగ్గించవచ్చని ప్రపంచ అనుభవం చెబుతోంది. అంతిమంగా, సుప్రీంకోర్టు తాజా తీర్పు ఫుట్‌పాత్‌ల గురించి మాట్లాడినట్లు కనిపించినా, వాస్తవానికి అది అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఒక దేశం ఆధునికతను కొలిచేది దాని వాహనాల వేగం కాదు. రోడ్డు మీద నడిచే అత్యంత సాధారణ వ్యక్తి కూడా భయపడకుండా, గౌరవంగా తన గమ్యాన్ని చేరుకోగలుగుతున్నాడా లేదా అన్నదే అసలు ప్రమాణం. ఎందుకంటే రహదారులు కేవలం వాహనాల కోసం నిర్మించబడవు. అవి మనుషుల కోసం నిర్మించబడతాయి. ఒక సమాజం తన పాదచారులకు ఇచ్చే భద్రతే, చివరికి మానవ జీవితానికి అది ఇచ్చే విలువను ప్రతిబింబిస్తుంది.**

డి వి బి శ్రీహరిన్

భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా రహదారి మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్న దేశాలలో ఒకటి. కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు, ఫ్లైఓవర్లు, రింగ్ రోడ్లు అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి మధ్య ఒక విచిత్రమైన వైరుధ్యం కనిపిస్తోంది. వాహనాల వేగం పెరుగుతోంది. ప్రయాణ సమయం తగ్గుతోంది. అయితే రోడ్డు మీద నడిచే మనిషి భద్రత మాత్రం అదే స్థాయిలో పెరగడం లేదు. కోట్ల రూపాయలతో నిర్మించిన రహదారులపై కార్లు వేగంగా దూసుకుపోతున్నాయి. కానీ బస్‌స్టాప్ నుంచి ఇంటికి వెళ్లే ఒక సాధారణ పౌరుడికి, పాఠశాలకు వెళ్లే ఒక చిన్నారికి, ఆసుపత్రికి వెళ్లే ఒక వృద్ధుడికి సురక్షితంగా నడిచే స్థలం కూడా లభించని పరిస్థితి అనేక నగరాల్లో కనిపిస్తోంది. ఈ వైరుధ్యాన్ని గుర్తు చేస్తూ జూన్ 19న భారత సుప్రీంకోర్టు ఒక కీలక తీర్పు ఇచ్చింది. జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ ఎ.ఎస్. చంద్రూర్కర్‌లతో కూడిన ధర్మాసనం గుర్తించిన ఫుట్‌పాత్‌లపై సురక్షితంగా నడిచే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(డి), ఆర్టికల్ 21ల నుంచి ఉద్భవించిన ప్రాథమిక హక్కు అని స్పష్టం చేసింది. పాదచారులకు భద్రమైన మార్గాలను కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొంది. పైకి చూస్తే ఇది ఫుట్‌పాత్‌లకు సంబంధించిన తీర్పులా కనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే, ఇది దేశంలో అభివృద్ధి ఎవరిని కేంద్రంగా ఉంచుకొని సాగాలనే ప్రశ్నను ముందుకు తెచ్చిన తీర్పు.ఈ ప్రశ్నకు నేపథ్యం ఉంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గణాంకాలు చెబుతున్నది ఏమిటంటే, రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో గణనీయమైన భాగం ద్విచక్ర వాహనదారులు, పాదచారులే. ప్రతి ఏడాది వేలాది మంది నడుస్తూనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మరణాలను సాధారణ ప్రమాదాలుగా చూసి మర్చిపోవడం సులభమే. కానీ అవి కేవలం వ్యక్తిగత విషాదాలు మాత్రమే కావు. కుటుంబాలు ఆధారాన్ని కోల్పోతాయి. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతారు. ఒక ప్రమాదం ప్రభావం అనేక జీవితాలపై పడుతుంది.అందుకే రోడ్డుభద్రత అనేది ట్రాఫిక్ శాఖ పరిధిలో ముగిసిపోయే అంశం కాదు, అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సంక్షేమానికి సంబంధించిన అంశం. అయితే ఈ పరిస్థితికి కారణం కేవలం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే డ్రైవర్లేనా? అలాగైతే సమస్యకు పరిష్కారం జరిమానాలను పెంచడం ద్వారా దొరికిపోయేది. కానీ అనుభవం వేరే విషయాన్ని చెబుతోంది. ఫుట్‌పాత్‌లు లేకపోవడం, ఉన్నచోట ఆక్రమణలకు గురికావడం, జీబ్రా క్రాసింగ్‌లు లేకపోవడం, వీధి దీపాల కొరత, అధిక వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లు లేకపోవడం వంటి అంశాలు ప్రమాదాలను మరింత పెంచుతున్నాయి. అంటే సమస్య మనుషుల ప్రవర్తనలో మాత్రమే లేదు, రోడ్ల రూపకల్పనలో కూడా ఉంది. ఇక్కడే మరింత ప్రాథమికమైన ప్రశ్న తలెత్తుతోంది. మనం రహదారులను ఎవరిని దృష్టిలో పెట్టుకొని నిర్మిస్తున్నాం?



గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధిని ప్రధానంగా వాహనాల వేగంతో కొలుస్తూ వచ్చాం. రహదారులు వెడల్పు కావడం, ఫ్లైఓవర్లు పెరగడం, ప్రయాణ సమయం తగ్గడం ఆధునికతకు సూచికలుగా మారాయి. కానీ నడిచే మనిషికి ఎంత స్థలం దక్కుతోంది అన్న ప్రశ్న వెనుకబడిపోయింది. ఫలితంగా రహదారులపై అత్యంత బలహీనమైన వర్గమే అత్యంత అసురక్షితమైన వర్గంగా మారింది. నిజానికి పాదచారుల సమస్య ట్రాఫిక్ సమస్య మాత్రమే కాదు, అది సామాజిక న్యాయ సమస్య కూడా. ఎందుకంటే నడకపై అత్యధికంగా ఆధారపడేవారు పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, రోజువారీ కూలీలు, ప్రజారవాణాను ఉపయోగించే సాధారణ ప్రజలు. వ్యక్తిగత వాహనాలు కలిగినవారికి ప్రత్యామ్నాయాలు ఉండవచ్చు. కానీ పాదచారులకు రోడ్డు తప్ప మరో మార్గం ఉండదు. అందువల్ల పాదచారుల భద్రతను నిర్లక్ష్యం చేయడం అంటే సమాజంలోని అత్యంత బలహీన వర్గాల భద్రతను నిర్లక్ష్యం చేయడమే. ప్రపంచంలోని అనేక దేశాలు ఈ వాస్తవాన్ని చాలా ముందుగానే గుర్తించాయి. స్వీడన్‌లో అమలవుతున్న విజన్ జీరో విధానం ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో ఒక్క మరణం కూడా ఆమోదయోగ్యం కాదు. నెదర్లాండ్స్‌లో రహదారి రూపకల్పనలో పాదచారులు, సైక్లిస్టులకు ప్రాధాన్యం ఇస్తారు. జపాన్‌లో పాఠశాలల పరిసర ప్రాంతాల్లో వేగ నియంత్రణ అత్యంత కఠినంగా అమలవుతుంది. ఈ దేశాలు ఒక ముఖ్యమైన సూత్రాన్ని అంగీకరించాయి. మనుషులు తప్పులు చేయవచ్చు. కానీ ఆ తప్పులు ప్రాణాలను బలితీసుకోకుండా వ్యవస్థను రూపొందించడం ప్రభుత్వాల బాధ్యత. భారతదేశంలో పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చు. కానీ ఆ సూత్రం మనకు కూడా వర్తిస్తుంది. అందుకే సుప్రీంకోర్టు తీర్పును కేవలం న్యాయపరమైన నిర్ణయంగా చూడలేం. ఇది ప్రభుత్వాలకు ఒక విధానపరమైన హెచ్చరిక.ప్రతి కొత్త రహదారిలో ఫుట్‌పాత్‌లను తప్పనిసరి చేయడం, ఇప్పటికే ఉన్న రహదారులను దశలవారీగా పాదచారులకు అనుకూలంగా మార్చడం, పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్ల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా మండలాలను ఏర్పాటు చేయడం, యూనివర్సల్ డిజైన్ ప్రమాణాలను అమలు చేయడం వంటి చర్యలు ఇకపై ఐచ్ఛికాలు కావు. నిజమే, ఈ మార్పు సులభం కాదు. ఆక్రమణలు, నిధుల కొరత, శాఖల మధ్య సమన్వయ లోపం, నిర్వహణలో నిర్లక్ష్యం వంటి సమస్యలు ఉన్నాయి. కానీ రోడ్డు ప్రమాదాలు సహజ విపత్తులు కావు. సరైన విధానాలు, మెరుగైన రూపకల్పన, రాజకీయ సంకల్పం ఉంటే వాటిని గణనీయంగా తగ్గించవచ్చని ప్రపంచ అనుభవం చెబుతోంది. అంతిమంగా,సుప్రీంకోర్టు తాజాతీర్పు ఫుట్‌పాత్‌ల గురించి మాట్లాడినట్లు కనిపించినా, వాస్తవానికి అది అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఒక దేశం ఆధునికతను కొలిచేది దాని వాహనాల వేగం కాదు. రోడ్డు మీద నడిచే అత్యంత సాధారణ వ్యక్తి కూడా భయపడకుండా, గౌరవంగా తనగమ్యాన్ని చేరుకోగలుగుతున్నాడా లేదా అన్నదే అసలు ప్రమాణం. ఎందుకంటే రహదారులు కేవలం వాహనాల కోసం నిర్మించబడవు. అవి మనుషుల కోసం నిర్మించబడతాయి. ఒక సమాజం తన పాదచారులకు ఇచ్చే భద్రతే, చివరికి మానవ జీవితానికి అది ఇచ్చే విలువను ప్రతిబింబిస్తుంది. ●

# నైపుణ్యమే నేటి ఉద్యోగానికి పాస్‌పోర్ట్!

తిప్పర్తి శ్రీనివాస్

ప్రపంచీకరణ, డిజిటలీకరణ కృత్రిమ మేధస్సు ప్రభావంతో ఉపాధి రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు విద్య పూర్తయిన తరువాత ఉద్యోగం కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండేది. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకున్న వారికే అవకాశాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు లేదా ఆధునిక శిక్షణా కేంద్రాలు యువతకు అవసరమైన సాంకేతిక, వృత్తిపర, వ్యక్తిత్వ నైపుణ్యాలను అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా డాట్‌కామ్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో ఏటీసీల ద్వారా నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలకు బలమైన వేదికగా నిలుస్తోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ జనాభాను సక్రమంగా వినియోగించుకోవాలంటే విద్యతోపాటు నైపుణ్యాభివృద్ధి అత్యవసరం. సాధారణ డిగ్రీలు లేదా సంప్రదాయ విద్య మాత్రమే నేటి ఉద్యోగ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. కంపెనీలు సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, డిజిటల్ పరిజ్ఞానం,జట్టు నాయకత్వ లక్షణాలను కోరుతున్నాయి. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏటీసీలు విద్యార్థులు, ఉద్యోగార్థులకు ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాయి. డాట్‌కామ్ రంగం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటి. ఈకామర్స్, డిజిటల్ మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, ఫిన్‌టెక్ వంటి విభాగాలు లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఈరంగాల్లో పనిచేయాలంటే కేవలం విద్యార్హత సరిపోదు. సంబంధిత నైపుణ్యాలుకూడా అవసరం. ఈ ఖాళీని పూరించడంలో ఏటీసీలు సమర్థవంతంగా వ్యవహరిస్తున్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ మార్కెట్‌లో అవసరమైన ఆధునిక పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతోంది. అనేక శిక్షణా కేంద్రాలు పరిశ్రమలతో భాగస్వామ్యం ఏర్పరచుకొని ప్రాక్టికల్ శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు ఆధారిత అభ్యాసాన్ని అందిస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులు కేవలం సిద్ధాంత



జ్ఞానానికే పరిమితం కాకుండా వాస్తవ కార్యాచరణ అనుభవాన్ని కూడా పొందుతున్నారు. ఫలితంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం డాట్‌కామ్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువతను వెతుకుతున్నాయి. రిమోట్ వర్క్, ఫ్రీలాన్సింగ్, గిగ్ ఎకానమీ వంటి కొత్త విధానాల కారణంగా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా అంతర్జాతీయ స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు మెట్రో నగరాల్లో మాత్రమే లభించే ఉద్యోగాలు నేడు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ ప్రాంతానికైనా విస్తరించాయి. అయితే ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలు తప్పనిసరి. అందుకే ఏటీసీల ప్రాధాన్యం మరింత పెరిగింది. ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా యువతలో ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ కార్యక్రమాలకు అనుబంధంగా పనిచేస్తున్న శిక్షణా కేంద్రాలు లక్షలాది మంది యువతకు శిక్షణ అందిస్తున్నాయి.ముఖ్యంగా మహిళలు, గ్రామీణ యువత, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలను విస్తరించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే సరిపోవు. వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషా ప్రావీణ్యం, కమ్యూనికేషన్ సామర్థ్యం,సమయ పాలన, నాయకత్వ లక్షణాలు వంటి సాఫ్ట్‌స్కిల్స్ కూడా సమానంగా అవసరం. డాట్‌కామ్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలవారితో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. అందువల్ల వృత్తిపరమైన ప్రవర్తన,సమర్థవంతమైన కమ్యూనికేషన్ కూడా విజయానికి కీలక అంశాలుగా మారాయి. ఈ అంశాలపై కూడా ఏటీసీలు ప్రత్యేక శిక్షణను అందించాలి. ఒకసారి నేర్చు కున్న నైపుణ్యం జీవితాంతం సరిపోదు. కొత్త సాంకేతికత లను ఎప్పటికప్పుడు నేర్చుకోవడంద్వారా మాత్రమే ఉద్యోగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవచ్చు. మొత్తానికి, ఏటీసీలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు దేశ యువశక్తిని ఉత్పాదక శక్తిగామార్చగలవు. డాట్‌కామ్ రంగంలో విస్తరిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇవి బలమైన పునాదిగా నిలుస్తాయి. విద్య,నైపుణ్యం పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఈ కేంద్రాల పాత్ర అమూల్యం. యువత తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకొని డిజిటల్ ప్రపంచంలో విజయవంతమైన వృత్తి జీవితాన్ని నిర్మించుకోవాలంటే నైపుణ్యాభివృద్ధిని ఒక నిరంతర ప్రక్రియగా స్వీకరించాలి. అదే దేశ ఆర్థికాభి వృద్ధికి, యువత భవిష్యత్తుకు, సమాజ పురోగతికి సుస్థిర మార్గం అవుతుంది. ●

# 'పిఎంకిసాన్'కు కొత్త ఊపిరి అవసరం

అప్పన్న గొనప

దేశంలో వ్యవసాయం ఇప్పటికీ కోట్లాది కుటుంబాల జీవనాధారం. భారత ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక, సేవా రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ,వ్యవసాయం ప్రాధాన్యత మాత్రం తగ్గలేదు. రైతు బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనే భావనతో కేంద్రప్రభుత్వం 2019లో ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు సంవత్సరానికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో రూ.2,000 చొప్పున నేరుగా బ్యాంకుఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రారంభ సమయంలో ఇది రైతులకు కొంత ఉపశమనం కలిగించినా, నేటి పరిస్థితుల్లో ఈ మొత్తం రైతుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019లో ఎరువుల ధరలు, విత్తనాల ఖర్చులు, కూలీల వేతనాలు, సాగు వ్యయాలు ఒక స్థాయిలో ఉండేవి. కానీ గత ఏడు సంవత్సరాల్లో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఎరువుల ధరలు గణనీయంగా పెరిగాయి. డీజిల్ ధరలు పెరగడంతో సాగు ఖర్చులు అధికమయ్యాయి. వ్యవసాయ యంత్రాల వినియోగం పెరిగింది. ఆధునిక సాంకేతికతలు, డ్రిప్ ఇరిగేషన్, మైక్రో న్యూట్రియంట్స్, నాణ్యమైన విత్తనాల వాడకం వంటి అంశాలు రైతుల ఖర్చును మరింత పెంచాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పటికీ 2019లో నిర్ణయించిన అదే రూ.6,000 మొత్తాన్ని కొనసాగించడం రైతులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకోనట్టే కనిపిస్తోంది. ప్రస్తుతం ఒక ఎకరం వరి సాగుకు సగటున రూ.30,000 నుంచి రూ.50,000 వరకు ఖర్చు అవుతోంది. ఇతర పంటల సాగులో కూడా ఇదే పరిస్థితి ఉంది.అలాంటి సమయంలో ఏడాదికి కేవలం రూ.6,000 ఇవ్వడం ద్వారా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. అందువల్ల పీఎంకిసాన్ కింద అందించే ఆర్థిక సహాయాన్ని కనీసం రూ.10,000 నుంచి రూ.12,000 వరకు పెంచాల్సిన అవసరం ఉంది. రైతులకు అందే ఈ మొత్తం పెరిగితే సాగు ప్రారంభ సమయంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి కొంతవరకు ఉపయోగపడుతుంది. ఇంకా ముఖ్యంగా పథకం అమలులో ఉన్న నిబంధనలను కూడా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉంది. పీఎంకిసాన్ ప్రారంభ సమయంలో భూ రికార్డుల్లో పేర్లు ఉన్న రైతులకే ప్రయోజనం అందింది. అయితే అనంతరం వారసత్వంగా భూములు పొందిన అనేక మంది రైతులు ఇప్పటికీ ఈ పథకం పరిధిలోకి రాలేకపోతున్నారు. కుటుంబ పెద్ద మరణించిన తరువాత భూమి వారసుల పేర్లకు మారినా,వివిధ సాంకేతిక, పరిపాలనా కారణాలవల్ల కొత్త రైతులకు ప్రయోజనం అందడం లేదు. ఫలితంగా వాస్తవంగా వ్యవసాయం చేస్తున్న రైతులు కూడా పథకం నుంచి దూరమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూముల వారసత్వ మార్పిడి ప్రక్రియ చాలా కాలం పడుతోంది. కొన్నిచోట్ల భూ వివాదాలు, రికార్డుల సవరణల ఆలస్యం, సాంకేతిక లోపాల కారణంగా రైతులు పీఎంకిసాన్ లబ్ధి పొందలేకపోతున్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కొత్త వారసుల



నమోదుకు అవకాశం కల్పించాలి. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో భూమి వారసత్వ బదలీలు పూర్తయిన వెంటనే పీఎంకిసాన్‌లో స్వయంచాలక నమోదు జరిగే విధానం తీసుకురావాలి. కోవిడ్ మహమ్మారి తరువాత వ్యవసాయ రంగంలో కూడా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రైతుల ఆదాయం ఆశించినంతగా పెరగలేదు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షాలు, మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు ప్రత్యక్ష నగదు సహాయం మరింత అవసరమైంది. అందుకే పీఎంకిసాన్‌ను కేవలం సంక్షేమ పథకంగాకాకుండా వ్యవసాయ స్థిరత్వానికి బలమైన మద్దతు పథకంగా మార్చాల్సిన అవసరం ఉంది. రైతుల అభివృద్ధి కేవలం నగదు సహాయంతోనే సాధ్యంకాదు. బ్యాంకు రుణాల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం మరింత చొరవ చూపాలి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలు సున్నా వడ్డీ లేదా పావలా వడ్డీతో రైతులకు రుణాలు అందిస్తున్నాయి. అయితే దేశవ్యాప్తంగా ఒకే విధానం లేదు. ఫలితంగా రాష్ట్రాన్ని బట్టి రైతులకు లభించే ప్రయోజనాలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చిన్న, సన్నకారు రైతులకు సున్నా వడ్డీతో వ్యవసాయ రుణాలు అందించే విధానాన్ని రూపొందించాలి. దీనివల్ల రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. వ్యవసాయ రుణాల మంజూరులో ఉన్న క్లిష్టమైన విధానాలను కూడా సరళీకరించాలి. చిన్న రైతులు బ్యాంకుల చుట్టూ తిరగకుండా గ్రామ స్థాయిలోనే రుణాల మంజూరు జరిగే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, బ్యాంకింగ్ ప్రతినిధుల ద్వారా రుణాల ప్రక్రియను సులభతరం చేయాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసింది. పీఎంకిసాన్ కూడా వాటిలో ఒక ముఖ్యమైన పథకం. అయితే కాలానుగుణంగా పథకాలలో మార్పులు చేయడం కూడా అంతే అవసరం. 2019లో నిర్ణయించిన ప్రమాణాలు2026లో కూడా యథాతథంగా కొనసాగడం సమంజసం కాదు. రైతుల అవసరాలు, సాగు ఖర్చులు, ఆర్థిక పరిస్థితులు మారినప్పుడు పథకాలూ మారాలి. పీఎంకిసాన్ మొత్తాన్ని పెంచడం, కొత్త వారసత్వ రైతులను చేర్చడం, భూ రికార్డుల ఆధునీకరణ చేయడం, రైతులకు సున్నా వడ్డీ రుణాలు అందించడం, చిన్న సన్నకారు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి సంస్కరణలు అమలు చేస్తే ఈ పథకం మరింత ప్రభావవంతంగా మారుతుంది. రైతు ఆదాయం పెరగడం, వ్యవసాయం లాభదాయకంగా మారడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం వంటి లక్ష్యాలు కూడా సులభంగా సాధ్యమవుతాయి. దేశానికి అన్నం పెట్టే రైతు ఆర్థికంగా బలపడితేనే అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరుతాయి. అందువల్ల పీఎంకిసాన్ పథకాన్ని ప్రస్తుత పరిస్థి తులకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించి, రైతుల వాస్తవ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సవరించ దం కాలానుగుణ అవసరంగా మారింది. రైతుకు భరోసా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరింత ముందడుగు వేస్తే, అది వ్యవసాయ రంగానికే కాకుండా దేశ భవిష్యత్తుకూ మేలు చేస్తుంది. ●

# చక్కెర ఎగుమతులపై నిషేధం?



## బలపడుతున్న ఎల్ నినో... రుతుపవనాలు కనుమరుగు

### చెరకు ఉత్పత్తిపై గణనీయ ప్రభావం : కేంద్రం తాజా యోచన

**న్యూఢిల్లీ, జూన్ 22:** బలపడుతున్న ఎల్ నినో వాతావరణ సరళి భారతదేశ చక్కెర పరిశ్రమకు ఆందోళనలను కలిగిస్తోంది. చక్కెర ఉత్పత్తి ఒత్తిడికి గురైతే, దేశం చాలా సంవత్సరాల పాటు ప్రపంచ చక్కెర ఎగుమతి మార్కెట్‌కు దూరంగా ఉండ వచ్చని వ్యాపారులు, పరిశ్రమ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు అయిన భారతదేశం, పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో అభివృద్ధిని నిశితంగా గమనిస్తోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఆవర్తనంగా సంభవించే వేడెక్కడం వల్ల ఏర్పడే ఒక వాతావరణ దృగ్విషయం, ఇది ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ సరళిని ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో, ఎల్ నినో తరచుగా బలహీనమైన రుతుపవన వర్షపాతం, వేడి పరిస్థితులతో ముడిపడి ఉంటుంది, ఈ రెండూ వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేయగలవు. ఈ యేడాది ఈ దృగ్విషయం జూన్‌లో ప్రారంభమైంది. దాని పెరుగుతున్న బలం, సంభావ్య తీవ్ర పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేసింది.

**చెరకు పంటపై ఎల్ నినో ప్రభావం**

మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలోని కొన్ని ప్రాంతాలలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా పెరిగినప్పుడు ఎల్ నినో ఏర్పడుతుంది. ఇది భారతదేశానికి చాలా దూరంలో ఏర్పడినప్పటికీ, దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 75శాతం అందించే నైరుతి రుతుపవనాలపై ఇది ప్రభావం చూపుతుంది. పెరుగుదల కాలమంతా అధిక మొత్తంలో నీరు అవసరమయ్యే చెరకు పంటకు ఇది ప్రత్యేకంగా ముఖ్యమైనది. ప్రధాన చక్కెర ఉత్పత్తి రాష్ట్రాలలో రుతుపవన వర్షపాతం తక్కువగా ఉంటే, చెరకు దిగుబడి తగ్గి, మొత్తం చక్కెర ఉత్పత్తి కూడా పడిపోవచ్చు. పరిశ్రమ అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో భారతదేశ చక్కెరఉత్పత్తి దేశీయ డిమాండ్ కంటే తక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. ఉత్పత్తి సుమారు 27.9 మిలియన్ మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వార్షిక వినియోగం దాదాపు 28.5 మిలియన్ టన్నులుగా ఉంటుందని అంచనా. దేశీయ ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి సెప్టెంబర్ 30 వరకు చక్కెర ఎగుమతులను నిలిపివేసింది.

**అనూహ్యంగానే వాతావరణం**

చెరకునుండి ఇథనాల్‌ఉత్పత్తిని పెంచుతుండటంతో, ఇతర అవసరాలకు చక్కెర లభ్యత తగ్గుతుండటంతో ఈ ఆందోళనలు తలెత్తుతున్నాయి. అయితే, భవిష్యత్ సరఫరాలను నిర్ణయించడంలో వాతావరణ పరిస్థితులే అత్యంత ముఖ్యమైన అంశమని పరిశ్రమ నిపుణులు తెలిపారు. గత ఎల్ నినో సంవత్సరాలలో భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణంకంటే తక్కువ వర్షపాతం, వ్యవసాయ అంతరాయాలు సంభవించాయి. ప్రస్తుత వాతావరణ ప్రభావం బలపడుతున్నందున, రుతుపవనాలపైనా, పంట ఉత్పత్తిపైనా దాని ప్రభావం ఎలా ఉంటుందోనని వాతావరణ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు.

ఈయేడాది రుతుపవనాలు బలహీనంగా ఉంటాయని, వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) కూడా అంచనా వేసింది. 2026 ఎల్ నినో ఎంత బలంగా మారుతుందో కచ్చితంగా చెప్పడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాబోయే నెలల్లో దాని పరిణామాలు చెరకు సాగుపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. ప్రస్తుతానికి, దృష్టి అంతా పసిఫిక్ మహాసముద్రంపైనే ఉంది. అక్కడ వేడెక్కుతున్న జలాలు, భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వ్యవసాయ రంగాలలో ఒకటైన చెరకు సాగుకు వాతావరణ పరిస్థితులు మరింత సవాలుగా మారవచ్చని ముందస్తు సంకేతాలు ఇస్తున్నాయి.



## అమెరికాపై చైనా ప్రతీకారం

# 46 కంపెనీలపై నిషేధం

**బీజింగ్, జూన్ 22:** ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం మరోసారి ముదిరింది. చైనా సైన్యానికి సహకరిస్తున్నాయనే ఆరోపణలతో 80 చైనీస్ కంపెనీలను అమెరికా ఇటీవల బ్లాక్‌లిస్ట్‌లో చేర్చిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటూ, చైనా ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా 46 అమెరికన్ కంపెనీలపై నిషేధాజ్ఞలు విధించింది. రక్షణ, కీలక ఖనిజాల మైనింగ్ రంగాలకు చెందిన యుఎస్ సంస్థలను లక్ష్యంగా చేసుకుని బీజింగ్ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది.

**అమెరికా కంపెనీలపై ఆంక్షల పర్వం**

జాతీయ భద్రతను కాపాడుకోవడమే లక్ష్యంగా ఈ కొత్త ఎగుమతి నియంత్రణలను విధిస్తున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అమెరికా రక్షణ విభాగంతో ఒప్పందాలు కలిగి ఉన్న ఓష్‌కోష్ డిఫెన్స్ (మిలిటరీ వాహనాల తయారీ సంస్థ), ఎవియాక్స్ వంటి 10 ప్రముఖ యుఎస్ కంపెనీలపై చైనా ఎగుమతి ఆంక్షలు విధించింది. వాషింగ్టన్ తీసుకున్న 'చైనీస్ మిలిటరీ ఎంటర్‌ప్రైజ్ లిస్ట్' నిర్ణయానికి ఇది ప్రత్యక్ష కౌంటర్ అని బీజింగ్ స్పష్టం చేసింది.

**ప్రభుత్వ కొనుగోళ్లపై పూర్తి నిషేధం**

మరోవైపు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ మరింత దూకుడుగా వ్యవహరిస్తూ, తమ ప్రభుత్వ ఏజెన్సీలు 46 అమెరికన్ కంపెనీల నుంచి ఎలాంటి ఉత్పత్తులను కొనుగోలు చేయకూడదని ఆదేశించింది. ఈ నిషేధిత జాబితాలో లాక్‌హీడ్ మార్టిన్, రేథియాన్, బోయింగ్ రక్షణ విభాగాలు వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. సోమవారం నుంచే ఈ నిషేధం అమలులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే, చైనాలో అమెరికా పెట్టుబడులతో నడుస్తున్న కంపెనీలకు ఈ కొనుగోలు ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో బీజింగ్‌లో భేటీ అయి, ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు చర్చలుజరిపిన నెలరోజుల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల అమెరికా విధించిన బ్లాక్‌లిస్ట్‌లో చైనాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ దిగ్గజాలు అలీబాబా, బైదూలతోపాటు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ బివైడి కూడా ఉన్నాయి. దీనికి ప్రతిచర్యగానే చైనా ఈ తాజా ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది.

## పిఎం బాల పురస్కార్ 2026 దరఖాస్తుల ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూన్ 22:** అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారులను సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2026' దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. క్రీడలు, సాహసం, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు అనే ఆరు విభాగాల్లో అద్భుత సాధన చేసిన బాలబాలికలు నేరుగా తమకు తాముగా లేదా ఇతరుల ద్వారా నామినేట్ చేయవచ్చు. అర్హులైన వారు జులై 31, 2026లోపుహెచ్‌టిటిపిఎస్:// ఎడబ్ల్యుఎఆర్‌డిఎస్. జిఒవి.ఇన్‌ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఖతార్‌లో భారీ అగ్నిప్రమాదం



## 18 మంది గల్లంతు.. 54 మందికి గాయాలు

**దోహా, జూన్ 22:** ఇరాన్–ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖతార్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశంలోని కీలక సహజవాయువు ఎగుమతి కేంద్రం రాస్ లాఫాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఆదివారం రాత్రి భారీ పేలుడు సంభవించి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కనీసం 54 మంది గాయపడగా.. మరో 18 మంది ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ దాడుల కారణంగా నిలిచిపోయిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించేందుకు కార్మికులు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. యుద్ధ సమయంలో ఇరాన్ బాంబు దాడులకు గురైన తర్వాత ఖతార్‌లోని గ్యాస్ ఉత్పత్తి, ఎగుమతి వ్యవస్థలు తీవ్రఅంతరాయం, ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

కాగా, ప్రపంచంలోనే అగ్రగామి సహజ వాయు ఉత్పత్తిదారుల్లో ఖతార్ ఒకటి. అయితే, యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధిపై ఇరాన్ ప్రభావం పెరగడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుతం యుద్ధానికి శాశ్వత ముగింపు దిశగా చర్చలు కొనసాగుతున్న వేళ హార్ముజ్ జలసంధిపై ఇరాన్ తన వైఖరిని కొంతమేర మార్చుకుంది. దీంతో ఖతార్ మళ్లీ ఎగుమతి కార్యకలాపాలను ప్రారంభించే పనుల్లో నిమగ్నమైంది.

ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి బర్జాన్ గ్యాస్ సప్లయి ఫెసిలిటీలో పేలుడు సంభవించినట్లు ప్రభుత్వరంగ సంస్థ ఖతార్ ఎనర్జీ వెల్లడించింది. పేలుడు అనంతరం భారీ మంటలు చెలరేగడంతో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. తొలుత కొంతమందికే గాయాలు అయ్యాయని అధికారులు ప్రకటించినప్పటికీ, కొన్ని గంటల తర్వాత ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం 54 మంది గాయపడ్డారని, 18 మంది గల్లంతయ్యారని వెల్లడించింది. అయితే, పేలుడు కారణంగా ఏర్పడిన నష్టం ఎంత మేర ఉందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ఘటనతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రపంచ ఇంధన మార్కెట్లలో మరింత అనిశ్చితి నెలకొనే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు ప్రమాదంపై ఖతార్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల వర్షం

### విమానాశ్రయాలు మూత

**కీవ్, జూన్ 22:** రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దానిపరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకు పడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్నిబహిరంగ కార్యక్రమా లను రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు.

విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకుపడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

## అయోధ్య విరాళాలపై విచారణకు హైకోర్టు నిరాకరణ

**అలహాబాద్, జూన్ 22:** అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు, కానుకల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిల్‌పై అత్యవసర విచారణకు అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ నిరాకరించింది. విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని కోర్టు తేల్చిచెప్పింది. అయితే రామాలయ నిధుల దుర్వినియోగంపై వ్యక్తిగత విచారణ చేపట్టాలని పిటిషనర్ మోహిత్ అశోక్ అలహాబాద్ హైకోర్టులో పిల్ వేశారు. తక్షణమే ఈ కేసులో విచారణ అవసరం లేదని అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ పంకజ్ భాటియా, అమితాబ్ కుమారి రాయ్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఇప్పటికే కోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మిగితా కేసులను పక్కన పెట్టి, రామాలయ నిధుల కేసును విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని కోర్టు చెప్పింది. లక్నో బెంచ్ ముందు సుమారు 529 కొత్త కేసులు ఉన్నాయి. దాంట్లో అయోధ్య కేసు 393 సీరియల్ నెంబర్‌గా ఉంది. లక్నో బెంచ్ చాలా కేసులను డీల్ చేస్తోందని, ఇప్పుడు అయోధ్య కేసును త్వరిత గతిన విచారించాల్సిన అవసరం లేదని కోర్టు పేర్కొన్నది. అయోధ్య ఆలయం నిర్మాణం కోసం సేకరించిన విరాళాలను దుర్వినియోగం చేసిన కేసులో ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం దర్యాప్తు చేపట్టిందని అలహాబాద్ హైకోర్టు బెంచ్ పేర్కొన్నది. రామమందిరానికి అందిన విరాళాల్లో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలపై ఇప్పటికే సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో సిట్ అధికారులు పలువురిని విచారించారు. పూర్తి విచారణ తర్వాతే ఈ వివాదంపై అసలు వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

## కేన్సర్ రోగిపై ముగ్గురు పోలీసుల లైంగిక దాడి

**న్యూఢిల్లీ, జూన్ 22:** హర్యానాలో దారుణం జరిగింది. కురుక్షేత్ర జిల్లా లద్వాలో బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 30 ఏళ్ల బ్యాంక్ ఉద్యోగిపై ముగ్గురు పోలీసులు లైంగిక దాడికి పాల్పడ్డారు. జూన్ 17 రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఆపి మొబైల్ లాక్కొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. తాను క్యాన్సర్ రోగిని అని.. చికిత్స తీసుకుంటున్నానని చెప్పినా పోలీసులు సదరు యువకుడిపై కనికరం చూపించలేదు. కీమోథెరపీ తర్వాత శరీరంపై వెంట్రుకలు ఊడిపోతే.. కాళ్లపై వెంట్రుకలు లేకపోతే అమ్మాయిల స్మూత్‌గాఉన్నావంటూ లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసుల దుశ్చర్య తర్వాత ఇంటికెళ్లిన యువకుడికి మరుసటిరోజు రక్తస్రావం జరగడంతో కుటుంబసభ్యులకు విషయంచెప్పాడు. ఘటన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తొలుత లద్వా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిస్థితి మరింత విషమంగా ఉండటంతో లోక్ నాయక్ జయప్రకాశ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వైద్య పరీక్షలు నిర్వహించి యువకుడి కాలు విరిగిందని, లైంగిక దాడి జరిగిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో అఘాయిత్యానికి ఒడిగట్టిన ఏఎస్సైలు సంజీవ్ కుమార్, రాజేందర్ కుమార్, హోంగార్డు సుమిత్‌లపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ చంద్రమోహన్ తెలిపారు.

# 'నీట్' రీ ఎగ్జామ్‌లో నకి'లీల'లు!




## బీహార్‌లో 24 మంది అరెస్టు

### నీట్‌పై అదంతా ఫేక్ ప్రచారం: ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ, జూన్ 22:** నీట్ రీటెస్ట్‌లో అవకతవకలు బయటపడ్డాయి. అభ్యర్థులకు బదులు కొందరు మెడికల్, నర్సింగ్ విద్యార్థులు నీట్ పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల్లోని బయోమెట్రిక్ ఉద్యోగులు వీరికి సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ ముఠాకు చెందిన 24 మందిని అరెస్ట్ చేశారు. బీహార్‌లోని పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మూడవ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న మయాంక్ కశ్యప్ అనే మెడికల్ విద్యార్థి, నీట్ అభ్యర్థికి బదులు పరీక్ష రాసేందుకు హాసన్‌పూర్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు. బయోమెట్రిక్ సంస్థ ఉద్యోగిగా నమ్మించి లోనికి ప్రవేశించాడు. కాగా, పరీక్షా నిర్వాహకులు అనుమానించడంతో తొలుత మయాంక్ కశ్యప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి సమాచారం ఆధారంగా లఖీసరాయ్‌లోని కెఆర్‌కె హయ్యర్ సెకండరీ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలలో ఏర్పాటు చేసిన ఎగ్జామ్ సెంటర్స్‌పై పోలీసులు రైడ్ చేశారు. దీంతో అసలు అభ్యర్థులకు బదులుగా పరీక్షలు రాస్తున్న ప్రాక్సీ నెట్‌వర్క్ గుట్టురట్టయ్యింది. వైద్య, నర్సింగ్ విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

దీంతో అసలు అభ్యర్థులకు బదులు పరీక్షలు రాసిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నర్సింగ్ విద్యార్థిని పూనమ్ కుమారి, ఎయిమ్స్ రాయ్‌బరేలీ విద్యార్థి సౌరభ్ ఝా, ఢిల్లీలోని షాదారా మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌గా పనిచేస్తున్న అమన్ అగర్వాల్, నలంద మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థి సంజీత్, అతడి సోదరుడు, ఏడుగురు అసలు అభ్యర్థులు, బయోమెట్రిక్ సంస్థకు చెందిన 14 మంది ఉద్యోగులతో సహా మొత్తం 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.


**చాట్‌జిపిటితో నకిలీ నీట్ పేపర్స్ అమ్మిన లా స్టూడెంట్ అరెస్ట్:**

ఒక లా స్టూడెంట్ చాట్‌జిపిటి, ఎఐ ద్వారా నకిలీ నీట్ ప్రశ్నాపత్రాలు తయారు చేశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారంద్వారా రూ.50,రూ.100కువాటిని అమ్మాడు. పసిగట్టిన పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. లసూడియా ప్రాంతానికి చెందిన అక్షయ్ మాల్వీయా, ఇండోర్‌లోని ఒక లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాత ప్రశ్నాపత్రాలు, స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించి చాట్‌జిపిటి, ఏఐ ద్వారా నకిలీ నీట్ పేపర్స్‌ను తయారు చేశాడు. ఒక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచాడు. నీట్ పేపర్ లీకైనట్లు అందులో ప్రచారం చేశాడు. రూ.50 నుంచి వంద వరకు వాటిని విక్రయించాడు. కాగా, నీట్ పేపర్ల యాక్సెస్ కోసం ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాల్సిన ఒక లింక్‌ను తన ప్రొఫైల్‌లో అక్షయ్ ఉంచాడు. సుమారు 20 మందికిపైగా విద్యార్థులు యుపిఐ, ఇతర ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా చెల్లింపులుచేసి వాటిని కొనుగోలుచేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌లోని కోటా పోలీసుల నిఘా సమాచారంతో ఇండోర్ పోలీసులు స్పందించారు. శనివారం రాత్రి అతడ్ని అరెస్ట్ చేశారు. నీట్ యుజి 2026 రీటెస్ట్ ప్రశ్నాపత్రం లీక్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తీవ్రంగా ఖండించింది. ఆ వీడియో పూర్తిగా కల్పితమని, అందులోని వాదనలు అవాస్తవమని స్పష్టంచేసింది. ఇటువంటి తప్పుడు ప్రచారాలను విద్యా ర్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.మే నెలలో జరిగిన పరీక్షపై పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో, దానిని రద్దు చేసి జూన్ 21న నీట్ రీఎగ్జామ్‌ను తిరిగి నిర్వహించారు. అయితే, పరీక్ష జరిగిన మరుసటి రోజే పేపర్ లీక్ అయిందంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై ఎన్టీఎ వెంటనే స్పందిస్తూ, "అత్యంత పటిష్ఠమైన భద్రత, నిఘా మధ్య పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాం. వైరల్ అవుతున్న ఆ వీడియో నకిలీది" అని ప్రకటనలో పేర్కొంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఫ్యాక్ట్‌చెక్ విభాగం కూడా ఈ వీడియోను నిశితంగా పరిశీలించి, అందులో పలు వ్యత్యాసాలు ఉన్నాయని వెల్లడించింది. ముఖ్యంగా, ప్రశ్నపత్రాల ప్యాకెట్‌లో తప్పనిసరిగా ఉండాల్సిన ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఆ వీడియోలో లేకపోవడాన్ని గుర్తించింది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రాలు బయటకు వచ్చే ఆస్కారమే లేదని స్పష్టం చేసింది.

## నటుడు ప్రకాష్‌రాజ్‌కు నాన్‌బెయిల్‌బుల్ వారంట్

**బెంగళూరు, జూన్ 22:** ప్రముఖ నటుడు, సామాజిక రాజకీయ విమర్శకుడు ప్రకాష్ రాజ్ చుట్టూ వివాదం నెలకుంది. ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు ఉండకూడదనే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కేసులో ఆయనకు గట్టి షాక్ తగిలింది. బెంగళూరులోని 48వ ఎసిజెఎం కోర్టు శనివారం ప్రకాష్ రాజ్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... ప్రకాష్‌రాజ్‌కు ఒకే సమయంలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయంటూ 2019లో దిలీప్ కుమార్ అనే న్యాయవాది బెంగళూరు హలసూరు గేట్ పోలీస్ స్టేషన్‌లో తొలిసారి ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు.

ఈ అక్రమ ఓట్ల వ్యవహారంపై బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బిబిఎంపి) సంస్థ అధికారులకు, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు న్యాయవాది ఏకంగా కోర్టును ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం గత కొన్ని విచారణలుగా కోర్టుకు స్వయంగా హాజరుకావాలంటూ ప్రకాష్‌రాజ్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రకాశ్ రాజ్ వరుసగా కోర్టు విచారణలకు గైర్హాజరవుతూ వచ్చారు. కోర్టు సమన్లను లైట్ తీసుకోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి, ఈసారి ఆయనకు ఎలాంటి బెయిల్ దొరకకుండా నేరుగా నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి కోర్టు ముందు ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## సంక్షిప్త వార్తలు

### సిఎం విజయ్ బర్త్ డే.. బంగారు ఉంగరాలు పంపిణీ

**చెన్నై, జూన్ 22:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి శ్రీనాథ్ నవజాత శిశువులకు బంగారు ఉంగరాలను పంచడం వైరల్‌గా మారింది. విజయ్ పుట్టిన రోజున తూత్తుకుడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరుగురు శిశువులు జన్మించినట్లు తెలుసుకున్న మంత్రి తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు ఉంగరాలను బహూకరించారు. సిఎం పుట్టినరోజు నాడే తమ పిల్లలు పుట్టటం, అదే సమయంలో ఊహించని విధంగా మంత్రి బంగారు కానుక అందడంతో ఆయా కుటుంబాల్లో సంతోషం విరిసింది.

### కర్ణాటకలో కొత్త పార్టీ ప్రకటించిన కన్నడ నటుడు



**బెంగళూరు, జూన్ 22:** సరికొత్త పొలిటికల్ పార్టీ పెట్టబోతున్నట్లు కన్నడ నటుడు చేతన్ అహింసా ప్రకటించారు. కర్ణాటకలో ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను మార్చేందుకే అవినీతి రహిత రాజకీయ పార్టీని నిర్మించి తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు తెలిపారు. 2028 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం నియోజక వర్గాల్లో పోటీ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆ దినగలు, మైనా చిత్రాల్లో చేతన్ నటించారు. గత కొన్నేళ్లుగా చేతన్.. కుల వివక్ష, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులపై పోరాడుతున్నారు.

### షిండే గూటికి చేరిన ఆరుగురు ఉద్ధవ్ ఠాక్రే ఎంపిలు

**ముంబై, జూన్ 22:** మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ కుదుపు చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీకి చెందిన 9 మంది లోక్‌సభ ఎంపీలలో ఆరుగురు (6) రెబల్ ఎంపీలు సోమవారం అధికారికంగా డిప్యూటీ సిఎం ఏకనాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. ముంబైలోని వైబి చవాన్ సెంటర్ డిప్యూటీ సిఎం ఏకనాథ్ షిండే సమక్షంలో విలేకరుల సమావేశంలో నిర్వహించి పార్టీ మారుతున్నట్లు ఆరుగురు ఎంపిలు అధికారికంగా ప్రకటించారు. ఈ పరిణామంతో షిండే వర్గం చేపట్టిన 'ఆపరేషన్ టైగర్' వందశాతం విజయవంతమైందని సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కొరత, పార్టీ నేత సంజయ్ రౌత్ చేసిన వ్యక్తిగత దూషణల వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంపిలు వెల్లడించారు.

### బ్రహ్మోస్ కొనుగోలుపై యుఎఇతో ఒప్పందం




**న్యూఢిల్లీ, జూన్ 22:** బ్రహ్మోస్ క్షిపణులు, ఆకాశ్‌తీర్ వైమానిక రక్షణ వ్యవస్థల కొనుగోలుపై భారత్‌తో యుఎఇ వేగంగా చర్చలు జరుపుతోంది. ఇరాన్ దాడుల నేపథ్యంలో తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి యుఎఇ ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ ఎగుమతికి మాస్కో అనుమతి అవసర మైనా, ఇరు దేశాల సంబంధాల వల్ల ఇది సులభం కానుంది. ఈ ఒప్పందం కుదిరితే ప్రపంచ రక్షణ ఎగుమతుల్లో భారత్ స్థానం మరింత బలపడుతుంది.

### మూడో రోజూ కాక్రోచ్ పార్టీ ధర్నా



**న్యూఢిల్లీ, జూన్ 22:** నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా చేస్తోంది. మూడు రోజులుగా చేస్తున్న తమ ప్రొటెస్ట్‌ను అడ్డుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఈ క్రమంలో జంతర్ మంతర్ దగ్గర నీటి సరఫరా ఆపేశారని, రెస్ట్ రూమ్‌లకు నీళ్లు లేకుండా చేశారని ఆ పార్టీ చీఫ్ అభిజీత్ దీప్కే ఆరోపించారు. జంతర్ మంతర్ వద్దకు వస్తున్న నిరసనకారులను ఆధార్‌కార్డు చూపించాలని పోలీసులు అడుగు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్
# ఇద్దరు యువకులు దుర్మరణం


మృతి చెందిన యువకులు(ఫైల్)

**పలాస (వజ్రపుకొత్తూరు), జూన్ 22 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని చిన్న తామాడపేట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన డంతో ఈ విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపీనాథపురం గ్రామానికి చెందిన కర్ని కోదండరావు (28), గర్తంవానిపేట గ్రామానికి చెందిన గర్తం మణి కంఠ (33) కలిసి సైనూరు గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాలకు హాజరయ్యారు. ఉత్సవాలను దర్శించుకుని అర్ధరాత్రి సమయంలో స్వగ్రామాలకు తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో చిన్న తామా డపేట సమీపానికి చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పింది. వేగంగా వెళ్తున్న బైక్ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలుస్తోంది. అర్ధ రాత్రి సమయంలో కావడంతో విషయం ఎవరికి తెలియలేదు. అనంతరం అటుగా వెళ్తున్న స్థానికులు ప్రమాదాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వజ్రపు కొత్తూరు పోలీసులు మృతదేహాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలిం చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుల అకాల మరణంతో గోపీనాథపురం, గర్తంవానిపేట గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వెల్లలచెరువు వద్ద రోడ్డు ప్రమాదం
# లారీని ఢీకొట్టిన ఆటో: ముగ్గురు మృతి
### ఐదుగురికి తీవ్ర గాయాలు




**అద్దంకి, జూన్ 22, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం, వెల్లలచెరువు - కామేపల్లి గ్రామాల మధ్య పేరేచర్ల- కర్నూల్ రాష్ట్ర రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో అక్కడికక్కడే ముగ్గురు మృతిచెందగా, 6గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నరసరావుపేటలోని వివిధ వైద్యశాలకు తరలించారు. అందిన వివరాలు ప్రకారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం, వెల్పూరు గ్రామానికి చెందిన 9మంది ఫిరంగిపురం మండలం, సంక్రాంతిపాడు గ్రామంలో దశదిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. వెల్లలచెరువు సమీపంలో వీరహనుమాన్ గ్రానైట్ ఫ్యాక్టరీలో నుండి లారీ రోడ్డుపైకి వస్తూ వినుకొండ వైపుకు మలుపు తిరుగుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఈ ఆటో లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వెల్పూరు గ్రామానికి చెందిన దావులూరి ఏడుకొండలు(50), ముండ్రు రవణమ్మ(52), ఎలవర్తి సుబ్బులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇది ఇలా వుండగా ఈ సంఘటనలో గాయపడిన ముండ్రు సుబ్బాయమ్మ, గుత్తి సుబ్బా యమ్మ, ముండ్రు వెంకటరామాయ్యలను నరసరావుపేటలోని ఏషియన్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అదే విధంగా బోయిపాటి అనురాధ, బోయపాటి లక్ష్మీదేవమ్మలను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దోమ చినయోగమ్మ స్వల్ప గాయాలతో చికిత్స అనంతరం గ్రామానికి తరలించారు. ఆటో డ్రైవర్ కుంకలగుంట మీరావలి ప్రమాదం నుండి సురక్షితంగాబయట పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వం సం అయ్యింది. ప్రమాద సంఘటన సమాచార తెలుసుకున్న వెంటనే సంతమాగులూరు సి.ఐ. శేషగిరిరావు, ఎస్.ఐ. పట్టాభిరామయ్యలు ఉన్నతాధికారుల సమావేశం కొరకు దర్శిలో వుండగా, ఎఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును, సిబ్బందిని అప్రమత్తం చేసి, సంఘటనా స్థలానికి పంపించి, అధికారులు కూడ హూటాహూటిన చేరుకొని, సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నరసరావుపేటలో వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దరాప్తు చేస్తున్నారు. మృతదే హాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెల్పూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# యువకుడు దారుణ హత్య
### హంతకులపై కేసు నమోదు చేయాలని మృతుని కుటుంబీకులు రిమ్స్ వద్ద ఆందోళన



**సంతనూతలపాడు, జూన్ 22, ప్రభాతవార్త:** సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన పిల్లి అశోక్(30)ను అదే కాలనీకి చెందిన ఐదుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు వెలుగులోకి వచ్చింది. మృతి చెందిన పిల్లి అశోక్‌కు తల్లి, భార్య, సంవత్సరం వయసు గల అమ్మాయి ఉన్నారు. ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరి రావు, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది హత్య ప్రాంతాన్ని సందర్శించి విచారించారు. సోమవారం హత్యకు గురైన అశోక్ మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అయితే ఒంగోలు రిమ్స్ వద్ద హత్యకు గురైన అశోక్ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. మంగమూరు అంబేద్కర్ నగర్‌లోని పెయ్యాల సతీష్, అల్లడి చందు, ఆలూరి సంతోష్, మరొక ఇద్దరు కలిపి తమ కుమారుని కత్తులతో పొడిచి హత్య చేశారని మృతుడు తల్లి సుశీల ఈ మేరకు వాపోయారు. అంతే కాకుండా గ్రామానికి చెందిన కంకణాల మధు ముందసులో భాగంగా క్రికెట్ ఆడి ఇంటికి వచ్చిన తమ కుమారుడు అశోక్‌ను ఆదివారంరాత్రి తమ ఇంటి నుండి బయటకు తీసుకువెళ్లి పథకం ప్రకారం హత్య చేయించారని హత్యకు గురైన అశోక్ తల్లి సుశీల, మేనమామ దార్ల కోటేశ్వరరావు, అశోక్ భార్య, కుటుంబీకులు ఈ మేరకు వాపోయారు. వాస్తవ విషయాలు పోలీసు దర్యాప్తులో వెలుగులోకి రానున్నాయి. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నారు.




## యోగాంధ్ర రాష్ట్ర స్థాయి విజేతను అభినందించిన ఎస్పీ

**అనంతపురం క్రైమ్, జూన్ 22 ప్రభాతవార్త:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో అనం తపురం జిల్లా యోగ క్రీడాకారుడు, డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ అనంతపురంలో విధు లు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎం.చలపతి విశిష్ట ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన ఆయనను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు. ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఈయన జూన్ 18, 19 తేదీలలో విజయవాడ సమీపంలోని గుంటుపల్లి డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీలలో పాల్గొని సీనియర్ విభాగం సోలో యోగాసన పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. గత సంవత్సరం యోగాంధ్ర-2025 పోటీలలో కూడా పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. అలాగే 2025 సంవత్సరంలో విశాఖపట్నంలో ప్రధాని మోదీ సమక్షంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో యోగా ప్రోటోకాల్ ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. ఈయన యోగా రంగంలో విశేష సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ నిర్వహించే వివిధ యోగా పోటీలలో పాల్గొని ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన అనంతరం జూన్ 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో ఆయనకు ప్రత్యేక స్థానం కల్పించారు. సీ ఎం, యోగా గురువు బాబా రాందేవ్, మంత్రుల సమక్షంలో నిర్వహించిన యోగా ప్రోటోకాల్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రులు స్వయంగా విజేతలను అభినందించి వారి ప్రతిభను కొనియాడారు.

## కౌన్సెలింగ్‌కు వెళుతూ గాయపడిన తేజస్విని

**సత్యవేడు, జూన్ 22 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మాధనపాళెంకు చెందిన ఆర్.తేజస్విని పదో తరగతిలో 573 మార్కులతో మెరిసింది. పేద కుటుంబం నుంచి వచ్చినా పట్టుదలతో చదివి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తమ బిడ్డ జీవితం మారబోతోందన్న ఆనందంతో తల్లిదండ్రులు ఈ నెల 22న కౌన్సిలింగ్‌కు



బయలుదేరారు. కానీ సోమవారం వేకువ జామున రాజంపేట సమీపంలోని పుల్లంపేట వద్ద వారి బస్సును లారీ ఢీకొనడంతో ఆ కలల ప్రయాణం ఆగిపో యింది. ఈ ప్రమాదంలో తేజస్వినికి రెండు చేతి వేళ్ళు తెగిపోగా, కాలికి తీవ్ర గాయమైంది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నొప్పితో విలవిల లాడుతూ చికిత్స పొందుతోంది. ఆమెతో పాటు వెళ్లిన తల్లిదండ్రులు కూడా గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ రోజు కౌన్సిలింగ్‌కు ఎలా వెళ్తాను ? నా చదువు ఏమైపో తుంది.? అని కన్నీటితో ప్రశ్నిస్తోంది తేజస్విని. సర్టిఫికెట్లు పట్టుకుని కాలేజీ గేటు దాటాల్సిన ఆ చిన్నారి, ఈ రోజు ఆస్పత్రి బెడ్‌పై నిస్సహాయంగా పడి ఉంది.

## బాధ్యతలు స్వీకరించిన డా.హనుమంతు పురుషోత్తం

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సైన్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖ నూతన కార్యదర్శిగా డా.హ నుమంతు పురుషోత్తం సోమవారం సచివాలయంలో 5వ బ్లాక్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్ ఛార్జ్ హోదాలో బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను డా.హనుమంతు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తంకు సీఎస్ అభినందనలు తెలిపారు. శాస్త్రవేత్తగా ఆవిష్కరణల ప్రోత్సాహకునిగా, విద్యావేత్తగా మరియు పరిపాలనాధికారిగా సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ పరిశోధన మరియు అభివృద్ధి మేధో సంపత్తి హక్కులు సాంకేతిక పరిజ్ఞాన బదిలీ మరియు సంస్థాగత అభివృద్ధి రంగాలలో దాదాపు 4 దశాబ్దాల అపార అనుభవాన్ని ఆయన కలిగి ఉన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ భారతదేశ విజ్ఞాన సాంకేతిక మరియు ఆవిష్కరణ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ప్రస్తుతం సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు స్వీరించడానికి ముందు డా.పురుషోత్తం కేంద్ర ప్రస్తుత విజ్ఞాన మరియు సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు.

## ఆవుల చంద్రశేఖర్‌కు అంతర్జాతీయ అవార్డు
### 26న బ్రిటన్ పార్లమెంట్ హాల్‌లో ప్రదానం

**విజయవాడ, జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఏపీఎంఏపీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ కృషికి అంతర్జాతీయ అవార్డు దక్కింది. "భారతీయ ఆయుర్వేద శాస్త్రం వ్యవసాయ సాంకేతికత" అనే ప్రధాన శీర్షికతో 50 పరిశోధనా గ్రంథాలను స్వల్పకాల వ్యవధిలో ఆయన వెలువరించారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" సంస్థ చంద్రశేఖర్ కృషిని గుర్తించి, అంతర్జాతీయ అవార్డుకు ఎంపికజేసింది. లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హాల్ లో ఈ నెల 26వ తేదీ జరిగే ప్రత్యేకసభలో ఆవుల చంద్రశేఖర్ కు అవార్డును ప్రదానం చేయను న్నారు. "ది ఇండియన్ ఆయుర్వేద సైన్స్ అగ్రి టెక్నాలజీ" అనే శీర్షికతో, 44 వ్యాధులకు సంబంధించిన 729 ఔషధ మొక్కలు, నివారణలతో కూడిన 50 పుస్తకాలను పూర్తి చేయడం ఒక ముఖ్యమైన రికార్డుగా లండన్ సంస్థ ప్రశంసించింది. ఈ 50 పుస్తకాలన్నీ సహజ నివారణలు, వ్యవసాయ సాంకేతికత, మార్కెటింగ్, వర్గీకరణ, విలువ జోడింపు మొదలైనవాటిని శాస్త్రీయ పద్ధతిలో వివరిస్తాయని పేర్కొంది.




ఆవుల చంద్రశేఖర్ కృషికి అంతర్జాతీయ అవార్డు దక్కడం పట్ల పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందిం చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ హోదా కలిగిన చంద్ర శేఖర్ ను ఏపీఎంఏపీ సిఈఓగా నియమిస్తూ 2025 మార్చి 28 న రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ ఆయన సేవలను పొడిగిస్తూ 2026 ఏప్రిల్ 6 న కొనసా గింపు జిఓ వెలువడింది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత, 28మార్చి 2025 నుండి విదేశీ సేవల నిబంధనలు, షరతులపై ఏపీఎంఏపీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

## మనోజ్ పరమహంసకు డి.సిఎం పవన్ అభినందనలు

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ఛాయాగ్రహకులు మనోజ్ పరమహంస చెన్నైలోని ప్రముఖ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ ఎం.జి.ఆర్. ప్రభుత్వ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఛైర్మన్‌గా తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం నియమించడం సంతోషదాయకమని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'ఎక్స్' వేదిక అభినందించారు.ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు. మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకుడిగా తెలుగు, తమిళ చిత్రాలకు పని చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సినిమా రూపకల్పన, నిర్మాణ శైలులపై అవగాహన ఉన్న సాంకేతిక నిపుణుడాయన. చెన్నైలో ఉన్న ఈ ఇన్స్టిట్యూట్ నుంచే అన్నయ్య చిరంజీవి రజనీకాంత్, సుహాసిని, నాజర్ రాజేంద్ర ప్రసాద్‌లాంటి అగ్రశ్రేణి నటులు, పి.సి.శ్రీరామ్, పి.ఎస్.నివాస్ లాంటి సాంకేతిక నిపుణులు వచ్చారు. మనోజ్ పరమహంస నేతృత్వంలోనూ ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు రావాలని ఆకాంక్షిస్తున్నా అన్నారు.

## నిజ జీవితంలోనే అద్భుతంగా నటిస్తున్న పవన్
### సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. 'ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్. ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. పవన్ ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే, మీడియాతో మాట్లాడుతూ ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రేపిన సుగాలి ప్రీతి కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన న్యాయ అంశాలను లేవనెత్తారు. 'సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారు. 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు.



## శివయ్యనుదర్శించుకున్న గోవా మాజీ మంత్రి దిగంబర్‌కామత్

**శ్రీకాళహస్తి,జూన్ 22 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని సోమవారం భక్తి శ్రద్ధలతో గోవా మాజీ మంత్రి దిగంబర్ కామంత్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.ఆయనకు ప్రోటోకాల్‌మేరకు స్వాగతంను ఆలయ ఇఓ బికె వెంకటేశు ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద ఆలయకు ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో ప్రత్యేక ఆహ్వానం పలికారు. దిగంబర్ కామత్ గతంలో కూడా వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. పూజలు జరిపించుకున్నారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల ఆలయ అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు.మాజీ మంత్రికి ఇఓ బికె వవెంకటేశు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దిగంబర్ కామత్‌మాట్లాడుతూ తాను గతంలో కూడా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించు కున్నానని కానీ అప్పటికి ఇప్పటికి ఎంతో అభివృద్ధి మార్పులు చేర్పులు చోటు చేసుకు న్నాయని సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఏర్పాట్లను ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి బిజెపి నాయకుడు చందూ రాయల్ పర్యవేక్షించారు.



## వైభవంగా బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణం
### దర్గా అభివృద్ధికి 5 కోట్లు కేటాయించిన సీఎం చంద్రబాబు
### కూటమి పాలనలో మళ్లీ మంచి రోజులు: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త - వైద్యం:** నగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం బారా షహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా బారాషహీద్‌ల సమాధులను దర్శించిన మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దర్గా కోసం ఐదు కోట్ల రూపాయలు కేటాయించారని మంత్రి నారాయణ తెలిపారు. గతంలో 2014లో నారాయణ మంత్రిగా ఉన్నప్పుడే స్వర్ణాల చెరువు ఘాట్లు, మరుగుదొడ్లు, రూ.20 కోట్లతో కన్వెన్షన్ సెంటర్ వంటి పనులకు పునాది పడిందని వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ గుర్తుచేశారు. దర్గాకు తాను 30 ఏళ్లుగా భక్తుడినని, గత ప్రభుత్వ హయాంలో దర్గా అభివృద్ధి కోసం పోరాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. తన హయాంలో ఈద్గా, ముఖద్వారాలు నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాబోయే రొట్టెల పండుగలో భక్తుల సంఖ్య 14 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉన్నందున, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులంతా సమన్వయంతో అద్భుతమైన ఏర్పాట్లు చేయాలని, దర్గా సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని నేతలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పుల్లంపేటవద్ద బస్సును ఢీకొన్న లారీ
# ఇద్దరు మృతి: 16 మందికి తీవ్రగాయాలు

**పుల్లంపేట(తిరుపతి జిల్లా), జూన్ 22 ప్రభాతవార్త :** కడప చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే తిరుపతి నుంచి కడపకు వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సును కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడ్‌తో చెన్నైకి వెళ్తున్న లారీ పుల్లంపేట హెచ్.పీగ్యాస్ గోడౌన్ దగ్గర సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న సూపర్ లగ్జరీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. అందులో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి.గాయపడిన వారిని రైల్వే కోడూరు రూరల్ సీఐ డి.శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌తో పాటు పోలీస్ వాహనంలలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొందరిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే రాజంపేటకు చెందిన పునీత్ సాయి అనే




సంవత్సరం వయసు గల బాలుడు అక్కడికక్కడే మృతిచెందగా, యశస్విత (16) కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తిరుపతి నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు అర్ధరాత్రి సమయంలో పుల్లంపేటలోని మనోహర్ కేఫ్ దగ్గర బస్సును ఆపి, టీ తాగిన డ్రైవర్ బస్సు కదిలిన నిమిషంలోనే ఈ ఘోర దుర్ఘటన జరిగింది. ఎర్రగుంట్ల నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఓవర్ స్పీడ్ తో సూపర్ లగ్జరీ బస్సును డ్రైవర్ భాగాన చివర వరకు గుద్దుకొని పోవడంతో బస్సులోని ఒకరికి చెయ్యి తెగి పడిపోయింది. మరొకరి కాలు తెగిపడి రోడ్డుపై పడిపోవడంతో నెత్తురోడిన రోడ్డు బాధిత రోదనలో మిన్నలుంటాయి.

సంఘటన జరిగిన వెంటనే సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.శ్రీనివాసులు తమ సిబ్బందితో యాక్సిడెంట్ జరిగిన ప్రదేశానికి చేరుకుని క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు మంత్రి లోకేష్ సత్కారం
### నేడు పద్మశ్రీ అవార్డులు స్వీకరించనున్న కథానాయకులు

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ సినీనటులు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు మాగంటి మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఘనంగా సత్కరించారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన 2026 పద్మ అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం న్యూఢిల్లీలో జరగనుంది. రాజేంద్రప్రసాద్,మురళీమోహన్‌లు తెలుగు చలనచిత్రరంగంలో 50ఏళ్ళగా తమకంటూ గుర్తింపును పొందారు.తెలుగులో హాస్యరస ప్రధాన చిత్రాల్లో రాజేంద్ర ప్రసాద్ కథానాయకునిగా 200లకు చిత్రాల్లో నటించారు.ప్రస్తుతం పాత్రోచిత నటునిగా ఉన్నారు.మురళీమోహన్ హీరోగా,సపోర్టింగ్ యాక్టర్‌గా ప్రసిద్దులు,పలు చిత్రాలు నిర్మించారు.వారికి ప్రభుత్వం పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది.ఈ అవార్డులను స్వీకరించేందుకు డిల్లీకి వచ్చిన మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ లను మంత్రి లోకేష్ కలుసుకొని జ్ఞాపికలతో సత్కరించారు. వందలాది సినిమాల్లో నటించి, తెలుగు సినిమా రంగానికే వన్నెతెచ్చిన ఇద్దరు సీనియర్ నటులకు ఒకేసారి పద్మశ్రీ అవార్డులు రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా విశ్వ విఖ్యాత నటసర్వభౌమ స్వర్గీయ నందమూరి తారక


పద్మశ్రీ అవార్డులను అందుకోబోతున్న మురళీమోహన్,రాజేంద్రప్రసాద్‌లతో ఐటి మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు

రామారావు తో తమకు గల సాన్నిహిత్యాన్ని ఇద్దరూ నెమరువేసుకున్నారు. భవిష్యత్తులోనూ తెలుగు కళామతల్లికి సీనియర్ నటులు సేవలందించాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు పార్లమెంటు సభ్యులు కూడా మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను సన్మానించారు.

# రెండు నెలల చిన్నారికి ప్రాణాంతకవ్యాధి

## వ్యాక్సిన్ ఖరీదు రూ.17 కోట్లు

## బిడ్డను కాపాడుకోవడానికి తల్లిదండ్రుల అవస్థ వర్ణనాతీతం

## ఆదుకోవాలని దాతలకు వేడుకోలు





**తాడిపత్రిఅర్బన్, జూన్ 22 ప్రభాతవార్త:** కన్నబిడ్డ పుట్టిన ఆనందం...ఆ ఇంట్లో ఇంకా రెండు నెలలు కూడా నిలవలేదు. అప్పుడే విధి ఆ కుటుంబంపై క్రూరమైన పరీక్ష పెట్టింది. ఊయల్లో హాయిగా ఆడుకోవాల్సిన పసికందు... ఇప్పుడు ఆసుపత్రి మంచంపై ప్రాణాలు కాపాడుకోవడం కోసం పోరాడుతోంది. కోట్ల మందిలో ఒక్కరికి మాత్రమే వచ్చే అరుదైన వ్యాధి ఆ చిన్నారిని పట్టిపీడిస్తోంది. బిడ్డను కాపాడుకోవాలంటే 17 కోట్ల విలువైన ఇంజక్షన్ వేయాలని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రుల కళ్లల్లో కన్నీళ్లు ఆగడం లేదు. తమ ఆశల దీపాన్ని కాపాడాలని దాతలను వేడుకుంటున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ హృదయ విదారక ఘటనపై ప్రత్యేక కథనం. ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై కనిపిస్తున్న ఈ పసికందు పేరు ఇంకా సరిగా పిలవడం కూడా మొదలు కాలేదు. కానీ ఆ చిన్నారి జీవితంలో అప్పుడే పెద్ద పోరాటం మొదలైంది. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి, ఇందుప్రియ దంపతులకు రెండు నెలల క్రితం బాబు జన్మించాడు. కొడుకు పుట్టాడనే ఆనందంలో ఆ కుటుంబం మునిగిపోయింది. భవిష్యత్తుపై ఎన్నో కలలు కన్నారు. కానీ ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. నెల రోజుల వయసు వచ్చినా చిన్నారి కాళ్లు సరిగా కదపకపోవడం, ఇతర పిల్లల్లా చురుకుగా లేకపోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించగా మెరుగైన పరీక్షల కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. డాక్టర్ల సూచనల మేరకు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులకు అక్కడ వైద్యులు ఊహించని విషయం చెప్పారు. పరీక్షల్లో చిన్నారికి స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ-ఎస్ఎంఎస్ టైప్-1 అనే అత్యంత అరుదైన జన్యుపరమైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా శరీరంలోని కండరాలు క్రమంగా బలహీనపడతాయి. మొదట చేతులు, కాళ్లు పనిచేయడం తగ్గిపోతుంది. ఆ తర్వాత శ్వాస తీసుకోవడానికి ఉపయోగపడే కండరాలు కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే చిన్నారి చేతులు, కాళ్లు బలహీనపడుతున్నాయని, చికిత్స ఆలస్యం అయితే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేశారు. అయితే ఈ వ్యాధికి ఆశాకిరణంగా ఉన్న ప్రత్యేక ఔషధ ఇంజక్షన్ ధర వింటే ఎవరికైనా గుండె భారమవుతుంది. ఆ ఒక్క ఇంజక్షన్ విలువ ఏకంగా 17 కోట్లు. రోజువారీ కష్టపడి జీవనం సాగించే ఈ కుటుంబానికి అంతటి భారీ మొత్తాన్ని సమకూర్చడం అసాధ్యంగా మారింది. ఒకవైపు కన్నబిడ్డ ప్రాణాలను కాపాడుకోవాలనే ఆవేదన... మరోవైపు కోట్ల రూపాయల వైద్య ఖర్చు. ఈ రెండింటి మధ్య ఆ తల్లిదండ్రులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆసుపత్రి మంచంపై అచేతనంగా పడుకున్న తమ బిడ్డను చూస్తూ రోజులు గడుపుతున్నారు. ఇదే విషయాన్ని తల్లిదండ్రులు తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డికి వివరించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, చికిత్సకు అవసరమైన భారీ ఖర్చు గురించి తెలుసుకున్న వారు వెంటనే స్పందించారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, చిన్నారికి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు సమాచారం.

**మా బిడ్డను కాపాడండి :** మా వల్ల అయ్యేంత వరకు ప్రయత్నిస్తున్నాం. కానీ 17 కోట్లు సమకూర్చడం మా శక్తికి మించిన విషయం. దాతలు, సేవా సంస్థలు, ప్రభుత్వాలు స్పందించి మా కుమారుడికి జీవితం ఇవ్వాలని పసికందు తల్లిదండ్రులు కోరుతున్నారు. కన్నీళ్లతో గడుస్తున్న ప్రతి క్షణం ఆ తల్లిదండ్రులకు యుగంలా మారుతోంది. తమ కుమారుడు మళ్లీ ఆరోగ్యంగా నవ్వుతూ, ఆడుకుంటూ కనిపించాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

# యువ భారత్ స్ఫూర్తి కోసం..

# డా.గజల్ శ్రీనివాస్ జెన్‌జి తెలుగు గజళ్ల గానం

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత గజల్ నాయకుడు ట్రిపుల్ గిన్నిస్ ప్రపంచ రికార్డుల గ్రహీత డా.గజల్ శ్రీనివాస్ తన గజల్ గానానికి ఓ సరికొత్త ఒరవడిని అందించే దిశగా ముందడుగు వేస్తున్నారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్ మరియు విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 24, 25, 6 తేదీలలో ప్రతి రోజు ఉదయం 10.00 గంటల నంఉడి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, విశాఖపట్నంలోని కళాభారతి వేదికగా జెన్ జి తెలుగు గజళ్ల కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. యువ భారత స్ఫూర్తిని మేల్కొలిపే లక్ష్యంతో మానవతా విలువలు , మానవ సంబంధాల పట్ల గౌరవం మరియు ప్రగతిపథంలో యువత దూసుకుపోయే దిశగా ప్రేరణనిచ్చే భావాలతో ఈ గజళ్ల గానం సాగనుంది. ముఖ్యంగా నేటి తరం యువతకు ఆలోచన ఆవేశం బాధ్యత సంస్కారం, సృజన్మాతక కలగలిపిన సందేశాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేవ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల అదినేత పైడా కృష్ణ ప్రసాద్ కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్ రాజు, కార్యదర్శి శ్రీరామదాసు, డా.గుమ్మ్మ లూరి రామకృష్ణ ప్రసాద్ వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఇలాంటి మరెన్నో సృజనాత్మకత సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించే సంకల్పం ఉన్నట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

# ఉద్యోగుల సమస్యలపై నేడు ఎపి జేఏసీ కీలక భేటీ

**విజయవాడ, జూన్ 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న దీర్ఘకా లిక సమస్యలపై ప్రధానంగా ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేందుకు ఈ నెల 23వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు విజయవాడ లెనిన్ సెంటర్ లోని "రెవెన్యూ భవన్‌లో" ఏపీ జేఏసీ అమరావతి లోని భాగస్వామ్య సంఘాల (డిపార్ట్‌మెంట్ సంఘాలు) రాష్ట్ర అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసినట్లు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, ఉద్యమ కార్యాచరణకమిటీ చైర్మన్ టి.వి.ఫణిపేర్రాజు, కోశాధికారి నాగేశ్వరరావుప్రకటనలో తెలిపారు.

# దుర్గమ్మ సన్నిధిలో సిఎస్ సాయిప్రసాద్







**ఇంద్రకీలాద్రి, జూన్ 22, ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఐఏఎస్ కుటుంబ సమేతంగా సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు సి.ఎస్ దంపతులకు, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం గావించారు. ఆలయ డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్, ఏఈవో బివి రెడ్డి, ధర్మకర్తలమండలి సభ్యులు ఏ.శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు సి.ఎస్‌కి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు మరియు చిత్రపటాన్ని అందజేసారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి మంగళగికి కృష్ణాయపాలెంకు చెందిన వై జయశంకర్ కిషోర్‌బాబు, మహాలక్ష్మి దంపతులు రు.10లక్షల విరాళం సోమవారం అందించారు. కల్వకుర్తికి చెందిన తాడూరు సురేష్ కుమార్ రు.1లక్ష విరాళం తాడూరు రాఘవేంద్ర పేరిట సోమవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# రవాణాలో భారీ సంస్కరణలు

## మహిళలకు ఉచిత ప్రయాణం, ఎలక్ట్రిక్ బస్సులతో

## భవిష్యత్ ప్రణాళికలు: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**సచివాలయం,జూన్ 22,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో రవాణా శాఖ, ఏపిఎస్ఆర్టీసి రంగాల్లో విస్తృత సంస్కరణలు చేపట్టి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించామని రాష్ట్ర రవాణా,యువజన సేవల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. "రెండేళ్ళ పాలన - నమ్మకం -- విశ్వాసం" కార్యక్రమంలో భాగంగా మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి, రవాణా శాఖలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వాహన్,సారధి పోర్టళ్ళ ద్వారా వాహన రిజిస్ట్రేషన్లు,బదిలీలు,పర్మిట్లు,పన్నుల చెల్లింపులు,డ్రైవింగ్ లైసెన్స్ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోనికి తీసుకొచ్చామన్నారు. 80ఆర్టీఓ కేంద్రాల ద్వారా ఈ సేలు అందుతున్నాయని,22ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రాలు ప్రారంభించగా మరో 5కేంద్రాలు త్వరగా అందుబాటులోనికి వస్తాయని చెప్పారు.డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను కూడా ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం శ్రీశక్తి పథకం కింద 2.9లక్షల మంది ఆటో యజమానులకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున మొత్తం రూ.436కోట్ల ఆర్థిక సాయం అందించామని తెలిపారు.దర్శిలో ఆధునిక డ్రైవర్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని,మరిన్ని కేంద్రాలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపిఎస్ఆర్టీసి రంగంలో మహిళల కోసం అమలు చేస్తున్న శ్రీశక్తి పథకం విశేష విజయాన్ని సాధించిందన్నారు.2024ఆగష్టు 15నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా 73.62కోట్ల మంది మహిళలు, బాలికలు,ట్రాన్స్ జెండర్లు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. దివ్యాంగుల కోసం దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించామని ఇప్పటికే 38.22లక్షల మంది లబ్ది పొందారని తెలిపారు.శ్రీశక్తి,దివ్యాంగ శక్తి పథమాల అమలుతో ఆర్టీసి బస్సుల ఆక్యూపెన్సీ 92శాతానికి చేరిందన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలు,విశాఖపట్నం కొత్త విమానశ్రయం వంటి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రవాణా సేవలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని,గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏసి ఎలక్ట్రిక్ బస్సులు నడపాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు మరింత మెరుగైన రవాణా సేవలు అందిస్తామని ఆయన స్పష్టంచేశారు.

# శ్రీవారి సుప్రభాతసేవ పేరుతో దోపిడీ

## 60మంది భక్తుల నుండి భారీగా వసూళ్లు

## దర్శనాలు లేకనే మోసగించిన దళారులు



**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీనివాసుడికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవపేరుతో కొందరు దళారులు భారీగా భక్తులను నమ్మించి మోసం చేశారు. వారినుండి ఒక్కొక్కరు ద్వారా 6వేల రూపాయలు లెక్కన 60మందినుండి 3.60లక్షలు రూపాయలు వసూలుచేసి చివరకు దర్శనాలు చేయించకనే దోచుకోవడం టిటిడిని కుదిపేసింది. దీనిపై సోమవారం రాత్రి బాధిత భక్తులు టిటిడి విజిలెన్స్‌కు, తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. గుంటూరు,హైదరాబాద్, కర్నాటకకు చెందిన కొందరు భక్తులను దళారి నిమ్మల శ్రీనివాస్ సులభంగా నమ్మించి శ్రీవారి సుప్రభాతసేవ దర్శన టిక్కెట్లు ఇప్పిస్తామని చెప్పారు. వీరి మాటలకు నమ్మిన పలు ప్రాంతాలకు చెందిన 60మంది భక్తులు ఫోన్ పే ద్వారా ఆ మొత్తాన్ని పంపారు. అయితే దళారులు టిటిడి ఉద్యోగుల సిఫార్సు లేఖల పేరుతో దర్శనాలు ఇప్పిస్తామని శ్రీనివాస్ తెలిపాడు. చివరకు అంత మొత్తంలో డబ్బులు అందుకోవడంతో అతను సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్‌చేసి అందుబాటులోకి రాలేదు. దీంతో బాధి తులు 60మంది జరిగిన మోసంపై లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధిత భక్తుల ఫిర్యాదుతో తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దళారీ శ్రీనివాస్ కోసం దర్యాప్తు చేపట్టారు. సుప్రభాతసేవ పేరుతో తామంతా నమ్మి మోసపోయామని స్టేషన్ వద్ద తమ ఆవేదన వెలిబుచ్చారు. ఈ ఘటనపై తిరుమల పోలీసులు గానీ, టిటిడి విజిలెన్స్‌యంత్రాంగం సోమవారం రాత్రి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గతంలో కూడా విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్ల పేరిట భక్తులను మోసం చేసిన ఘటనలు జరిగాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## రూరల్ ఎమ్మెల్యే పంతం వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్సీ తోట ఖండన

## పంతం రాజీనామా చేస్తే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 22,ప్రభాతవార్త:** ఎన్నికల్లో కూటమికి చెందిన పార్టీలు కాపుల అభివృద్ధి కోసం ఎన్నో హామీలు ఇచ్చాయని వాటిలో ఏం అమలు చేశారో బహిర్గతం చేయాలని అలాగే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) తమపై చేసిన వ్యాఖ్యలను వైసీపీ పిఏసి సభ్యుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఖండించారు. నానాజీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తవుతుందని ఆయన రాజీనామా చేస్తే తాను కాకినాడ రూరల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తోట పేర్కొన్నారు. సోమవారం పంతం నానాజీ తనపై వ్యక్తిగతంగాను, తన స్వగృహంలో వైసీపీలోని కాపు ముఖ్య నేతలతో జరిగిన సమావేశంపై చేసిన ఆరోపణలపై తోట స్పందిస్తూ స్థానికంగా ఓ హోటల్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావటం లేదని మీరు ఆయన్ని కుల నాయకుడని ఆయనేమో నాకు కులం లేదు అంటూ గందరగోళం చేస్తున్నారని చెప్పారు. తనను భూ కబ్జాదారుడుగాను, దళితులకు గుండు కొట్టించిన వ్యక్తిగా నానాజీ చెప్పడం పట్ల తోట స్పందించారు. తాను భూకబ్జాదారుని కానని,ఏ స్థలాలు ఆక్రమించానో నిరూపిస్తే నానాజీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని చెప్పారు. అలాగే దళితులు సంబంధించిన కేసులను కోర్టులో ఎదుర్కొంటున్నానని కేసులు లేకుండా బయట పడతానని చెప్పారు. తన గృహంలో సుమారు 40 ఏళ్ల రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకులు హాజరైన సమావేశమును వైసీపీ కుక్కల సమావేశం అని నానాజీ చేసిన వ్యాఖ్యలకు ఖండించారు. తాను నానాజీ కంటే ఘోరంగా మాట్లాడగలనని తనకు ఆత్మ అభిమానం అడ్డు వస్తుందని తోట అన్నారు. జనసేనలో ఉన్న కాపు ప్రజాప్రతినిధులు కలిసి డిప్యూటీ సీఎం పవన్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తే తాను కాపు నేతగా ఎక్కువ సంతోష పడతానని తోట అన్నారు. పార్టీలు సేవలు చూసి కాదని కులం చూసే టికెట్లు ఇస్తున్నాయని కులం ఒక బలం అని తోట అన్నారు. పవన్ మాదిరిగా తమ పార్టీ అధినేత జగన్ అసభ్యకరంగా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయలేదని తోట చెప్పారు. రాజకీయ పార్టీగా సమావేశం ఏర్పాటు చేసుకున్నామని అది జనసేనను టార్గెట్ చేసామని మీరు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాపుల అభివృద్ధి నిమిత్తం ఆ కార్పొరేషన్‌కు ఏడాదికి 3వేల కోట్లు ఇస్తానన్న హామీని నిలుపుకోవాలని తోట డిమాండ్ చేశారు.




# అవినీతిని ఎత్తి చూపితే విద్యాసంస్థలపై దాడులు దారుణం

## రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన సాగుతోంది

## కూటమి పాలనపై ధ్వజమెత్తిన వైకాపా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

**నెల్లూరు,జూన్22 ప్రభాతవార్త-విద్య:** దేశవ్యాప్తంగా బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలు అవుతుంటే మన ఆంధ్రాలో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని, రాష్ట్రంలో డిఎస్సీ పేరుతో జరిగిన భారీ అవినీతిని వెలుగులోకి తెచ్చి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే తమ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కి చెందిన కృష్ణచైతన్య కళాశాలలపై అధికారులు దాడులు చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు పేర్కొన్నారు. సోమ వారం చంద్రశేఖర్‌రెడ్డి కళాశాలలపై జరిగిన దాడుదలకు నిరసనగా రాష్ట్రంలోని వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నెల్లూరు నగరానికి చేరుకున్నారు. తోలుత నగరంలోని స్థానిక రాంజీ నగర్‌లోని వైకాపా నగర ఇన్‌చార్జ్, తూర్పురాయల సీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయనికి చేరుకున్నారు.వైకాపా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అక్కడ నుండి స్థానిక విఆర్‌సి సెంటర్ వరకు భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం విఆర్‌సి సెంటర్‌లోని డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివా ళులు అర్పించారు. కృష్ణచైతన్య విద్యాసంస్థలపై ప్రభుత్వ చేయించిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భరంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతు కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ అవినీతి మెగా డిఎస్సీని బయపెట్టి నిజా నిజాలు మాట్లాడుతున్నందుకు నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య విద్యాసంస్దలకు చెందిన ఆరు కళాశాలలపై శనివారం రాత్రి ఒక్కసారిగా అధికారులు దాడులు చేయటం నీతి మాలిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతు నెల్లూరు నగరంలో 70 కి పైగా జూనియర్ కళాశాలలు ఉంటే కేవలం కృష్ణచైతన్య విద్యాసంస్దలపై దాడులు చేయటం కక్ష్యా రాజకీయాలనేని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, రవిబాబు, కల్పలతలు మాట్లాడుతు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి తమ పార్టీ ఎల్లపుడు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 11 ఎమ్మెల్యేలు , 19మంది మ్మెల్సీలు పార్టీ నాయకులు ఒక్క పిలుపుతో నెల్లూరుకు రావటం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతు కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు ఈ ఘటన ప్రత్యక్ష్య నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లా డుతు ఇటువంటి దాడుదలకు తాము బయప డబోమని, రానున్న రోజుల్లో కూటమి అవకత వలకు మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెల తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ, నాయకులు,ఆనం విజయ్‌కుమారెడ్డి, పూజితా రెడ్డిలతోపాటూ రాష్ట్ర నలుమూలల నుండి వైపాకా నాయకులు, కార్యకర్తలు వచ్చి పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల కొరత ఉండదు

## అక్రమాలకు తావులేదు: వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

## బలవంతపు ఎరువుల విక్ర్రయాలపై ఉక్కుపాదం

## ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పర్యవేక్షణ

## ఎరువుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం: మంత్రి

**విజయవాడ జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ 2026 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధ మని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ పరిశీలకుల నియామకం

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని 25 పార్లమెంటు నియోజక వర్గాలకు జనసేన పరిశీలకులను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నియమించారు. జనసేన పార్టీ నిర్మాణ ప్రక్రియలో భాగంగా పార్టీ ఉన్నతి కోసం తొలి నుంచి తపించిన జనసేన నాయకులు, జన సైనికులు, వీర మహిళల నుంచి పార్టీ పదవుల కోసం దరఖాస్తులను తీసుకోవడానికి సమాచార సేకరణ కమిట్తీలను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించారు. ప్రతి పార్లమెంటు నియోజక వర్గానికి ఒక పరిశీలకుడిని నియమిస్తామని గతంలోనే అధ్యక్షులవారు ప్రకటించారు. ఇందులో భాగంగా 25 పార్లమెంటు నియోజక వర్గాలకు సమాచార సేకరణ కమిటీ పరిశీలకులను సోమవారం నిర్ణయించారు. వీరు ఆయా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వారు పార్టీలో ఏ స్థాయిలో, ఏ బాధ్యతలు తీసుకోవాలని ఆసక్తి చూపుతున్నారో వివరాలు సేకరిస్తారు. వీరికి సహాయకులుగా ముగ్గురు సీనియర్ నాయకులను, ముగ్గురు సాధకులు, 21 మంది సమన్వయకర్తలు ఉంటారు. సేకరించిన దరఖాస్తులను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపుతారు. వాటిని అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు పూర్తిగా పరిశీలించిన తరవాత తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ సేకరణ కమిటీలు కేవలం పార్లమెంట్ నియోజకవర్గం స్థాయిలో పార్టీ నాయకులు, జన సైనికులు, వీర మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి, దరఖాస్తులను తీసుకోవడానికి పరిమితం అవుతాయి. ఈ కమిటీలు ఈ నెల 29వ తేదీ నుంచి తమ ప్రక్రియను ప్రారంభిస్తాయి.

# రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ బదలీ

**విజయవాడ,జూన్ 22, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ బదిలీకి కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యువజన, అభ్యుదయ, పర్యాటక సాంస్కృతిక శాఖ పరిధి నుంచి సైన్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్ శాఖకు అకాడమీని బదిలీ చేసింది. అకాడమీ సమర్థవంతమైన నిర్వహణ, మెరుగైన సమన్వయమే లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు సర్కార్ తీసుకుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 73ని జారీ చేసింది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమావళి2018 రెండో షెడ్యూల్‌లో సవరణలు చేసింది. తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఏపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తాజా ఆదేశాలతో పరిశోధన, ఆవిష్కరణలకు సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ మరింత ఊతమివ్వనుంది. శాఖల మధ్య సమన్వయం పెంపుతో అకాడమీ పని తీరు మెరుగుపడుతుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పరిపాలనా పునర్వ్యవస్థీకరణ దిశగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది.

# జీఓ 124 విడుదల చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:జిల్లా** పోలీస్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలను కమిషనరేట్ పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా సవరణ చేస్తూ జీవోను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది.జి.ఓ. ఎం.ఎస్. నెం.124, తేదీ 2206-2026ను జారీ చేస్తూ, విగిళి పోలీస్ కమిషనరేట్, విజయవాడ పరిధిలోని 28 పోలీస్ స్టేషన్లపై కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 ప్రకారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అధికారాలను కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం కమిషనర్‌కు జిల్లా మేజిస్ట్రేట్‌కు సమానమైన అధికారాలు కూడా వర్తిస్తాయి. అదే సమయంలో పెనమలూరు, కంకిపాడు, గన్నవరం, ఆత్కూరు, ఉంగుటూరు, ఉయ్యూరు జరిగింది టౌన్, ఉయ్యూ రు రూరల్, పమిడిముక్కల, తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్లు కమిషనరేట్ పరిధి నుండి తొలగించబడిన ప్రాంతాలుగా పేర్కొంది. ఈ ప్రాంతాలపై కమిషనర్ ఇకపై ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అధికారాలు వినియోగించరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు 22 జూన్ 2026 నుండి అమల్లోకి వచ్చినట్లుగా తెలియపరిచింది.

# ఆగి ఉన్న గూడ్స్ ట్రైన్ నుంచి యూరియా బస్తాల చోరీకి యత్నం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 22 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు రైల్వే గేటు వద్ద గూడ్స్ రైలులో యూరియా బస్తాల చోరీ యత్నం కలకలం రేపింది. ఆగి ఉన్న గూడ్స్ రైలును లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు బోగి తాళం పగులగొట్టి యూరియా బస్తాల చోరీకి విఫలయత్నం చేశారు. కాకినాడ నుంచి విశాఖపట్నం వైపుగా రైలు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గూడ్స్ రైలు ఉండూరు గేటు వద్దకు రాగానే వేరే రైళ్లు వెళ్లేందుకు గేటును మూసేశారు రైల్వే సిబ్బంది. దీంతో సిగ్నల్ కోసం వేచి చూస్తుండగా.. కొందరు దుండగులు ఒక బోగి తాళం పగలగొట్టి యూరియా బస్తాలను దొంగిలించడం మెదలుపెట్టారు. ఇది గమనించిన రైలు సిబ్బంది వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులను గమనించిన దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు.అనంతరం తనిఖీలు చేపట్టి సమీప పొలంలో దాచిన 60 యూరియా బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.




## నేటి నుంచి యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

# లక్ష్యసేన్, తన్వి శర్మపై టైటిల్ ఆశలు

**ఫుల్లర్టన్, జూన్ 22:** యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ సూపర్ 300 టోర్నమెంట్ నేటి నుంచి ఫుల్లర్టన్‌లో ప్రారంభం కానుంది. లక్ష్యసేన్, తన్వి శర్మతో కూడిన భారత షటర్లు ఈ టోర్నీపై భారీ ఆశలు పెట్టుకున్నారు. మాజీ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ కిదాంబి శ్రీకాంత్‌తో పాటు పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనలిస్ట్ లక్ష్యసేన్‌కు ఈ టోర్నీలో రెండో సీడ్ లభించింది. తొలి రౌండ్‌లో బెల్జియం షట్లర్ జూలియన్ కరాగ్గీతో తల పడతాడు. తరువాతి రౌండ్లలో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్ రూపం లో గట్టి ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశం ఉంది. చౌతో ముఖాముఖి పోరులో లక్ష్యసేన్ 5-4 ఆధిక్యంలో ఉన్నారు. ఇండోనేషియా ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన లక్ష్యసేన్... టోర్నీలో పుంజుకోవాలని చూస్తున్నాడు. ఇక ఐదో సీడ్ కిదాంబి శ్రీకాంత్... తొలి రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన లియావో జువోఫుతో తలపడనున్నారు. భారత్ తరపున సనీత్ దయానంద్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణ్య కూడా ప్రధాన డ్రాకు అర్హత సాధించారు.

మహిళల సింగిల్స్ విభాగంలో మొత్తం ఏడుగురు భారత షట్లర్లు బరిలో దిగుతున్నారు. ఐదవ సీడ్ తన్వి శర్మ, ఆరో సీడ్ దేవిక సిహాగ్ ఆశలు రేకెత్తిస్తున్నారు. ఇటీవలి ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లిన 17 ఏళ్ల తన్వి...జర్మనీకి చెందిన ఇవోన్ లీతో తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ ఏడాది థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300, అజర్‌బైజాన్ ఇంటర్నేషనల్ టోర్నీల్లో టైటిల్స్ నెగ్గిన దేవిక.. తొలి రౌండ్‌లో పెరూకు చెందిన ఇనెస్ లూసియా కాస్టిల్లో సలాజర్‌తో ఆడనుంది. గత వారం జరిగిన మకావు ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనలిస్ట్‌గా నిలిచిన అన్మోల్ ఖర్.. తొలి రౌండ్‌లో బల్గేరియాకు చెందిన కలోయానా నల్బంటోవాతో తలపడనుంది.

## వైల్డ్‌కార్డ్‌తో వింబుల్డన్‌లో దిగనున్న సెరెనా



**లండన్, జూన్ 21:** వింబుల్డన్ గ్రాండ్ స్లామ్ టోర్నీతో టెన్నిస్‌లోకి రీఎంట్రీ ఇస్తున్న 44 ఏళ్ల సెరెనా విలిమయ్స్‌కు వైల్డ్‌కార్డ్ లభించింది. 2022లో రిటైరైన దిగ్గజ టెన్నిస్ క్రీడాకారిణి సెరెనా..నాలుగేళ్ల తర్వాత తిరిగి రాకెట్ పట్టనుంది. వచ్చే వారం ప్రారంభంకానున్న వింబుల్డన్ గ్రాస్ కోర్టులో పాల్గొనేందుకు సెరెనాకు వైల్డ్‌కార్డ్ లభించింది. వైల్డ్ కార్డు జాబితాను నిర్వాహకులు విడుదల చేశారు. ఈ జాబితాలో సెరెనాకు చోటు దక్కింది. ఆల్ ఇంగ్లాండ్ క్లబ్‌లో సెరెనా విలియమ్స్ ఏకంగా ఏడుసార్లు వింబుల్డన్ టైటిల్ అందుకుంది. మాజీ ప్రపంచ నంబర్ వన్ సెరెనా... 23 సార్లు గ్రాండ్ స్లామ్ సింగిల్స్ నెగ్గింది. 2022 యూఎస్ ఓపెన్ తర్వాత ఇప్పటివరకు ఒక్క సింగిల్స్ మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ వారం బెర్లిన్ ఓపెన్‌లో తన చెక్ డబుల్స్ భాగస్వామి కరోలినా ముచోవాతో కలిసి ఆడిన తొలి మ్యాచ్‌లోనే సెరెనా పరాజయం పొందింది. ఇక సెరెనా, ఆమె సోదరి వీనస్ విలియమ్స్‌కు వింబుల్డన్ డబుల్స్ ఈవెంట్‌లో ఆడేందుకు వైల్డ్ కార్డు లభించింది. వీరిద్దరూ వింబుల్డన్‌లో ఆరుసార్లు డబుల్స్ విజేతలుగా నిలిచారు. అక్కడ చివరిసారిగా విజయం సాధించి దశాబ్దం గడిచింది.

# న్యూజిలాండ్‌కు ఈజిప్ట్ షాక్

# ఉరుగ్వేను నిలువరించిన కేప్‌వెర్డే

**వాంకోవర్, జూన్ 22:** సాకర్ ప్రపంచకప్‌లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. 92 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలి విజయాన్ని అందుకుంది. గ్రూప్-జీలో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్ట్ 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది.ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఈజిప్ట్ తొలిసారి గెలుపు రుచి చూసింది.1934లో ఫిఫా ప్రపంచకప్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈజిప్ట్‌కు అప్పటి నుంచి ఇదే తొలి గెలుపు. జికో, సలాహ్, ట్రెజెగెట్ గోల్స్ చేసి విజయంలో కీ రోల్ పోషించారు. దీంతో ఈజిప్ట్ అభిమానుల సంబరాలు అంబరాన్ని అంటాయి.

ఈ మ్యాచ్ తొలి అర్ధభాగంలో న్యూజిలాండ్‌దే ఆధిక్యం అంతా. దూడుకుగా ప్రారంభించిన న్యూజిలాండ్ ఫార్వర్డులు పదే పదే ఈజిప్ట్ గోల్ పోస్ట్‌పై దాడులకుదిగారు.సర్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ చేసేందుకు ప్రయత్నించినా ఈజిప్ట్ అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ మెరుపు వేగంతో గోల్‌చేసి న్యూజిలాండ్‌ను ఆధిక్యంలో నిలిపాడు.స్కోరును సమంచేసేందుకు ఈజిప్ట్ తీవ్రంగానే ప్రయత్నించింది.సలాహ్, ఇమామ్ అషూర్ ఇద్దరూ గోల్ చేసేందుకు చాలాదగ్గరగా వచ్చారు. కానీ న్యూజిలాండ్ గోల్‌కీపర్ అడ్డుగోడలా నిలిచాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి న్యూజిలాండ్ 1-0 ఆధిక్యం నిలుపుకుంది.

### మూడు గోల్స్‌తో ఈజిప్ట్ జోరు

రెండో అర్ధభాగంలో ఈజిప్ట్ చక్కని ప్రణాళికతో






## 92 యేళ్ల తర్వాత ఈజిప్ట్‌కు తొలి గెలుపు

పుంజుకుంది. వెంటవెంటనే మూడు గోల్స్ చేసి న్యూజిలాండ్‌కు షాకిచ్చింది.రెండోఅర్ధభాగం ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే న్యూజిలాండ్ మరో గోల్ కు దగ్గరగా వెళ్లింది. కాలమ్ మెక్‌కోవాట్ తలతో కొట్టిన బంతిని ఈజిప్ట్ గోల్ కీపర్ మోస్తఫా షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఈజిప్ట్ ఆటగాడు జీకో ఫ్రీ 58వ నిమిషంలో హెడర్‌తో గోల్ చేసి 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. ఆ తర్వాత 9 నిమిషాలకే సలాహ్ (67వ నిమిషం) బంతిని నెట్‌లోకి పంపించి ఈజిప్ట్‌కు ఆధిక్యం అందించాడు. ఈ ఆధిక్యాన్ని అలాగే కాపాడుకుంటూ ఈజిప్ట్ మ్యాచ్ ముగింపు దాకా తీసుకెళ్లింది. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు ఉండగా ట్రెజెగెట్ (82వ నిమిషం) ఈజిప్ట్‌కు మూడో గోల్ అందించి విజయం ఖాయం చేశాడు. దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. తాజా విజయంతో ఈజిప్ట్ గ్రూప్-జీ పాయింట్ల పట్టికలో టాప్‌లోకి దూసుకెళ్లింది. దీంతో నాకౌట్ దశకు చేరువైంది. రెండు మ్యాచ్‌ల్లో ఒక డ్రా, ఒక గెలుపుతో ఈజిప్ట్ ఖాతాలో ప్రస్తుతం నాలుగు పాయింట్లు ఉన్నాయి.

### ఉరుగ్వేకు షాకిచ్చిన కేప్ వెర్డే

గ్రూప్-హెచ్‌లో భాగంగా ఉరుగ్వే, కేప్ వెర్డే మధ్య జరిగిన మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. సాకర్ వరల్డ్ కప్‌లో తొలిసారి ఆడుతున్న కేప్ వెర్డే వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఆశ్చర్యానికి గురిచేసింది. గత వారం టోర్నీ ఫేవరెట్ స్పెయిన్‌కు షాకిచ్చిన ఈ పసికూన... తాజాగా రెండుసార్లు ప్రపంచ కప్ విజేత ఉరుగ్వే జోరుకు అడ్డుకట్ట వేసింది. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి రెండో డ్రాను తన ఖాతాలో వేసుకుంది.

ఫస్టాఫ్‌లో ఉరుగ్వే రెండు గోల్స్, కేప్ వెర్డే ఒక గోల్ సాధించాయి. తొలి అర్ధభాగం 21వ నిమిషంలో కేప్ వెర్డే గోల్ సాధించి 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కెవిన్ పినా సాకర్ ప్రపంచకప్‌లో కేప్ వెర్డేకు తొలి గోల్ సాధించి పెట్టాడు. ఫస్టాఫ్ ముగిసే చివరి నిమిషంలో ఉరుగ్వే రెండు మెరుపు గోల్స్ చేసింది. 44వ నిమిషంలో మాక్స్ అరౌజో తొలి గోల్ అందించగా, ఇంజ్యూరీ టైమ్(45+6నిమిషం)లో అగస్టిన్ కానోబియో వెంటవెంటనే గోల్స్ చేయడంతో ఉరుగ్వే 2-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

సెకండాఫ్‌లో కేప్ వెర్డే ఆటగాళ్లు అద్భుతంగా పుంజుకున్నారు.హీలియో వరేలా 61 వ నిమిషంలో గోల్ సాధించి సమవుజ్జీగా నిలిపాడు. ఆ తర్వాత ఏ జట్టూ గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. ఇరుజట్లకు ఒక్కో పాయింట్ లభించింది. దీనికి ముందు జరిగిన బెల్జియం, ఇరాన్ మ్యాచ్ గోల్ లెస్ డ్రాగా ముగిసింది.

# టిజి20 లీగ్‌లో రంగారెడ్డి రైజింగ్

**హైదరాబాద్, జూన్ 22 (వార్త క్రీడా ప్రతినిధి)** తెలంగాణ టీ20 లీగ్ రెండో రోజు తొలి మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ గెలుపొందింది. నల్గొండ నైట్స్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నల్గొండ నైట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. దివేశ్ సింగ్ మెరుపు ఇన్నింగ్స్‌తో నల్గొండ నైట్స్ 150మార్కు దాటింది. దివేష్ సింగ్ 27 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 48 రన్స్‌తో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో హార్షవర్ధన్ సింగ్ 20 బంతుల్లో 40రన్స్‌తో మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ రాహుల్ (30), వరుణ్ గౌడ్ (26), నితీశ్ రెడ్డి (20) పరుగులతో రాణించారు. రంగారెడ్డి బౌలర్లలో పున్నయ్య 3 వికెట్లు.. నితిన్, ఆర్యన్ చెరో రెండు వికెట్లు, తనయ్ ఒకవికెట్ పడగొట్టారు.


190 పరుగులల భారీ లక్ష్యాన్ని రంగారెడ్డి రైజర్స్ అలవోకగా అందుకుంది. 16.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తిచేసింది. తనయ్ త్యాగరాజన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. 30 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 71 రన్స్ సాధించాడు. అతనికి తోడుగా ఆదిత్య జవ్వాజి 32 బంతుల్లో 41 రన్స్, అవినాష్ రావు 6 బంతుల్లో 22, నితిన్ సాయి 9 బతుల్లో 26 రన్స్ మెరుపులు మెరిపించడంతో రంగారెడ్డి రైజర్స్ గెలుపు సునాయాసమైంది. నల్గొండ బౌలర్లలో అనికేత్ రెడ్డి, వరుణ్ గౌడ్ చెరో రెండేసి వికెట్లు తీశారు.



## తిలక్ వర్మ, అమన్ రావు సెంచరీల మోత

హైదరాబాద్, జూన్22(వార్త క్రీడా ప్రతినిధి): టీజీ20 లీగ్‌లో రెండో రోజు సెంచరీల మోత మోగింది. స్టార్ ప్లేయర్ తిలక్ వర్మ, అమన్ రావులు విధ్వంసం సృష్టించారు. దీంతో ఉప్పల్ స్టేడియంలో సోమవారం జరిగిన మెదక్ ఫాల్కన్స్, వరంగల్ వారియర్స్ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. మొదట వరంగల్ వారియర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 258 రన్స్ చేసింది. వరంగల్ ఓపెనర్, కెప్టెన్ అమన్‌రావు మెరుపు సెంచరీ సాధించాడు. ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడ్డ అమన్ 32 బంతుల్లోనే శతకం బాదేశాడు.దీంతో టోర్నీలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు. అమన్ రావు 48 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్స్‌లతో 142 రన్స్ చేశాడు. అనంతరం మెదక్ ఫాల్కన్స్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ తిలక్ వర్మ విధ్వంసం సృష్టించాడు. 43 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్స్‌లతో సెంచరీ సాధించాడు.అదే దాడి చివరి వరకు కొనసాగిస్తూ మరో రెండు బంతులుండగానే మెదక్ ఫాల్కన్‌కు ఒంటిచేత్తో తిలక్‌వర్మ మూడు వికెట్ల విజయాన్ని అందించాడు. 14 ఫోర్లు, 8 సిక్స్‌లతో 56 బంతుల్లో 136 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు.

# ఐటీ, ఫార్మా షేర్ల జోరుతో లాభాల్లో మార్కెట్లు




## సెన్సెక్స్ 291, నిఫ్టీ 90 పాయింట్ల వృద్ధి

**ముంబై, జూన్ 22:** సోమవారం నాడు భారతీయ ఈక్విటీ సూచీలు లాభాలతో ముగిశాయి. ఐటీ, ఫార్మా రంగ షేర్లలో భారీ కొనుగోళ్లు జరగడం దీనికి ప్రధాన కారణంకాగా,ముడి చమురు ధరలు తగ్గడం కూడా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచింది. సెన్సెక్స్ 291.17 పాయింట్లు (0.38 శాతం) పెరిగి 77,094.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 90 పాయింట్లు (0.37 శాతం) పెరిగి 24,102.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక స్థితిగతులపై స్పందిస్తూ, 24,200స్థాయి తక్షణ 'రెసిస్టెన్స్ జోన్' (అడ్డంకి స్థాయి)గా కొనసాగుతోందని నిపుణులు పేర్కొన్నారు. "ఈ స్థాయిని దాటి స్థిరంగా ముందుకు సాగితే బుల్లిష్(అప్‌ట్రెండ్) వేగం బలపడుతుంది. తద్వారా తదుపరి ముఖ్యమైన లక్ష్యమైన 24వేల 400 స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది" అని ఒక విశ్లేషకుడు తెలిపారు."అదే సమయంలో, కిందకు చూస్తే 24,000-23,900 స్థాయి కీలకమైన 'సపోర్ట్ జోన్' (మద్దతు స్థాయి)గా పనిచేస్తోంది" అని నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చమురుధరలు తగ్గుతూ ఉండటం మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపింది, ఇది వివిధ రంగాలలో సానుకూల వాతావరణానికి దోహదపడింది.

ఐటీ, ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగ షేర్లలో రోజంతా కొనసాగిన కొనుగోళ్ల కారణంగా ఈ లాభాలు నమోదయ్యాయి. నిఫ్టీ సూచీలో సిప్లా, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వాటిలో ఉన్నాయి. ఈ షేర్లలోని బలమైన లాభాలు, వినియోగదారుల ఆధారిత రంగాలలో కనిపించిన బలహీనతను భర్తీ చేయడంలో సహాయపడ్డాయి. విస్తృత మార్కెట్ కూడా దృఢంగా ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.6 శాతం పెరిగాయి. ఇది ప్రధాన షేర్ల (ఫ్రంట్‌లైన్ స్టాక్స్)కు మించి పెట్టుబడిదారుల ఆసక్తి కొనసాగుతోందని సూచిస్తోంది. వివిధ రంగాల సూచీలు మిశ్రమ ఫలితాలను నమోదు చేశాయి. రంగాల వారీ కొనుగోళ్లు, సానుకూల సెంటిమెంట్ కారణంగా నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అతిపెద్ద లాభాలను ఆర్జించాయి. మరోవైపు, నిఫ్టీ ఎఫ్ఎంసిజి. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు నష్టాలతో ముగిశాయి, దీంతో అవి ఆ రోజు అత్యంత పేలవమైన పనితీరు కనబరిచిన రంగాలుగా నిలిచాయి.

తగ్గిన ముడి చమురు ధరలు, డిఫెన్సివ్, టెక్నాలజీ స్టాక్‌లలో ఎంపిక చేసిన కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతునిచ్చాయని, అయితే కీలకమైన దేశీయ, ప్రపంచ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా ఉన్నారని విశ్లేషకులు తెలిపారు.

# రూ.7,623 కోట్ల బ్యాంక్ కుంభకోణం కేసు

# ఇద్దరు రిలయన్స్ సంస్థ మాజీ సిఇఒల అరెస్ట్




**న్యూఢిల్లీ, జూన్ 22:** బ్యాంక్ రుణాలను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రిలయన్స్ ఎడిఎ గ్రూప్ కేసులకు సంబంధించి, సెంట్రల్ బ్యూరోఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) సోమవారం ఇద్దరు మాజీ అధికారులను అరెస్టు చేసింది. వీరిలో రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్(ఆర్‌సిఎఫ్ఎల్) మాజీడైరెక్టర్, సిఇఒ దేవాంగ్ మోడీ, అలాగే రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్) మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సిఇఒ రవీంద్ర సుధాల్కర్ ఉన్నారు.

సిబిఐ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఇద్దరు మాజీ అధికారులు ప్రభుత్వ రంగ బ్యాంకులకు మొత్తం రూ.7,623 కోట్ల మేర అక్రమ నష్టాన్ని కలిగించారని ఆరోపణలున్నాయి. ఆర్‌సిఎఫ్ఎల్ కేసులో, నిందితులు 13 ప్రభుత్వ రంగ బ్యాంకులకు 4,097 కోట్ల నష్టాన్ని కలిగించారని ఏజెన్సీ పేర్కొంది.ఆర్‌హెచ్ఎఫ్ఎల్ కేసులో, 10ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.3,526కోట్ల నష్టం వాటిల్లింది. తమకు,తమకు సంబంధించిన సంస్థలకు అక్రమ లబ్ధి చేకూర్చారని ఏజెన్సీ పేర్కొంది. వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకులు,ఎల్ఐసి నుండి అందినఫిర్యాదుల ఆధారంగా రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్(ఆర్‌కామ్), రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్ఎల్), రిలయన్స్ టెలికాం లిమిటెడ్ (ఆర్‌టిఎల్)లపై సిబిఐ ఏడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈకేసులు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నాయి.

ఆర్‌కామ్ కేసులో కంపెనీ, ఆర్‌కామ్‌కు చెందిన ఐదుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, పది మంది బ్యాంకు అధికారులతో సహా 16 మంది నిందితులపై సిబిఐ 29.05.2026న తన మొదటి ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది.




# హర్ముజ్‌ను దాటిన 4 ఎరువుల నౌకలు

### నాలుగు రోజుల్లో కృష్ణపట్నం, కాకినాడ రేవులకు రెండు నౌకలు రాక

### మరో రెండు పారాదీప్, ముంద్రా ఓడరేవులకు చేరిక

**ముంబై, జూన్ 22:** భారత్‌కు ఎరువులను తీసుకువస్తున్న నాలుగు నౌకలు హర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి.అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం కుదిరినప్పటి నుండి, సుమారు 0.18 మిలి యన్ టన్నుల ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాలను మోసుకెళ్తున్న నాలుగు నౌక లు, ఉద్రిక్తతలు నెలకొన్న హర్ముజ్ జలసంధిని సోమవారం సాయంత్రం దాటాయని ప్రభుత్వ ఉన్నతా ధి కారులు తెలిపారు. ఇందులో సుమారు 92,250.07 టన్నుల యూరియా ఉంది. పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైనప్పటి నుండి హోర్ముజ్ జలసంధిలో మొత్తం సుమారు 0.33 మిలియన్ టన్నుల యూరియా, 0.220.25మిలియన్ టన్నుల డిఎపి (డైఅమ్మోనియా ఫాస్ఫేట్) రవాణా నౌకలు నిలిచిపో యాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.శాంతిఒప్పందం తర్వాత జలసంధిని దాటిన నౌకలలో, సుమారు 50వేల టన్నులు, 42వేల750 టన్నుల యూరియాను మోసుకెళ్తున్న రెండునౌకలు రాబోయే రోజుల్లో కృష్ణపట్నం, కాకినాడ ఓడరేవులకు చేరుకోనున్నాయి.అలాగే, 32,251టన్నుల సల్ఫర్, 55వేల టన్నుల డిఎపిని మోసుకెళ్తున్న మరో రెండు నౌకలు పారాదీప్, ముంద్రా ఓడరేవులకు చేరుకోనున్నాయి. "ఈ కొత్త దిగుమతులు రాగానే, దేశంలో ఇప్పటికే ఉన్న ఎరువుల నిల్వలను భర్తీ చేయడానికి, వ్యవసాయ అవసరాలను తీర్చడానికి వెంటనే వాటిని దించుతారు"




# రెపో రేటు యధాతథం!

# ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక

**ముంబై, జూన్ 22:** పెరిగిన అనిశ్చితి నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) వేచి చూసే ధోరణిని కొనసాగించే అవకాశం ఉందని, తగ్గుతున్న ముడిచమురు ధరలు, బలపడిన రూపాయి ద్రవ్యోల్బణ ప్రమాదాలను తగ్గించగలవని అంచనా వేస్తున్నట్లు సోమవారం ఒక నివేదిక తెలిపింది. "తక్షణ చర్యలు తీసుకోవడానికి అనిశ్చితి చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతానికి యథాతథంగా ఉంచండి, తటస్థంగా ఉండండి, స్పష్టత కోసం వేచి చూడండి. ప్రత్యామ్నాయాలను తెరిచి ఉంచండి అనేది ఎంపిసి సమావేశ నిమిషాలలోని అంతర్లీన సందేశం," అని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. సమీప భవిష్యత్తులో రుతుపవనాలే అత్యంత అనిశ్చితిని కలిగిస్తున్నాయని, జూన్ 2026 నాటికి ఇప్పటివరకు 42 శాతం లోటుతో, గత 126 ఏళ్లలో ఐదవ అత్యంత పొడి నెలగా నిలుస్తుందని నివేదిక పేర్కొంది. సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువం కొంత ఉపశమనం కలిగించవచ్చని కూడా పేర్కొంది. ముడిచమురు ధరల తగ్గుదల, రూపాయి విలువ పెరగడం దిగుమతి ద్రవ్యోల్బణాన్ని తగ్గించి, వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లక్ష్య పరిధిలో ఉంచడంలో సహాయపడతాయి.

అంచనాలు వాస్తవ ద్రవ్యోల్బణాన్ని గణనీయంగా మించిపోవడంతో, వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లింది, దీనివల్ల కుటుంబాలు విచక్షణతో చేసే ఖర్చుల విషయంలో జాగ్రత్త వహిస్తున్నాయి. "ఈ తరుణంలో వడ్డీ రేట్ల పెంపు గురించి మాట్లాడటం అనవసరం అని మేము భావిస్తున్నాము... అనిశ్చిత సమయాల్లో, ఒక మంచి కేంద్ర బ్యాంకు తప్పుడు కచ్చితత్వం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, టెయిల్ రిస్క్‌లకు వ్యతిరేకంగా దృఢంగా వ్యవహరించాలి, విశ్వసనీయతను కాపాడుకోవడానికి తగినంత క్రమబద్ధంగా ఉండాలి, పరిస్థితులకు అనుగుణంగా మారడానికి తగినంత సరళంగా ఉండాలి," అని ఆ నివేదిక పేర్కొంది. అరేబియా సముద్రంపై సోమాలియా జెట్ బలహీనపడటం వల్ల రుతుపవనాలు మందకొడిగా ఉన్నాయని, అయితే రాబోయే వారాల్లో ఈ జెట్ బలపడి, భారతదేశ పశ్చిమ తీరానికి తేమ ప్రవాహాలు పెరగవచ్చని అంచనాలు సూచిస్తున్నాయని ఆ పరిశోధనా సంస్థ తెలిపింది.

## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం: ఎఐతో భారీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 22:** భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం రాబోతోందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ తన తాజా నివేదికలో వెల్లడించి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ),క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియాలోనే అత్యంత వేగంగావృద్ధిచెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ అవతరిస్తోందని పేర్కొంది. దేశంలోని యువ జనాభా, అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయని వివరించింది.

ముంబై, చెన్నై నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు లభ్యత ఇందుకు ప్రధాన కారణం కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ-ఎన్‌సిఆర్, బెంగళూరు నగరాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగా చేరువలో ఉండటం కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమని నివేదిక పేర్కొంది.

ఈ రంగానికి సంబంధించిన తాజా గణాంకాలు కూడా ఇదే వృద్ధిని ధ్రువీకరిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం గత ఏడాది చివరి నాటికి 1.6 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం మరో 0.32 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా



సెంటర్లు నిర్మాణ దశలో ఉండగా, 2.92 గిగావాట్ల సామర్థ్యం పనుల కోసం వివిధ సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నాయి.



### బ్యాంకింగ్, మార్కెట్, రక్షణ రంగాల ప్రముఖులతో

# ఆర్థిక మంత్రి నిర్మల వరుస భేటీలు

**న్యూఢిల్లీ, జూన్ 22:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఆర్థిక, చెల్లింపుల, కమోడిటీ మార్కెట్లు,రక్షణ రంగాల కీలక ప్రతినిధులతో పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఆర్థిక వ్యవస్థలోని కీలక విభాగాలు, జాతీయ సంస్థలలోని భాగస్వాములతో ప్రభుత్వం కొనసాగిస్తున్న సంప్రదింపులకు ఇది నిదర్శనం. ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా, పరస్పర ఆసక్తి గల అంశాలపై చర్చించేందుకు ఆర్థిక మంత్రిని కలిశారని, ఆర్థికమంత్రి 'ఎక్స్'లో తెలిపారు. ఆర్థిక వృద్ధి, అభివృద్ధికి ఆర్థిక సహాయం, ప్రపంచ ఆర్థిక సవాళ్లపై భారతదేశం బహుళపక్ష సంస్థలతో సన్నిహితంగా సంప్రదింపులు జరుపుతున్న తరుణంలో ఈ సమావేశం జరిగింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దిలీప్ ఆస్బే ఆర్థిక మంత్రిని కలిశారు. డిజిటల్ చెల్లింపులలో భారతదేశం వేగంగా టవిస్తరిస్తున్న నేపథ్యంలో, దేశ చెల్లింపుల మౌలిక సదుపాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పెరుగుతున్న తరుణంలో ఈ సంప్రదింపులు ముఖ్యమైనవిగా పరిగణించబడు తున్నాయి. ఆర్థిక మంత్రి కమోడిటీ క్యాపిటల్ మార్కెట్ పార్టిసిపెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిపిఎఐ) ప్రతినిధి బృందంతో కూడా సమావేశమయ్యారు. ఈ చర్చలు వస్తు, మూలధన మార్కెట్లు, విస్తృత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కలిశారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | మంగళవారం 23 జూన్ 2026 | I


# ఈ ప్రొక్యూర్మెంట్ ఆన్‌లైన్ సైట్లో..
# అడ్రస్ లేని పోలవరం జిల్లా పేరు

## పాత జిల్లా పేరూలోనూ కనిపించని ముంపు మండలాలు.







**పోలవరం జిల్లా ప్రతినిధి జూన్ 22 ప్రభాత వార్త.** ఇ-ప్రొక్యూర్మెంట్ అనేది ఇంటర్నెట్ ద్వారా వస్తువులు మరియు సేవలను కొనుగోలు చేసే ప్రక్రియ. దీని ముఖ్య ఉద్దేశ్యం వ్యాపార మరియు ప్రభుత్వ కొనుగోళ్లలో సమయాన్ని, డబ్బును ఆదా చేయడం మరియు పారదర్శకతను పెంచడం ఖర్చు ఆదా వివిధ సరఫరాదారుల నుంచి వచ్చే ధరలను, ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా సులభంగా సరిపోల్చి అత్యల్ప ధరకు వస్తువులను పొందవచ్చు.సమయం ఆదా కాగితం పనులకు బదులుగా, కొనుగోలు ఆర్డర్లు మరియు ఇన్వాయిస్‌లు డిజిటల్ రూపంలో మారడం వల్ల ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుంది.పారదర్శకత - అవినీతి నిరోధం టెండర్ల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగడం వల్ల ఎలాంటి అవకతవకలకు తావుండదు. అవినీతి తగ్గి, అకౌంటబిలిటీ పెరుగుతుంది.సులభమైన నిర్వహణ సరఫరాదారుల కోసం అన్వేషించడం పెట్టడం నుండి, ఆర్డర్ ట్రాకింగ్ మరియు పేమెంట్స్ వరకు అన్నీ ఒకే ప్లాట్‌ఫారమ్‌లో ఆటోమేట్ అవుతాయి.మెరుగైన సరఫరాదారుల సంబంధాలు టెండర్ల, కోటేషన్ల కోసం సరఫరాదారులతో మెరుగైన డిజిటల్ కమ్యూనికేషన్ మరియు సమన్వయం సాధ్యపడుతుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నా ఈ ప్రొక్యూర్మెంట్ ఆన్లైన్ ఏపీ సైట్ లో పోలవరం జిల్లా పేరు లేదు. ఇంకా అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు మీద మాత్రమే ఆన్లైన్ టెండర్లు కొనసాగుతున్నాయి. దీనితో పాటు పోలవరం జిల్లాలో 12 మండలాల పేర్లు ఉంటే వాటిలో కేవలం ఏడు మండలాల పేర్లు మాత్రమే అల్లూరి జిల్లా పేరు మీద చూపిస్తున్నాయి.ముంపు మండలాల పేర్లు కూడా పాత జిల్లాల్లో లేవు. నాలుగు ముంపు మండలాల్లో ఒక ఎటపాక పేరు తప్ప చింతూరు, కూనవరం, వి. ఆర్. పురం మండలాల పేర్లు లేవు.పోలవరం జిల్లాతో పాటు మార్కాపురం జిల్లా కూడా ఈ ప్రొక్యూర్మెంట్ ఆన్లైన్ సైట్లో కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్లో మొత్తం 28 జిల్లాలు ఉంటే ఈ ప్రొక్యూర్మెంట్ ఆన్ సైట్లో కేవలం 26 జిల్లాల మాత్రమే చూపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులతో పాటు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఆన్లైన్ సైట్లో పోలవరం జిల్లాతో పాటు మార్కాపురం జిల్లా కనపడేలా చేయడంతో పాటు పోలవరం జిల్లాలోని 12 మండలాలు, మార్కాపురం జిల్లాలోని 21 మండలాలు ఈ ప్రొక్యూర్మెంట్ ఆన్లైన్ సైట్లో కనిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మనుగడ కోసమే వైకాపా కాపు రాజకీయం చేస్తోంది

### వైకాపాకు పవన్‌ను విమర్శించే నైతిక అర్హత లేదు
### అధికారంలో మొండిచేయి.. ఇప్పుడు కపట ప్రేమ
### సమావేశం ఆత్మీయత కాదు.. ఉనికి కోసం ఆరాటం



**రామచంద్రాపురం,జూన్ 22 (ప్రభాత వార్త):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసే నైతిక అర్హత వైకాపా పార్టీకి ఏకోశానా లేదని రామచంద్రపురం నియోజకవర్గ కూటమి కాపు నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఐదేళ్ల అధికారంలో కాపు సమాజానికి నమ్మకద్రోహం చేసిన వారే,ఇప్పుడు ఓటమి భయంతో కాపుల పేరుతో కొత్త రాజకీయ నాటకానికి తెరతీశారని కాపు నాయకులు ధ్వజమెత్తారు.సోమవారం స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశంలో కూటమి పార్టీ కాపు నాయకులు మాట్లాడుతూ.. కాపు వర్గానికి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి,ఆ తర్వాత ఇచ్చిన హామీని నట్టేట ముంచారని కూటమి నాయకులు గుర్తుచేశారు.కాపు కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసి,యువత భవిష్యత్తును అంధకారం చేసిన చరిత్ర వైకాపాదేనని విమర్శించారు.నాడు కాపు ఉద్యమాల సమయంలో యువతపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుంటే నోరు మెదపని నాయకులు,నేడు కాపులపై కపట ప్రేమ ఒలకబోయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కూటమి కాపు నాయకులు ఎద్దేవా చేశారు.?ఒక సామాజిక వర్గాన్ని ఒక రాజకీయ పార్టీకి బానిసగా మార్చాలనే కుట్ర ప్రజాస్వామ్యానికే విరుద్ధమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వైకాపా కాపులు అనే కొత్త పదాన్ని సృష్టించి కాపు సమాజాన్ని విభజించాలని చూడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.కాపులకు స్వతంత్ర ఆలోచన,రాజకీయ నిర్ణయాధికారం లేవా?అని ప్రశ్నించారు.అలాగే కాపు సమాజం ఎవరికీ లొంగిపోయేది కాదని,తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే చైతన్యం ఆ వర్గానికి ఉందని స్పష్టం చేశారు.?ఇటీవల వెంకటాయపాలెంలో వైకాపా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశం కాపుల సంక్షేమం కోసం ఎంతమాత్రం కాదని,అది కొందరు వైసీపీ నాయకుల రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు వేసిన ముసుగు మాత్రమేనని కూటమి కాపు నాయకులు పేర్కొన్నారు.అది కాపుల ఆత్మీయ సమావేశం కాదు.. ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కూలిపోయిన ఉనికిని వెతుక్కునేందుకు పెట్టుకున్న ఆత్మావలోకన సమావేశం అని ఎద్దేవా చేశారు.?పవన్ కళ్యాణ్‌ను ఒకే కులానికి పరిమితం చేయాలని చూస్తున్న వైకాపా కుత్సిత బుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ ఒక వర్గానికి చెందినవాడు కాదని ఆయన రైతులు,కూలీలు,యువత,మహిళలు,మధ్యతరగతి గుండె చప్పుడు అన్నారు.అధికారం కోసం కాకుండా బాధ్యత కోసం కోట్ల రూపాయల సినీ కెరీర్‌ను త్యాగం చేసిన అరుదైన నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు.ఆయన రాజకీయ నిబద్ధతను,తెగింపును దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం గుర్తించారని గుర్తుచేశారు.జగన్ రెడ్డికి కులాలను విడగొట్టడం మాత్రమే సాధ్యమైతే.. కులాలను కలిపి రాష్ట్ర ప్రయోజనాల కోసం నడిపించడం ఒక్క పవన్ కళ్యాణ్‌కే సాధ్యమైందని స్పష్టం చేశారు.?స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని, అందుకే తాము కూటమి నాయకత్వానికి అండగా నిలిచామని కూటమి నాయకులు వివరించారు.ఇప్పటికైనా వైసీపీ నేతలు కులాల మధ్య చిచ్చు పెట్టే చౌకబారు రాజకీయాలు మానుకోవాలని,లేదంటే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని కూటమి కాపు నాయకులు హెచ్చరించారు.?ఈ సమావేశంలో కూటమి నాయకులు జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్,టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు,అన్యం శ్రీరామ్,కొట్టువాడ హరిబాబు,దేవు వెంకటరాజు, ఆళ్ల బుజ్జి,గొల్లపల్లి కృష్ణ, సలాది నాయుడు,కవల నానాజీ,నారపురెడ్డి బలరాం,అంకం శ్రీను,పేపకాయల నారాయణరావు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం

### పిజిఆర్ ఎస్ లో 186 స్వీకరణ : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 22( ప్రభాతవార్త)** ప్రజల సమస్యలను వేగవంతముగా పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ లో ప్రజల నుండి ఆమె స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ప్రజలకు మరింత జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు జిల్లా డివిజన్ మండల స్థాయిలతో పాటు నియోజకవర్గ స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు మీసేవ కేంద్రాలు ప్రభుత్వ వెబ్సైట్ ద్వారా తమ ఫిర్యాదులను వినతులను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పిజిఆర్ ఎస్ లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే ఉంటున్న నేపథ్యంలో వాటి పరిష్కారానికి వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా రెవిన్యూ క్లినిక్లు నిర్వహిస్తున్నామని వివరించారు. భూ సమస్యలు పట్టాదార్ పాస్ బుక్స్ వారసత్వం సర్వే తదితర రెవెన్యూ అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. పి జి ఆర్ ఎస్ లో 186 అర్జీలు వచ్చేయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెసి వై మేఘస్వరూ జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ భాస్కర్ రెడ్డి సిపిఓ ఎల్ అప్పల కొండ జిల్లా అభివృద్ధి అధికారి కే రత్నకుమారి ఆర్డీవోలు ఆర్ శివరాముడు కె ఆనందరావు కే భాగ్యలక్ష్మి ఎం ఆర్ ఆర్ ప్రేమ్ కుమార్ జిల్లాస్థాయి అధికారులు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మహిళల పై జరుగుతున్న మోసాలపట్ల
## అప్రమత్తంగా ఉండాలి :చింతూరు ఎ యస్ పి. హేమంత్



**చింతూరు జూన్ 22 ప్రభాత వార్త.**మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఎ యస్ పి హేమంత్ పేర్కొన్నారు.సోమవారం మహిళల భద్రత గూర్చి అవగాహన సదస్సును చిడుమూరు గ్రామం లో నిర్వహించారు.పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు చీడుమూరు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.మొబైల్ వాడకం పెరిగిన, మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.మహిళలను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ మొబైల్ వాడకం పెరిగిన తర్వాత మహిళలను లొంగదీసుకోవటానికి, అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయని వారిపట్ల అప్రమత్తమై పోలీసులకు 112, శక్తి యాప్ ద్వారా వెంటనే సమాచారం ఇచ్చి తమను తాము రక్షించుకోవాలని వివరించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యస్ ఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో ఆధునిక వసతులు...

### ఇండక్షన్ స్టవ్వులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 22,ప్రభాతవార్త** చిన్నారులు, గర్భిణులు, బాలింతల కు మరింత ఆరోగ్యకరమైన,స్వచ్ఛమైన వాతావరణంలో పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు నియోజకవర్గ పరిధి లోని అంగన్వాడీ సెంటర్లకు ఇండక్షన్ స్టవ్వులను పంపిణీ చేశారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలకు స్వయంగా ఈ స్టవ్వులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో సాంప్రదాయ వంట గ్యాస్ కొరత లేదా పొగ వల్ల కార్యకర్తలు, చిన్నారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ ఆధునిక ఇండక్షన్ స్టవ్వులను అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల వంట చేయడం సులువవడమే కాకుండా, సమయం ఆదాతో పాటు పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. మన పిల్లల భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాల నుంచే మొదలవుతుందని, అక్కడ వంటలు త్వరగా, పరిశుభ్రంగా జరగడం వల్ల చిన్న పిల్లలకు వేడివేడిగా, సకాలంలో పౌష్టికాహారం అందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను మోడల్ సెంటర్లుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, రాబోయే రోజుల్లో వీటికి అవసరమైన మరిన్ని మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇండక్షన్ స్టవ్వుల వాడకంపై మరియు వాటి ద్వారా విద్యుత్ ఆదా ఎలా చేసుకోవాలనే దానిపై అంగన్వాడీ సిబ్బందికి ప్రత్యేకం గా అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య కూటమి నాయకులు మరియు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న నిత్యాన్న పథకానికి రూ,1,00,11/-
### స్వామివారికి విశేష పూజలు.. పాల్గొన్న భక్తులు.







**ఆత్రేయపురం, జూన్ 22,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్యాన్న పథకానికి రావులపాలెం మండలం, వెదిరేశ్వరంనకు చెందిన పడాల రామ వెంకట సత్యనారాయణ రెడ్డి, లక్ష్మి సరోజ దంపతులు, వారి కుటుంబ సభ్యులు, నిత్యాన్నదాన పథకానికి రూ. 1,00,116/- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.సోమవారం వేలాది మంది భక్తుల రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## ద్రాక్షారామం భీమేశ్వరాలయంలో
# మండపాల దందా..



**రామచంద్రాపురం,జూన్ 22 (ప్రభాత వార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో వివాహాలు చేసుకోవాలంటే భక్తులు భయపడే పరిస్థితి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెళ్లి మండపాల ఏర్పాటుకు సంబంధించి దేవస్థానం అధికారులు నిబంధనలతో కూడిన గెజిట్ విడుదల చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.?దేవస్థానం నిర్ణయించిన అధికారిక ధరల వివరాలు ఇలా ఉన్నాయి..సాధారణ మండపం6,000,పూసల మండపం9,000,?ప్లాస్టిక్ పూల మండపం12,000అయితే,ఈ మండపాల కాంట్రాక్ట్ దక్కించుకున్న పాటదారులు గెజిట్ ధరలను తుంగలో తొక్కి,భక్తుల నుంచి అంతకు రెట్టింపు,ముమ్మడి వసూలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?పాటల విధానానికి స్వస్తి పలకాలి దేవస్థానంలో మండపాల ఏర్పాటుకు సంబంధించి ఇకపై ఎలాంటి వేలంపాట టెండర్లు నిర్వహించకూడదని భక్తులు కోరుతున్నారు.పెళ్లిళ్లకు వచ్చే భక్తులకు వారి బడ్జెట్,నమ్మకానికి అనుగుణంగా బయట డెకరేటర్ల ద్వారా నచ్చిన మండపాలు వేయించుకునేలా పూర్తి స్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.?ఈ దోపిడీపై దేవస్థానం ఉన్నతాధికారులు మరియు దేవాదాయ శాఖ తక్షణమే స్పందించి,కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని,భక్తులకు ఊరట కలిగించాలని నామా వెంకన్నబాబు,తోట రామక్రిష్ణ(విశ్వహిందూ పరిషత్),ఆకుల కొండ,అడపా దొరబాబు స్థానికులు,భక్తులు కోరుతున్నారు.

## ప్రజా ఆసుపత్రి వైద్యులు రవితేజ కి అభినందనలు




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్22,ప్రభాతవార్త.** అమలాపురం పట్టణంలో ప్రజా వైద్యులుగా ప్రఖ్యాతి గాంచిన కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారెం రవితేజ ను పలువురు ఘనంగా సన్మానించారు.ఆయన పుట్టినరోజు సందర్భంగా వారి స్వగృహంలో మర్యాదపూర్వకం గా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంచే రమణారావు టీమ్ సభ్యులు,పలువురు,స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు అభినందించారు.
ఈ సందర్భంగా కారెం రవితేజ గ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాల తో నిండి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, సమాజానికి, ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

## విత్తనాలు మొలక శాతం గుర్తించాకే విక్రయించాలి



**శంఖవరం జూన్ 22 ప్రభాతవార్త** వరి విత్తనాలను మొలక శాతం గుర్తించిన తర్వాతనే విక్రయించాలని విత్తనాల వ్యాపారులకు వ్యవసాయ అధికారి పి గాంధీ సూచించారు. శంఖవరం మండలంలోని కత్తిపూడిలో గల విత్తనాల దుకాణాలను ఏఓ గాంధీ తనిఖీ చేసి, వివిధ రకాల వరి విత్తనాల స్టాక్ ను పరిశీలించి, పలు సూచనలు చేసారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, స్టాక్ బోర్డు వద్ద రకాల వారీగా రోజు వారి నిల్వలు చూపాలని తెలిపారు. రైతులు తాము కొనుగోలు చేసిన లేదా సొంత విత్తనాలను కూడా మొలక శాతం చూశాక, అవి కూడా విత్తన మొలక శాతం 85 శాతం కంటే ఎక్కువ ఉంటేనే ఆ విత్తనాలు నాణ్యమైనవిగా గుర్తించాలని వివరించారు. అనశీతరం విత్తన నమూనాలను పరీక్ష కొరకు సేకరించారు. తనిఖీలో ఉద్యాన సహాయకులు గోవిందరాజులు, వర్తకులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన కాకినాడ పోలీసులు:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 22,(ప్రభాతవార్త).** కాకినాడ రూరల్ మండలం, పగడాలపేట గ్రామానికి చెందిన బొమ్మిడి లక్ష్మి,బొమ్మిడి రామకృష్ణ ల మూడేళ్ళ వయస్సు గల మనవడు సంగాడి వినయ్ కుమార్( బబ్లు) ఇంటి వద్ద నుండి కనిపించడంలేదని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ సబ్-డివిజనల్ పోలీస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి చైతన్య కృష్ణ నేతృత్వంలో కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని నలుగురు ఎస్‌ఐల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసు బృందాలు అత్యంత వేగవంతంగా, సమన్వయంతో పనిచేసి గ్రామ పరిసర ప్రాంతాలు, రహదారులు, కాలనీలు మరియు ప్రజల సహకారంతో విస్తృతంగా గాలించి, తప్పిపోయిన బాలుడు సంగాడి వినయ్ కుమార్(బబ్లు) ను క్షేమంగా గుర్తించి కాకినాడ సబ్-డివిజనల్ పోలీస్ అధికారి సమక్షంలో సురక్షితంగా ఆ కుటుంబానికి అప్పగించారు. బాలుడిని అతి తక్కువ సమయంలో గుర్తించి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించి నందుకు కాకినాడ రూరల్ మండలం,తూరంగి పగడాలపేట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ గాలింపు చర్యల్లో పాల్గొన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సీలేరు జలాశయం నుండి డెల్టా కు నీరు విడుదల



**మోతుగూడెం ప్రభాతవార్త జూన్:22** ఆంధ్రప్రదేశ్లో గోదావరి డెల్టా ఖరీఫ్ పంటకు ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ నుండి నీరు విడుదల.7000 క్యూసెక్కుల నీటిని ఈ నెల 22 నుండి జూలై 1 వ తారీకు వరకు 10 రోజుల పాటు నీరు విడుదల చెస్తున్నారు. డొంకరాయి జలాశయం నుండి 5 6 గేట్లు ద్వారా 3000 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కులు మొత్తం 7000 క్యూసెక్కుల నీరు ఖరీఫ్ పంటకు సీలేరు జలాలు దిగువకు విడుదల చేస్తున్నారు జెన్కో అధికారులు.ధవలేశ్వరం లోని ఇరిగేషన్ అధికారుల అభ్యర్థుల మేరకు జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈ నీటిని విడుదల చేస్తున్నామని చీఫ్ ఇంజనీర్ కే.వెంకటరాజారావు పేర్కొన్నారు.

## ప్రగతి పథంలో కాకినాడ సిటీ: శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 22 (ప్రభాతవార్త)** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతో కాకినాడ సిటీ నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తుందని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో, మౌలిక సదుపాయాల విస్తరణకు నిదర్శనంగా మారుతోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో కాకినాడ నియోజకవర్గం నందు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యారంగ బలోపేతం, పరిశ్రమల విస్తరణ, పర్యాటకాభివృద్ధి వంటి చర్యలు కాకినాడ ముఖచిత్రాన్ని మార్చే దిశగా సాగుతున్నాయిని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక సూర్య కళామందిరం నందు సోమవారం అదనపు కమిషనర్ కేపీ సుధాకర్ అధ్యక్షతన రాష్ట్రంలో రెండేళ్ల పాలనపై నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. శాసనమండలి సభ్యులు పేరా బత్తుల రాజశేఖరం, మాజీ మంత్రివర్యులు చిక్కాల రామచంద్రరావు, జనసేన నాయకులు అడబాల సత్యనారాయణ, బీజేపీ నాయకులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, వివిధ శాఖల నుంచి విచ్చేసిన అధికారులు ప్రసంగించారు. సభలో వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ విభాగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించగా, పలు సంక్షేమ పథకాల లబ్ధిదారులు వేదిక పైకి వచ్చి తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రభుత్వ పథకాల వల్ల తమ జీవితాల్లో వచ్చిన మార్పును వివరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రెండేళ్లలో కాకినాడ నగర నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల కింద రూ.120.64 కోట్లు, సంక్షేమ పథకాల కింద రూ.450.55 కోట్లు వెచ్చించామని, మొత్తం రూ.591.19 కోట్లు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చు చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటోందని, మహిళలపై నేరాల నియంత్రణ, సోషల్ మీడియా వేధింపులపై చర్యలు, పోలీసు గస్తీ పెంపుతో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందాయిని, ఎమ్మెల్సీ పెరాబత్తుల రాజశేఖర్, చిక్కాల రామచంద్రరావు లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతున్న పథకాలపై దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే కూటమి పాలనకు నిదర్శనమని చెప్పారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పెరికి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వనపర్తి భద్రి, గ్రంధి నారాయణరావు, బచ్చు శేఖర్, పలివెల రవి అనంత కుమార్, మల్లిపూడి నాగ దీపిక, తుమ్మల సునీత రమేష్, పంతాడి రాజు, ఎస్ కె రహీమ్, ఎ వి డి మెంటారావు, కూటమి శ్రేణులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


**శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం**

వాడపల్లి గ్రామం, ఆత్రేయపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

**E- టెండరు ప్రకటన**

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం యొక్క ఈ క్రింది పనుల నిమిత్తం E-టెండరు పిలువబడుచున్నది.

| S.No | Name of the work | Est. Amount | Start date | End date |
|---|---|---|---|---|
| 1 | Erection of GI roof shed for Q lines on North side over the Prakara mandapam | Rs.10.00 lakhs | 23/06/2026 | 07/07/2026 |
| 2 | Erection of GI roof shed for Q lines on South side over the Prakara mandapam | Rs.10.00 lakhs | 23/06/2026 | 07/07/2026 |
| 3 | Providing G.I frames for Rs.50 Q-lines to replace the R&B department frames in phase-II | Rs.10.00 lakhs | 23/06/2026 | 07/07/2026 |
| 4 | Providing Construction of CC drain at parking area in Survey no.7/1A in Ac.6.82 acres | Rs.17.50 lakhs | 23/06/2026 | 07/07/2026 |

మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.
మిగతా వివరములకు దేవస్థానం కార్యాలయం నందు పని వేళలు లో సంప్రదించవలెను.

తేది: 23/06/2026
వాడపల్లి.

శ్రీ నల్లం సూర్య చక్రధర రావు
డిప్యూటీ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్



IN THE COURT OF THE HONOURABLE IX ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD. TS.
M.V.O.P.No. 21 of 2023

Between:-
**Naseem Begum.** ...Petitioner
and
**Aditya Karthik. D. & others.** ...Respondents

To,
**Aditya Karthik D** S/o V. Prasanna Kumar, R/o H.No. 5-8-22-27, Dometti Vari ST. Amalapuram, East Godavari - 533201 A.P. **(Respondent No.1)**

Please take notice that the Petitioner has filed the above M.V.O.P. No. 21/2023 against you and others, and the said case is pending, and posted to **30-6-2026** for your appearance, if you fails to appear before the above court on **30-6-2026 at 10-30 A.M,** in person or through Counsel, the matter will be decided as per Law.

//BY ORDER OF THE COURT//
**Sd/- MOHAMMED AYUB KHAN**
Advocate
17-2-790/6/B1, Ground Floor
Madannapet, Near Water Tank
Saidabad, Hyderabad. TS.
Cell: 9493410787.

# పవన్ కళ్యాణ్ ను విమర్శించే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి..

## -వైసీపీ కాపు నాయకులకు ఎమ్మెల్యే గిడ్డి హెచ్చరిక..



**అంబాజీపేట (పి.గన్నవరం), జూన్ 22,(ప్రభాతవార్త):**జాతీయ సమైక్య భావం కలిగిన జనసేనాని,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను ఒక కులానికి, ఒక ప్రాంతానికి ఆపాదిస్తూ విమర్శలు చేస్తున్న వైసీపీ కాపు నాయకులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హెచ్చరించారు.పి.గన్నవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విలేకరుల సమావేశంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురంలోనే ఎందుకు పోటీ చెయ్యాలి వేరే చోట ఎందుకు పోటీ చెయ్యకూడదని వైయస్సార్ సీపీకి చెందిన కాపు నాయకులు ప్రశ్నిస్తున్నారని,మీ పార్టీ అధినేత పులివెందులలోనే ఎందుకు పోటీ చేయాలి, వేరే చోట ఎందుకు పోటీ చేయకూడదని మేం ప్రశ్నిస్తున్నామన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కాపు నాయకులు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై కామెంట్స్ చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అంకిత భావంతో పనిచేసే వ్యక్తిని,జనసేనపార్టీ కులం కోసం, మతం కోసం పెట్టిన పార్టీ కాదని, కులాల్ని కలిపే ఆలోచన విధానం మా జనసేన పార్టీ సిద్ధాంతమన్నారు.మా నాయకుడు ఆంధ్రాలోనే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఏ రాష్ట్రానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారని తెలిపారు.ప్రపంచ దేశాలు ప్రధాని మోడీ వైపు చూస్తుంటే ప్రధాని మోడీ మా అధినేత పవన్ కళ్యాణ్ వైపు చూస్తున్నారన్నారు.శ్రీ కాళహస్తిలో జనసేన కార్యకర్త కొట్టే సాయిపై కొంతమంది దుండగులు దాడి చేస్తే జిల్లా ఎస్పీతో మాట్లాడి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి కార్యకర్తకు భరోసా కల్పించి అతనికి శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ పదవి ఇచ్చిన మా అధినేత పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడన్నారు.కృష్ణలంకలో సాయికృష్ణని పోలీసులు నిర్బంధించి హత్య చేశారని ఆరోపణలు చేయడం ఎంతవరకు వాస్తవం. ఎంతటి దోషులనైనా వారు ఏ కులానికి చెందిన వారైనా చట్టం తన పని తాను చేసుకుపోతుందని మా నాయకుడు చెప్పడం జరిగిందన్నారు.వైసీపీ ప్రభుత్వంలో కాపు లకు కాపునేస్తం,స్టూడెంట్స్ కి స్కాలర్షిప్, ఈడబ్ల్యూఎస్ వంటి పథకాలు నిలుపుదల చేసి కాపు కళ్యాణ మండపాలు మధ్యలోనే నిలిపి వేసినప్పుడు ఆరోజున కాపు నాయకులకు కాపులు గుర్తు రాలేదా? ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్ను హత్య చేసి డోర్ డెలివరీ చేసినప్పుడు అతనిని అరెస్టు చేయడం మానేసి, అతనికి బెయిల్ ఇప్పించి ఊరేగిస్తూ తీసుకొచ్చినప్పుడు మీరేం చేశారన్నారు.పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసే ముందు వైసీపీ నాయకులు ఆలోచించుకోవాలని, లేకుంటే జనసేన ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వైసిపి కాపు నాయకులను తీవ్రంగా హెచ్చరించారు. ఆయనతోపాటు జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

## భజన కళారంగాన్ని పరిరక్షించాలి. ...బ్రహ్మానందం



**పెద్దాపురం,ప్రభాతవార్త:**కనుమరుగవుతున్న భజన కళారంగాన్ని పరిరక్షించాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, భజన కళారంగ గురుదేవులు సలాది బ్రహ్మానందం కోరారు. పెద్దాపురం మండలం పుట్టకొండ గ్రామంలో మాజీ సర్పంచ్ వెల్ల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో శ్రీరామ సప్త మహోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు సలాది బ్రహ్మానందమును పుట్టకొండ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే భజన కళా రంగం కొనసాగుతుందన్నారు. ప్రజలు భజన కళారంగాన్ని పరిరక్షించాలని ఆయన కోరారు. గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## ఈనెల 25 తేదీ నుండి ర్యాలి శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు.



**ఆత్రేయపురం, జూన్ 22.(ప్రభాత వార్త)**ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయంలో వేంచేసి యున్న క్షేత్రపాలకులైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత గోపాల స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ పెద్ది నాగేశ్వరరావు,ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి, దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25. తేదీ గురువారం ఏకాదశి నుండి 30. తేదీ మంగళవారం పాడ్యమి వరకు జరిగే కార్యక్రమాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.25వ తేదీన గురువారం సా.6.18 గం.లకు అంకురార్పణ, ధ్వజారోహణ అనంతరం శ్రీ స్వామి వారి కళ్యాణం, 27. తేదీ శనివారం సదస్యం, 29.వ సోమవారం ఉ.7.30 గం.లకు పూర్ణాహుతి, చక్రస్నానం, 30.వ మంగళవారం సా.7.30 గం.లకు శ్రీ పుష్పయాగం మొదలగు కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.భక్తులు, దాతలు, గ్రామస్తులు శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవాలలో పాల్గొని, తిలకించి శ్రీ స్వామి వారి ఆశీస్సులు పొందవలసినదిగా వారు కోరారు.

## మండపాక శ్రీ బాబు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ:



**జగ్గంపేట జూన్ 22 (ప్రభాతవార్త)** జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు మండపాక శ్రీ బాబు తండ్రి మండపాక సూర్యనారాయణ మూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం సూర్యనారాయణ దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిసభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీ బాబు కుటుంబాన్ని, వారి సోదరి అనిత కామిరెడ్డి చక్రధరరావును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, జిల్లా ద్విచక్ర అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, మండపాక వెంకటేశ్వరరావు, మండపాక పాపారావు, అడబాల సంతోష్, మండపాక వీర సూర్య చక్ర రావు, మండపాక బాపన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన యువ నాయకుడు, బండారు సంజీవ్..




**ఆత్రేయపురం, జూన్ 22.(ప్రభాత వార్త)** ఇటీవల మృతిచెందిన మండలంలోని బొబ్బర్లంక, అంకంపాలెం, ర్యాలి గ్రామాలలో పలు కుటుంబాలను సోమవారం యువ నాయకులు బండారు సంజీవ్, జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు కూనపురెడ్డి రామకృష్ణంరాజు, ముదన కృష్ణమూర్తి,గ్రామ నాయకులు పరామర్శించారు. ఆయన వెంట కూటమి నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## రైతు నేస్తం చెక్కులను పంపిణీ...



**ఆత్రేయపురం, జూన్ 22.(ప్రభాత వార్త)**రైతులకు కొత్తగా రైతు నేస్తం లోన్లు చెక్కులను మండలంలోని వెలిచేరు సొసైటీ బ్యాంకులో సోమవారం బ్యాంక్ మేనేజర్ సుజన అధ్యక్షతలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొని నూతనంగా అమలు చేస్తున్న రైతు సంక్షేమానికి చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు రైతు నేస్తం బ్యాంక్ ద్వారా చెక్కులను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ రైతు బాగుంటే ప్రజలు బాగుంటారని అదేవిధంగా యూరియా పాడి పశువుల వ్యవసాయం పెంపు ఆదుకుంటూ రైతులను అండగా ఉంటామని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీనివాసరావు, సంఘ సీఈవో సోమన్న, రైతులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం, పశుసంపద అభివృద్ధే కూటమి లక్ష్యం ఎమ్మెల్యే చిన రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల



**పెద్దాపురం, జూన్ 22(ప్రభాత వార్త)**రైతు సంక్షేమం, పశు సంపద అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్న రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు అన్నారు.పెద్దాపురం మండలం ఆర్ బి కొత్తూరులో సోమవారం పశు వైద్య శిబిరం -- లేగదూడల సంరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నాని మంగా లక్ష్మి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ లేగదూడల భవిష్యత్ పాల ఉత్పత్తికి, రైతుల వారి పోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతు సంక్షేమం, పశుసంవర్ధక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, పాడిపరిశ్రమ రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమన్నారు. రైతులు లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆవులు, గేదెల నుంచి వచ్చే పాలను పూర్తిగా సేకరించకుండా, లేగదూడల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైనంత పాలను వాటికి అందించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన లేగదూడలే భవిష్యత్తులో అధిక పాల ఉత్పత్తికి, రైతుల ఆదాయ వృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. పశువులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించడం, వ్యాధి నిరోధక టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం ద్వారా పశుసంపదను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్యం, పోషణ, ఉత్పాదక పెంపు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పెద్దాపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారిశెట్టి వెంకటేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, పశువైద్యాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు మరియు కూటమి నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం మరో ముందడుగు ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల



**పెద్దాపురం, జూన్ 22(ప్రభాత వార్త )**గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు.సోమవారం పెద్దాపురం ఎంపీడీవో కార్యాలయంవద్ద పెద్దాపురం మండలంలోని గ్రామ పంచాయతీలకు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ట్రైసైకిళ్లను వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే వి సూర్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు.. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించేందుకు ఈ ట్రైసైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని వారు పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతం, పారిశుద్ధ్య వ్యవస్థ అభివృద్ధి, ప్రజా ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా,ఆరోగ్యవంతంగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలు కూడా చెత్త వర్గీకరణ, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి కార్య నిర్వాహణ కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, దివిలి నీటి సంఘం ఉపాధ్యక్షులు జట్ల విజయబాబు, టిడిపి మండల ప్రెసిడెంట్ మొయిళ్ల కృష్ణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు కొత్తం కోటి జనసేన నాయకులు పాలశెట్టి రాజు, సామర్లకోట మండల యువత అధ్యక్షుడు మల్లెడ్డి బుచ్చిరాజు, పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పాలమారశెట్టి సత్తిబాబు, కొత్తం కోటి, టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, అధికారులు, జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లంకకు వెల్లువెత్తిన భక్తులు.

**-కన్నుల పండుగగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం.- గౌతమి గోదావరి సంగమ ప్రాంతంలో శేషశయన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం.-దృఢ సంకల్పంతో కార్యాలు సాధించవచ్చు. పరిపూర్ణానంద స్వామీజి.**

**- దాత కనుమూరి దంపతులచే భక్తులకు మహా అన్నదానం.**



**తాళ్లరేవు, జూన్ 22( ప్రభాతవార్త):** గోదావరి జిల్లాల్లో ఎక్కడ లేనటువంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం గౌతమి గోదావరి సంగమ ప్రాంతంలో వెలసింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గౌతమీ గోదావరి నదీ తీరాన ఉన్న పిల్లంక గ్రామంలో పునఃనిర్మించిన శ్రీ వల్లి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ సహిత, శిఖర, ధ్వజ, యంత్ర, నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం కన్నుల పండుగగా జరిగింది. కాకినాడ శ్రీ పీఠం వ్యవస్థాపకులు పరిపూర్ణానంద స్వామిజీ ఈ ప్రతిష్టా కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. ఈ నెల 17 వ తేదీన ప్రారంభమైన ఈ ప్రతిష్టా మహోత్సవాలు ప్రతిరోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగాయి. ఆలయ నిర్మాణ కర్త వేలూరి వెంకట కామేశ్వర శర్మ(కాశిబాబు) ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రత్యేక యాగశాలలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, యజమానులచే ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త సాగి భీమేశ్వర రాజు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముందు పరిపూర్ణానంద స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. చేపట్టిన పని పట్ల దృఢ సంకల్పం ఉంటే ఎంతటి కార్యమైనా సాధించవచ్చని ఆలయ నిర్మాణము, విగ్రహ ప్రతిష్ట చేపట్టిన నిర్మాణకర్త వేలూరి కామేశ్వర శర్మ పట్టుదల రుజువు చేసిందన్నారు. భగవంతుని పట్ల అందరూ పూర్తి విశ్వాసం ఉండి ధ్యానించాలన్నారు. కాకినాడ శ్రీపీఠంలో జరిగే అమ్మవారి కార్యక్రమాలకు భక్తులందరూ హాజరుకావాలని ఆయన కోరారు. అనంతరం ఆలయంలో విగ్రహాలను, పీటలపై కూర్చున్న దంపతులతో కలసి ఆయన ప్రతిష్టించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం కలన్యాసములు, శాంతి కళ్యాణం నిర్వహించారు. గో దృష్టిలో భాగంగా గోవు దర్శనం అయిన తర్వాత భక్తులు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించి తరించారు. లికనుమూరి దంపతులచే మహా అన్నదానం: విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో భాగంగా పిల్లంక గ్రామస్తులు అన్నదాత కనుమూరి సీతారామరాజు దంపతులు, కనుమూరి శ్రీనివాసరాజు దంపతులచే వేలాది మందికి మహా అన్నదానం నిర్వహించారు. దాతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే పొన్నడ వెంకట సతీష్ కుమార్, వైకాపా సీఈసీ సభ్యులు పితాని బాలకృష్ణ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గొల్లపల్లిని పరామర్శించిన శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

**- గొల్లపల్లి ప్రసాద్ మృతికి పలువురి నివాళి**



**రావులపాలెం, జూన్ 22,(ప్రభాతవార్త) :** పుత్ర వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును, ఆయన కుటుంబ సభ్యులను సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పరామర్శించారు. రావులపాలెంలోని గొల్లపల్లి నివాసానికి వెళ్లి సూర్యారావు చిన్న కుమారుడు గొల్లపల్లి ప్రసాద్ ఆకస్మిక మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గొల్లపల్లిని పరామర్శించిన వారిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ నాయకులు ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, బండారు సందీప్, రామచంద్రాపురం జిల్లా కోర్టు పి.పి కప్పల సునీల్ జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పినిపే శ్రీకాంత్, సాకా ప్రసన్న కుమార్, కర్రి నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సూధా గణపతి, రవణం వేణుగోపాల్, కర్రి రాఘవ, కాపు సంఘం అధ్యక్షుడు నందం వీర వెంకట సత్యనారాయణ, మైగాపుల గురవయ్య, రాజోలు నియోజకవర్గ నాయకులు తదితరులు ఉన్నారు.

## భార్యతో కలహాలు.. గోదావరిలో దూకిన యువకుడు




**రావులపాలెం, జూన్ 22, (ప్రభాతవార్త) :** భార్యాభర్తల మధ్య తలెత్తిన కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఓ యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన ధర్మాడి వీరబాబు ప్రస్తుతం రావులపాలెంలో నివాసముంటూ తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం అతనికి వివాహం కాగా, భార్య ప్రస్తుతం మూడో నెల గర్భిణిగా ఉన్నట్లు తెలిసింది. ఇటీవల భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన వీరబాబు సోమవారం రావులపాలెం గౌతమి గోదావరి వంతెనపై నుంచి నదిలో దూకినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాలువలలో పూడికలు తొలగించండి.

**రౌతులపూడి,(ప్రభా త వార్త)**పంట కాలువలలో పూడికలు తీయించి రానున్న రబీ సీజన్లో రైతులకు నీరందించాలని మండల రైతులు కోరుచున్నారు.మండలంలో ములగపూడినుంచి గిడజాం మీదుగా అన్నవరం ప్రాజెక్టుకు నీరువెల్లె కాలువతోపాటు, బల్లకట్టు చెరువు,పెద్దచెరువు, దెయ్యాల చెరువు, రాజయ్య చెరువు,తదితర చెరువుల నుంచి పంటలకు నీరు వెళ్లవలసివున్నది. వీటినుంచి నీరు వెళ్ళే కాలువలు పూడికలు,గుర్రపుడెక్క వంటి వాటితో నిండిపోయాయి.దీనివలన రబీ సీజన్లో పొలాలకు నీరు అందడానికి ఇబ్బందిగా వుండే అవకాశమున్నందున పూడికలు తొలగించాలని మండల రైతులు కోరుచున్నారు.

## ఐఐటి అడ్వాన్స్-2026 పరీక్షల్లో 9వ ర్యాంకు సాధించిన కోనసీమ కుర్రోడు..

**-నియోజకవర్గంలో ర్యాంకుల పరంపర కొనసాగుతోంది.. -ఎమ్మెల్యే గిడ్డి..**



**అంబాజీపేట,జూన్ 22 (ప్రభాతవార్త):**పి.గన్నవరం నియోజవర్గంలో ర్యాంకుల పరంపర కొనసాగుతోందని,అటు పాలనాపరంగాను ఇటు విద్యా పరంగాను రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.ఐఐటీ అడ్డాన్స్-2026 పరీక్షల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 9వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్న మేడిశెట్టి నాగ సహర్ష అభినందన సభ పసుపల్లిలో సోమవారం జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పి. గన్నవరం నియోజకవర్గంలో సుమారు వెయ్యి కోట్లతో రెండేళ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమ దిశగా పయనింపజేస్తున్నందుకు రాష్ట్రంలో ఎనిమిదవ స్థానం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిందని,అలాగే నియోజకవర్గంలోని అంబాజీపేట మండలం పసుపల్లి గ్రామానికి చెందిన నాగ సహర్ష ఐఐటీ అడ్వాన్స్-2026 పరీక్షల్లో జాతీయస్థాయి గుర్తింపు తీసుకురావడంతో పి.గన్నవరం నియోజకవర్గం మరోసారి వార్తల్లో నిలిచిందని, దీనికి తాను ఎంతో సంతోషిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.మేడిశెట్టి నాగసహర్ష ఐఐటీ అడ్డాన్స్ డ్ ఓపెన్ కేటగిరిలో 9వ ర్యాంకు సాధించడడంతో ముంబాయిలోని ఎంతో ప్రాముఖ్యత కలిగిన ముంబాయి ఐఐటీ కాలేజ్లో కంప్యూటర్ సైన్స్ సీటు లభించిందన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్య ఎంతో దోహదం చేస్తుందని,భవిష్యత్తులో నాగ సహర్ష దేశానికి సేవలందించేలా మరింత ఉన్నత స్థితికి వెళ్లాలని ఆకాంక్షించారు.నాగ సహర్ష తండ్రిమేడిశెట్టి అప్పారావు వైజాగ్లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారన్నారు.తల్లి రాజేశ్వరి గృహిణి. నాగ సహర్ష మాట్లాడుతూ1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు శ్రీ చైతన్య స్కూల్ వైజాగ్లోను, ఇంటర్మీడియట్ హైదరాబాద్ చైతన్య కాలేజ్ నందు విద్యను అభ్యసించానన్నారు. అనంతరం ఐఐటీ సీటు కోసం కోచింగ్ తీసుకుంటూ రోజుకు 12 గంటలకు చదువుకుంటూ ఉండేవాడినన్నారు. మరో రెండు గంటలు చదివిన వాటిపై రివజన్ చేసేవాడినని నాగసహర్ష తెలిపారు. చదువు పట్ల సరి అయిన ప్రణాళిక, అవగాహన, సమయపాలనతో ఒత్తిడి లేకుండా చదవడం, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రోత్సాహం వల్లే ఈ ర్యాంకు సాధించగలిగనన్నాడు. చిన్నప్పటి నుండి ముంబై ఐఐటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదవాలనే లక్ష్యంగా పెట్టుకుని శ్రమ పడి ఇష్టంగా చదివానని తెలిపాడు. చదువు పూర్తి అయిన తరువాత సివిల్స్ లేదా సాఫ్ట్వేర్ రంగంలో రాణించాలనే లక్ష్యంగా ఎంచుకున్నానని నాగసహర్ష తెలిపారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు కూటమి శ్రేణులు నాగ సహర్ష పాటు అతని తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.అలాగే స్థానికులు,బంధువులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, బంధువులు, స్థానికులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 22( ప్రభాతవార్త)** సర్ ప్రక్రియను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సోమవారం సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫారాల పంపిణీ బూత్ లెవెల్ అధికారులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలతో నేరుగా మాట్లాడి సర్ ప్రక్రియ పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఫారాలను ఎలా పూర్తి చేయాలి ఏ ఏ వివరాలు నమోదు చేయాలని అంశాలను సులభంగా వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్క ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సర్ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ సమర్థవంతంగా పనిచేస్తుందని క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని 241 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,65721 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 1,03,532 ఫారాలు పంపిణీ చేయగా 1899 ఫారాలు డిజిటల్ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసి సెక్రటరీ శైలజ వల్లి ఎమ్మార్వో రంజిత్ కుమార్ బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.పి జి ఆర్ ఎస్ లో 37 అర్జీలు స్వీకరణ:సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్లో 37 అర్జీలు స్వీకరించినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. వీటిలో ఇంజనీరింగ్ సంబంధించి 8 ,రెవిన్యూ కి మూడు, టౌన్ ప్లానింగ్ 14 ,పబ్లిక్ హెల్త్ ఆరు, హౌసింగ్ ఒకటి ,పింఛన్లు నాలుగు ,అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 వచ్చాయని వివరించారు.

## తుప్పలమయంగా కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ విష పురుగుల భయంతో ప్రజలు ఆందోళన

**కాట్రేనికోన: జూన్ 22 (ప్రభాతవార్త** మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ పూర్తిగా తుప్పలు, పిచ్చి మొక్కలతో నిండిపోయిందని ప్రజలు భయాందోళన



వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆసుపత్రి వెనుక మరుగుదొడ్డి చెంతన, పరిసరాల్లో పచ్చగడ్డి, తుప్పలు ఏపుగా పెరిగాయి. వర్షాకాలం కావడంతో వీటిలోకి పాములు, తేళ్లు వంటి విష జంతువులు చేరే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కేంద్రం కావడంతో ప్రతిరోజూ ఇక్కడకు వివిధ ఆరోగ్య సమస్యల నిమితం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రమాదవశాత్తూ ఎవరినైనా ఏదైనా కరిస్తే ఇబ్బంది పడాల్సి ఉంటుందని వైద్య సేవల కోసం వచ్చే రోగులు, గర్భిణీలు, వృద్ధులు ఆసుపత్రి ఆవరణలోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో వచ్చేవారు విష జంతువుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజలు మాట్లాడుతూ, "ప్రాణాలు కాపాడే ఆసుపత్రి ఆవరణలోనే ప్రాణహాని పొంచి ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే పీహెచ్ సీ ఆవరణలో ఎవరికి ఎటువంటి అపాయం జరగకుండా తుప్పలు తొలగించి పరిశుభ్రత చేయించాలి అని కోరుతున్నారు.

## వృత్తి నైపుణ్యం ద్వారా మహిళల అభివృద్ధి. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు: గంగ సూర్యనారాయణ.



**తాళ్లరేవు, జూన్ 22( ప్రభాతవార్త):** వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా మహిళలు తమ జీవనోపాధి మెరుగుపరచుకోగలరని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు మందాల గంగ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని చొల్లంగిపేట లో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ శిక్షణ పొందుతున్న మహిళలు, యువతులతో ఆయన మాట్లాడారు. మహిళా మండలి సిద్ధం చేసిన శిక్షణలో ఉపయోగించే ఎంబ్రాయిడరీ ఫ్రేములు, వస్త్రములు, కత్తెరలు, దారములు, కాగితములు ఆయన పంపిణీ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలకు ఉపాధి కల్పించే నిమిత్తం నూతన శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించి కొనసాగిస్తున్న బీమాబాయి మహిళా మండలి సేవలను కొనియాడారు. ఈ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీమాబాయి మహిళా మండలి ముఖ్య కార్యనిర్వహణాధికారి వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణతో పాటు ఎంబ్రాయిడరీ శిక్షణను పొందడం ద్వారా అధిక ఆదాయాన్ని కల్పించాలనే సదుద్దేశంతో ఎంబ్రాయిడరీ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణకు అవసరమయ్యే సామాగ్రిని పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ బీట్ అధికారి జి. గోపి, సిబ్బంది వి. విష్ణు, బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సేవే లక్ష్యంగా రక్షణ సేవా సమితి నూతన కమిటీ



**గోపాలపురం జూన్ 22 (ప్రభాతవార్త):** గోపాలపురం రక్షణ సేవా సమితి మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మరోసారి గెల్ల ఎలీషా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా బత్తుల రమేష్(షాలెంరాజు), ఉపాధ్యక్షుడిగా ఖండవల్లి శ్యాంబాబు, కార్యదర్శిగా తానింకి రాజారత్నం, జాయింట్ సెక్రటరీగా పసలపూడి రత్నరాజు, కోశాధికారిగా చోళ్ల రాజ్ పాల్, ముఖ్య సలహాదారుగా దాసరి రామారావు, కమిటీ సభ్యులుగా గుంటు జోషి, కావూరి రాజా సుధీర్ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గెల్ల ఎలీషా మాట్లాడుతూ.. 2012లో ప్రారంభమైన రక్షణ సేవా సమితి అప్పటి నుంచి పేదలు, నిరుపేదలు, అనాథలు, రోగులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరణ పొందుతోందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సహాయం, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, పాలు పంపిణీ, అనాథ పిల్లల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

## విద్యాధికారికి డి వై ఈ ఓ గా పదోన్నతి..



**సఖినేటిపల్లి జూన్ 22, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల విద్యాధికారిగా దొండపాటి కిశోర్ కుమార్ పనిచేస్తున్నారు.అమలాపురం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా (Dy.E.O.) అదనపు బాధ్యతలను ఈ రోజు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డివిజన్ మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, అభినందించారు.

## మరిడమ్మ అమ్మవారి జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ం



**పెద్దాపురం జూన్ 22 (ప్రభాత వార్త )** రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపుగా పేరొందిన పెద్దాపురం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు కోరారు. వచ్చేనెల 14వ తేదీ నుంచి జరిగే జాతర ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం పెద్దాపురం ఆర్డీవో పి కృష్ణమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 37 రోజులపాటు జరిగే శ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవములకు వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్డిఓ పి కృష్ణమూర్తి, డీఎస్పీ తిలక్ మాట్లాడుతూ శాఖల సమన్వయంతో జాతర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులకు యాత్రికులకు దూర ప్రాంతాల నుంచి ప్రతి ఒక్కరికి ఇటువంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి మాట్లాడుతూపెద్దాపురం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి ఆషాడ మాస జాతర మహోత్సవములు జూలై 14వ తేదీ నుండి ఆగష్టు 19 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతరలో భాగంగా ఈ నెల ది 29వ తేదీన ఉయ్యాల తాళ్ళ ఉత్సవం, వచ్చే నెల 13వ తేదీన జాగరణ ఉత్సవం జరుగుతుందన్నారు. 37 రోజులు జరిగే ఈ జాతర మహోత్సవములకు వివిధ శాఖల అధికారులు ప్రజలు సహకరించాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే చిన్నరాజప్ప డిసిసిబి చైర్మన్ బాబులకు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, పురోహితులు ఆలయమర్యాదలతో స్వాగతం పలుకగా, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అతిథులకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సమావేశం లో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, కూటమి నాయకులు, వివిధశాఖల అధికారులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## దుర్గాడ అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**గొల్లప్రోలు,జూన్22,(ప్రభాతవార్త)** గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో సోమవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.స్థానిక ఎస్సీ కాలనీలో గల 2వ అంగన్వాడి కేంద్రంలో ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే,వేడుకలు నిర్వహించడంతో పాటు కొత్తగా చేరిన ఐదేళ్ల నిండిన పిల్లలకు సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం' చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గొల్లప్రోలు మండల జనసేన పార్టీ అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పేద సత్యనారాయణ,గొల్లప్రోలు గ్రామ జనసేన ఉపాధ్యక్షులు గొల్లపల్లి శివబాబు పలువురు కూటమి నాయకులు చిన్నారులను ఆశీర్వదించారు.అనంతరం అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన ఇండక్షన్ స్టవ్లను నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.కొత్త మెనూ నవచేతన యాప్పై అవగాహనఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ వివరాలను గర్భిణులు,బాలింతలకు వివరించారు.అలాగే అంగన్వాడీ సేవల పర్యవేక్షణ కోసం రూపొందించిన 'నవచేతన యాప్' పనితీరు,ఉపయోగాలను తల్లులకు క్షుణ్ణంగా వివరించి చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ కార్యకర్తలు,ఆయా కేంద్రాల లబ్ధిదారులు, చిన్నారుల తల్లులు కూటమి నాయకులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## అన్యాయాలపై చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్‌లో మాజీ ఎంపీ భరత్ రామ్ ఫిర్యాదు



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 22 (ప్రభాతవార్త)ప్రభుత్వ అన్యాయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజమండ్రి పార్లమెంట్ మాజీ సభ్యులు మార్గాని భరత్ రామ్ కార్యకర్తలతో కలిసి జిల్లా కలెక్టరేట్లో లోని పిజిఆర్ఎస్ లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం సాగుతుందని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. నగరంలో జరిగిన కల్తీ పాల ఘటనలో బాల బాలికలు మెరుగైన ఆధునిక వైద్య అందక మృత్యు ఒడిలోకి జారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా వదిలేసిందని విమర్శించారు. తమ పార్టీలో క్రియాశీలకంగా ఉండే బీసీ నాయకుడు పీత రామకృష్ణ పై అక్రమంగా పిడి చట్టం ప్రయోగించారని భరత్ మండిపడ్డారు. ఇదంతా ఇవి ఎమ్మెల్యే కుట్ర లో భాగమని అనిని ఒత్తిడి మేరకు పోలీసులు నియంతృత్వముగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గామన్ బ్రిడ్జి రక్షణ పర్యావరణ పరిరక్షణ కోరుతూ ఆరోగ్యపరంగా ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా ధర్నాలు చేస్తామని అవసరమైతే నిరాహార దీక్షలు భరత్ హెచ్చరించారు. ఇసుక దోపిడీకి సంబంధించి సాక్ష్యాధారాలను జిల్లా కలెక్టర్ అందజేసినామని చెప్పారు. ముఖ్యంగా షాది ఖానా నిర్మాణానికి తన హయాంలో 2500 చదరపు గజాలు కేటాయించి 50 లక్షల రూపాయలు నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలంలో పనులు కూడా ప్రారంభించలేదని ఈ నిర్మాణం జరిగే వరకు పోరాడుతానని చెప్పారు. ఈయన వెంట వైసీపీ నాయకులు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి మేట్ లకు గౌరవ వేతనం వెంటనే అందించాలి..




సఖినేటిపల్లి జూన్ 22, ప్రభాత వార్త: గ్రామీణ ఉపాధి పథకంలో కీలకంగా వ్యవహరిస్తూ ఉపాధి కూలీల ఫోటో రికగ్నైజేషన్, జాబ్ కార్డు సర్వే వరకు అనేక సేవలందిస్తున్న ఉపాధి మేట్స్ కు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు కల్పించకపోవడం అన్యాయమని, ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి మేట్ ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏర్పాటు చేసిన నిరసన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాప్ ల నిర్వహణ కొరకు ప్రతి నెల రూ 350 ల చొప్పున మొబైల్ రీఛార్జిలు మూడేళ్లుగా స్వంత నిధులు వెచ్చించి పనులు చేస్తున్నారని, ప్రభుత్వం నుండి సహాయం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిమేట్స్ సేవలను గౌరవించి ప్రయోజనాలు కల్పించి వారిని ఆదుకోవాలని, ప్రతి మేట్ కు సెల్ సౌకర్యం కల్పించాలని, రీఛార్జ్ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, మేట్స్ కు గౌరవ వేతనం ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి మేట్స్ నిరసనలు, నినాదాలు తెలుపగా, ఎంపీడీవో రాజ్ కుమార్ కు వినతి పత్రాన్ని మేట్స్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టూరి నిర్మల కుమారి, చింతా హేమలత, ఉపాధి మేట్స్ లంకె తాతారావు, గొల్లమందల రాజబాబు, పి స్వరాజ్యం, జి కనకదుర్గ, కాసారి శ్రీను బాబు, మల్లాడి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## వాతంగిలో ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని కలెక్టర్‌కు అర్జీ



రాజవొమ్మంగి, జూన్ 22, ప్రభాతవార్తరాజవొమ్మంగి మండలం వాతంగి గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ యు పి. పాఠశాలను ప్రాథ మిక పాఠశాలగా మార్పు చేయకుండా ఆశ్రమ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని సోమవారం రంపచోడవరం ఐ. టి. డి. ఏ లో జరిగిన ప్రజావాణిలో పోలవరం కలెక్టర్ దినేష్ కుమార్ కు మాజీ ఉపసర్పంచ్ రాళ్లగడ్డ అర్జున్ ఆధ్వర్యంలో 40 మంది గిరిజనులు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు 120 మంది గిరిజన విద్యార్థులు ఉండి చదువుకొనే వారని కలెక్టర్ కు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాథమిక పాఠశాలగా కొనసాగనున్నదని, హాస్టల్ కొనసాగింపుకు ప్రభుత్వంకు తెలియజేస్తానని కలెక్టర్ అన్నారన్నారు. కొమరావరం నుండి పాకలపల్లి గ్రామం వరకూ 10 కిం. క్రితం నిర్మించిన బి. టి. రహదారి గుంతలుగా ఏర్పడి ప్రయాణానికి వాతంగి, లోదొడ్డి పంచాయితీలకు చెందిన 12 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని మరొక అర్జీని ఇచ్చారు. గత ఏడాది గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ అధికారులు రూ.2.60 కోట్ల అంచనా ప్రతిపాదనలు మాజీ ఉపసర్పంచ్ అర్జున్ కలెక్టర్ కు చూపించారు. ఈ కార్యక్రమంలో వాతంగి మాజీ ఉపసర్పంచ్ రాళ్లగడ్డఅర్జున్, మాజీ సర్పంచ్ జల్లా ధూలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ పీరు వెంకటదుర్గ, వైస్ చైర్మన్ అన్నిక నూకరత్నం, మాజీ వార్డు మెంబర్ పుష్పలత,నిర్మల జ్యోతి, వీరమణి, నాగమణి. ధూలక్ష్మి,. రాజేశ్వరి, సోని, ప్రభావతి,అర్జమ్మ, మనీషా పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పిల్లి సూర్యప్రకాష్ అవగాహన



కె.గంగవరం, జూన్ 22, (ప్రభాతవార్త) కె గంగవరం మండలం గంగవరం,తామరపల్లి, పాణింగపల్లి, అముజూరు, పామర్రు, యండగండి గ్రామాల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై అవగాహన కార్యక్రమంలో వైయస్సార్సీపి రామచంద్రపురం నియోజకవర్గ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. బి ఎల్ ఏ, వి ఆర్ ఓ తో కలిసి ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలుసుకుని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండలం ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు,మండల కన్వీనర్ పెట్లా శ్రీనివాస్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ చిల్లి నాగేశ్వరరావు, మండల బూత్ కన్వీనర్ దారా సత్యనారాయణ,దంగేటి శ్రీను, రమణ, పిల్లి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, పల్లా సోమశేఖర్ ఆకుల చిన్న ,కే రాంబాబు ఆయా గ్రామ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలి -ఎం పి డి ఓ



కాట్రేనికోన, జూన్ 22(ప్రభాతవార్త) కొప్పిగుంట గ్రామ పంచాయతీ,స్వర్ణ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ బి.రాజేశ్వర్ రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది అటెన్ హాజరు తదితర వివరాలను నిశితంగా పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని,ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి,పౌర సేవలు నిర్దిష్టంగా విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి జె.కిరణ్, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా కల్వర్టుల నిర్మాణం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి

## చోద్యం చూస్తున్న ఇరిగేషన్ శాఖ, పంచాయతీ అధికారులు.



ఆత్రేయపురం, జూన్ 22,(ప్రభాత వార్త) సాగునీటి సక్రమ నిర్వహణకు ఏర్పాటైన పంట కాలువలపై కొందరు అక్రమార్కులు ఇస్తారాజ్యంగా కల్వర్టు నిర్మిస్తున్నారు అక్రమ కట్టడాలను నియంత్రించవలసిన ఇరిగేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో పంట కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా అందక శివారు ప్రాంత రైతులు ఇక్కట్లు పడుతున్నారు. లొల్ల హైలెవెల్ ఛానల్ పై మెర్లపాలెం శివారు ఊబలంక సాయి బాబా గుడి సమిపంలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి తన వెంచర్ కోసం దర్జాగా లొల్ల హైలెవెల్ ఛానల్ పై కల్వర్ట్ నిర్మించాడు. సుమారు 50 అడుగుల పొడవుతో ఏర్పాటు చేసిన ఈ కల్వర్టుతో శివారు ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు పలు మార్లు నోటీసులు ఇచ్చిన పట్టించుకోకపోవడం విశేషం.దీనిపై ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. గత ఏడాది అదే ప్రాంతంలో కల్వర్టు నిర్మించేందుకు రియాల్టర్ ప్రయత్నం చేయగా సాగునీటి సంఘాల ప్రజాప్రతినిధులు ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. అయితే ఈ ఏడాది సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహారించడంతో ఛానల్ పై రియల్ ఎస్టేట్ వ్యాపారి దర్జాగా కల్వర్టు నిర్మించి పూర్తి చేశాడు. ఎటువంటి అనుమతులు లేకుండా ఛానల్ పై కల్వర్టును నిర్మించిన వారిపై ఇరిగేషన్ అధికారులు తగు చర్యలు తీసుకుని సాగునీరు సక్రమంగా అందే విదంగా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు



## జడ్డంగి పి. హెచ్. సి కి బర్త్ వెయిటింగ్ హాలు నిర్మించండి..

### -బి. జె. పి. రాష్ట్రకార్యదర్శి స్వప్నకుమారి



రాజవొమ్మంగి, జూన్ 22, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ హాలు లేక ప్రసవానికి వచ్చే వారికి కనీసం భోజన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతిపత్రంను ఇచ్చారు. సోమవారం రంపచోడవరం ఐ. టి. డి. ఏ లో జరిగిన ప్రజావాణిలో అర్జీని ఇచ్చి సమస్యలను వివరించామని స్వప్నకుమారి అన్నారు. పోలవరం జిల్లా, రాజవొమ్మంగి మండలం జడ్డంగి పి.హెచ్.సి నందు బర్త్ వెయిటింగ్ హాల్ లేదు. ప్రసవానికి ముందు వచ్చే వారు జనరల్ వార్డుల్లో ఉండాల్సి వస్తోందన్నారు. బీ.పి ప్రాథమిక దశలో వాడాల్సిన ఎల్లో డిఫిన్ 5 ఎమ్.జి మాత్రలు సరఫరా నిలుపుదల చేశారన్నారు. ప్రతి నెలా 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణీల పరీక్షలకు ప్రత్యేక వైద్య నిపుణులతో చేయించడం జరిగేదని, ఇప్పుడు పి.హెచ్.సి. వైద్యులు మాత్రమే చేస్తున్నారన్నారు. జడ్డంగి పి. హెచ్.సి లో ఉన్న ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ నిరుపయోగంగా ఉందని అన్నారు. స్కానింగ్ కోసం మైదాన ప్రాంతాల్లో ప్రవేటు ఆసుపత్రులకు వెళ్లి రోజంతా ఉండి రూ.7వేలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. సమస్యలు పరిష్కారించాలని స్వప్నకుమారి కోరారు. జిల్లాలో అన్ని పి. హెచ్. సి ల్లో ప్రసవాలకు వచ్చే వారికి భోజన ఏర్పాట్లపై చర్యలు తీసుకొంటున్నామని, జడ్డంగి పి. హెచ్. సి లో సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ అన్నారని స్వప్నకుమారి తెలిపారు.

## విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన పుల్లయ్య మాస్టర్: ఎంఈఓ



కె.గంగవరం, జూన్ 22 (ప్రభాతవార్త): గంగవరం మండలం పాణంగపల్లి గ్రామ పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ దీర్ఘకాలంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన మేడిశెట్టి పుల్లయ్య (పుల్లయ్య మాస్టర్) పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడినట్లు గంగవరం హెచ్ఎమ్ సుబ్రమణ్యం తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల్లో విద్యతోపాటు వారిలో ఉన్నటువంటి సృజనాత్మకత గుర్తించి వాటిని ఆచరణలో పెట్టడంలో ముఖ్యపాత్ర పోషించేవారు. అంతేకాక తను చేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులచే రకరకాల ఆకుకూర మడులు వేయించడం మొక్కలు నాటించడం వాటి సంరక్షణ ఎలా చూసుకోవాలో మెలకువలు నేర్పడం వంటి కార్యక్రమాలు చేసేవారు. అంతేకాకుండా క్రమశిక్షణ అంకితభావం విద్యార్థుల పట్ల ప్రేమాభిమానాలతో అందరికీ ఆదర్శంగా నిలిచేవారు. చేతివేళ్లు ఎలాగైతే ఒకటిగా ఉండవో అలాగే పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా ఒకేలా ఉండరని, ఎవరికి తగ్గట్లుగా వారికి విద్య బోధన లను నేర్పించేవారు. అని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో పాటు, ఎంఈఓ లు నాగరాజు, ఆంజనేయులు, రిటైర్డ్ ఉద్యోగులు ప్రసాద్ చౌదరి, భానుమతి, మాడా సత్యనారాయణ, చిట్టూరి రామ్మోహన్ రావు, రెవెన్యూ, సచివాల, వైద్య విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు భీమరాజు,గోపాలకృష్ణ, వెంకన్న బాబు , తామరపల్లి మాజీ సర్పంచ్ తోకల శ్రీను మంగాదేవి, కొత్తపల్లి మొరార్జీ, అధిక సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని సాలువాలతో జ్ఞాపకలతో ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యాభివృద్ధికి సమాజసేవ కార్యక్రమాల తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధానోపాధ్యాయులు మేడిశెట్టి పుల్లయ్య తెలిపారు.

## 108 లో ప్రసవం.. రహదారి బురదమయం



రాజవొమ్మంగి, జూన్ 22, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం కొండపల్లి పంచాయితీ తెల్లకొండ గ్రామానికి చెందిన పాంగి నందిని మొదటి కాన్పుగా ఆడ శిశువుకి 108 వాహనంలో సోమవారం ఉదయం జన్మనిచ్చింది. 108 వాహనం రోడ్డు సరిగా లేక దిగబడిపోయింది. తల్లి బిడ్డ సురక్షితం. రాజవొమ్మంగి పి. హెచ్. సి కి తల్లి బిడ్డను తరలించినట్లు 108 సిబ్బంది ఇ. ఎం. టి చింతపల్లి అర్జునబాబు, పైలట్ మడకం గవర్రాజు సేవలను అందించారు. రాజవొమ్మంగి పి. హెచ్. సి లో బర్త్ వెయిటింగ్ హాలు సౌకర్యం ఉంది. రాజవొమ్మంగి పి. హెచ్. సి కి. 6 కి. మీ దూరంలో ఈ గ్రామం ఉంది. రోడ్డు సమస్యపై పలుమార్లు వినతిపత్రంను ఇవ్వడం జరిగిందని, గిరిజన ప్రజల ప్రాణ రక్షణ దృష్ట్యా రహదారి సమస్యను పరిష్కరించాలని కొండపల్లి పీసా కమిటీ ఉపాధ్యక్షులు కోటం వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను కోరుతున్నారు.

## 8 పశువుల అక్రమ రవాణా వ్యాన్ లు స్వాదీనం.. 19 మందిపై కేసు నమోదు



రాజవొమ్మంగి, జూన్ 22, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామశివారున సోమవారం ఉదయం రాజవొమ్మంగి సి. ఐ. గౌరీశంకర్ ఆధ్వర్యంలో జడ్డంగి ఎస్. ఐ. చినబాబు, పోలీసులు వాహన తనిఖీలను నిర్వహించారు. 8 వ్యాన్ ల్లో 32 పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారని, వాటిని పోలీస్ స్టేషన్ కు తరలించి 19 మందిపై కేసు నమోదు చేసామని ఎస్. ఐ ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేకపోవడం, పశువైద్య ధ్రువీకరణ పత్రాలు లేవని అన్నారు. పశువులను గోశాలకు తరలించి, వాహనాలను సీజ్ చేసామన్నారు. పశువులు అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకొంటామని ఎస్. ఐ. చినబాబు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ రాజ్ కుమార్, విజయ్ కుమార్, కానిస్టేబుల్స్ ప్రసాద్ రెడ్డి, జయరాందొర, శ్రీను పాల్గొన్నారు.

## మసకపల్లిలో మొబైల్ వైద్య సేవలు



కె.గంగవరం, జూన్ 22, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం మసకపల్లి గ్రామంలో కియా, సహారా సంస్థల ద్వారా ఏర్పాటుచేసిన మొబైల్ వ్యాన్ (సంచార వైద్యశాల) ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు వైద్యురాలు అనూష తెలిపారు. ఈ వైద్య సేవలో భాగంగా సుమారు 40 మంది పాల్గొనగా వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కార్యక్రమంలో ఉన్న ఎమ్మార్వో ఐ జగదీష్, మొబైల్ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు . ఈ సేవలో భాగంగా డిజిటల్ స్టెతస్కోప్ ద్వారా గుండె పరిస్థితిని తెలుసుకోవడం, ఉచితంగా మందులు ,అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గెద్దం పల్లపరావు (బన్ని), సిబ్బంది అనూష, జ్యోతి, రాజేశ్వరి, చంద్రరావు, ప్రకాష్ రావు, సచివాలయ సిబ్బంది,అధికారులు, ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు, లోవరాజు, స్థానిక అధికారులు నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సాగరమాలకు సహాయక రోడ్డులు నిర్మించాలి



యు.కొత్తపల్లి, జూన్ 22(ప్రభాతవార్త) : కాకినాడ రూరల్ సూర్యారావు పేట నుంచి అన్నవరం వరకు నిర్మించే సాగరమాల రోడ్డు నిర్మాణంలో సహాయక మార్గాలు (సర్వీసు రోడ్డు) నిర్మించాలనే డిమాండు రోజు రోజుకు పెరుగుతోంది. ఎక్కడి కక్కడ ప్రజలకు, రైతులకు అవసరమయ్యే సహాయకరోడ్డులు నిర్మించాలంటూ డిమాండు చేస్తున్నారు. మండలంలోని కొమరగిరి గ్రామంలో సోమవారం స్థానికులు, రైతులు సహాయక మార్గాలు కావాలంటూ సమావేశం నిర్వహించారు. అవి లేకపోతే తమ వ్యవసాయ, పంట ఉత్పత్తుల రవాణాలో తలెత్తే సమస్యలపై చర్చించారు. త్వరలో ఈ విషయాన్ని పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరడం జరుగుతుందన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

## గ్రామ ప్రత్యేక అధికారి వెంకటరమణ



శంఖవరం జూన్ 22 ప్రభాతవార్త గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించామని మండల విద్యాశాఖ అధికారి కత్తిపూడి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి సూరిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు మండలం కత్తిపూడి లో పలు ప్రాంతాల్లో మిషన్ ద్వారా చేపట్టిన పారిశుధ్య మెరుగు చర్యలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పు వర్షాల కారణంగా డ్రైనేజీల్లో పూడుకుపోయిన మట్టిని తొలగించేందుకు ప్రత్యేక సిబ్బంది ద్వారా చర్యలు చేపడుతున్నామని పబ్లిక్ కుళాయి లు చేతి పంపులు వద్ద ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు వర్షాల కారణంగా నీరు నిల్వ లేకుండా చూడాలని పేర్కొన్నారు పంచాయతీ కార్యదర్శి మధు శేఖర్ మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాతావరణంలో మార్పు కారణంగా జ్వరాలు ప్రభలే అవకాశం ఉందని ప్రజలంతా ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. అనంతరం త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన బోర్లు మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు

## ఫీజుల దోపిడీని అరికట్టాలి




రామచంద్రాపురం,జూన్ 22 (ప్రభాత వార్త):కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్న అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలని,విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ,విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.అనంతరం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేశారు.?ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఫీజుల నియంత్రణకు చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.విద్యాసంస్థలు ట్యూషన్ ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫారాలు,రవాణా,హాస్టల్ పేరిట లక్షలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని మండిపడ్డారు.ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో నెం.53,54లను అమలు చేయాలన్నారు.ఆర్టీఈ చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల నిబంధనను పటిష్టంగా అమలు చేయాలని,పెండింగ్ ఫీజులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.ప్రైవేట్ పాఠశాలల అక్రమాలను అరికట్టడంలో విఫలమైన జిల్లా విద్యాశాఖ అధికారి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఆర్డీవో స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంటపల్లి,చింత రాజారెడ్డి,తల్లిదండ్రులు శివ,రవి,ఉదయ్,నాగరాజు,పార్థు తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ నియామక పత్రాన్ని అందజేసిన ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు..

### ప్రత్తిపాడు ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ అధికారులతో నియమావళి పై చర్చ..



ప్రత్తిపాడు, జూన్ 22,( ప్రభాతవార్త) ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ అధికారిక బూత్ లెవెల్ ఏజెంట్-1 నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి, డీటీ రమేష్, మరియు ఎలక్షన్స్ సీనియర్ అసిస్టెంట్ డి.వి. సాయి వర్మలకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల ప్రక్రియలు, బూత్ స్థాయి ఏర్పాట్లపై అధికారులతో పలు విషయాలను చర్చించారు.హాజరైన ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్, డిసిసి ఉపాధ్యక్షులు ధరణాలకోట శీను, కాంగ్రెస్ నాయకులు దాసరి సత్తిబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి వీరబాబు మరియు నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతన్న మీకోసం ప్రచారం



రామచంద్రాపురం,జూన్ 22 (ప్రభాత వార్త): మండలంలో ఈ నెల 22 నుండి 27 వరకు రైతన్న మీకోసం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్.మణిదీప్ తెలిపారు.క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సుస్థిర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు.?ముఖ్యంగా ఎల్-నినో ప్రభావం వల్ల వచ్చే వాతావరణ మార్పులపై ముందస్తు సన్నద్ధత, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రైతులకు వివరిస్తారని పేర్కొన్నారు. అలాగే, ఆన్‌లైన్ ద్వారా ఎరువుల పంపిణీ,భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం,పెట్టుబడి ఖర్చుల తగ్గింపుపై అవగాహన కల్పిస్తామన్నారు.సాంప్రదాయ పంటల స్థానంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న లాభదాయక పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని,సిబ్బంది,రైతులు దీనిని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



కాంగ్రెస్ నియామక పత్రాన్ని అందజేసిన ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు..
- ప్రత్తిపాడు ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ అధికారులతో నియమావళి పై చర్చ..



ప్రత్తిపాడు, జూన్ 22,( ప్రభాతవార్త) ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ అధికారిక బూత్ లెవెల్ ఏజెంట్-1 నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి, డీటీ రమేష్, మరియు ఎలక్షన్స్ సీనియర్ అసిస్టెంట్ డి.వి. సాయి వర్మలకు ఆయన అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల ప్రక్రియలు, బూత్ స్థాయి ఏర్పాట్లపై అధికారులతో పలు విషయాలను చర్చించారు.హాజరైన ముఖ్య నాయకులు:ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్, డిసిసి ఉపాధ్యక్షులు ధరణాలకోట శీను, కాంగ్రెస్ నాయకులు దాసరి సత్తిబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి వీరబాబు మరియు నియోజకవర్గ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ ప్రయోజనాల కోసం కాపు జాతిని విభజించడం మానుకోవాలి:

### -కౌడా చైర్మన్ తలాటం సత్య



కాకినాడ రూరల్, జూన్ 22 (ప్రభాతవార్త): రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయోజనాల కోసం కాపు జాతిని విభజించడం మానుకోవాలని వైసిపి కాపులకు కుడా చైర్మన్ తలాటం సత్య హెచ్చరించారు. ఒక ప్రకటనలో మీడియాతో మాట్లాడుతూ నేరస్తులకు, హంతకులకు కులం ఆపాదించడం సరి కాదని జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటనలో తెలియజేశారని, దానికి వైసీపీ కాపులంతా ఒక చోట చేరి ఆత్మీయ సమ్మేళనం పేరిట కాపుల ప్రయోజనాలను తాకట్టు పెట్టారని తలాటం ఆగ్రహం వ్యక్తం చేశారు.మీరు పెట్టిన సమావేశం కాపుల ప్రయోజనాలకా, వైసీపీ పార్టీ ప్రయోజనాల కోసమా ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌కాపులకి రిజర్వేషన్లు ఇవ్వలేమని గోదావరి జిల్లాల సాక్షిగా ప్రకటించినప్పుడు మీరు చెప్పిన కాపు ప్రయోజనాలు ఏమైపోయాయో సమాధానం చెప్పాలన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వం 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా నుంచి 5 శాతం రిజర్వేషన్ కాపులకి ఇస్తే.. అధికారంలోకి వచ్చిన వెంటనే మీ నాయకుడు దాన్ని రద్దు చేసి కాపు కార్పొరేషన్ నిర్వీర్యం చేసిన ఘనత మాజీ సీఎం జగన్ కే దక్కుతుందన్నారు. దేశం బాగుండాలి, రాష్ట్రం బాగుండాలి అనే భావనతో జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బురదజల్లే కార్యక్రమాలు మానుకోవాలని వైసిపి కాపులకు తలాటం సత్య హితవు పలికారు.

## ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి



సీతానగరం, జూన్ 22, (ప్రభాతవార్త) :కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీతానగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు యాళ్ళ మాసరయ్య, గరగ శ్రీధర్, పీర్ల గణేష్ మాట్లాడుతూ గత పన్నెండు ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. ఉపాధి హామీ నిధుల్లో కోత విధిస్తూ ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కొత్త పెన్షన్ల మంజూరులో రెండేళ్లుగా కాలయాపన చేస్తున్నారని, నూతన పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ, మోత అబ్బులు, ఆళ్ళపాడి గోవిందు, గుండుబోగుల శ్రీనివాస్, యాళ్ళ సత్యనారాయణ, కోడి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## జె.డి. దంపతుల కృతజ్ఞతలు.



తాళ్లరేవు, జన్ 22( ప్రభాతవార్త): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం పట్ల వ్యవసాయ శాఖ రిటైర్డ్ జె.డి. పెట్ల సూర్యనారాయణ రాజు దంపతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతు విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జున్నూరి బాబీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పదవిని బాధ్యతగా భావించి పనిచేస్తానని తెలిపారు. ఆయన వెంట వైకాపా ఎస్ ఇ సి సభ్యురాలు కాశి మునికుమారి, జె.డి. సతీమణి మార్కెట్ కమిటి మాజీ డైరక్టర్ పెట్ల శాంత కుమారి ఉన్నారు.

## రాజవొమ్మంగి సి.ఐ గా సన్యాసినాయుడు

రాజవొమ్మంగి, జూన్ 22, ప్రభాతవార్త రాజవొమ్మంగి పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా సన్యాసినాయుడు రంపచోడవరం నుండి బదిలీపై రానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం సి. ఐ. గౌరీశంకర్ బదిలీ అయ్యారని సమాచారం.

## తూర్పుగోదావరి జిల్లా బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా గిరాడ గంగాభవాని , జిల్లా బిజెపి మహిళా మోర్చా కార్యదర్శిగా వడ్లమూరి లక్ష్మి



అనపర్తి జూన్ 22(ప్రభాత వార్త)తూర్పుగోదావరి జిల్లా బిజెపి మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా గిరాడ గంగాభవానిని, తూర్పుగోదావరి జిల్లా బిజెపి మహిళా మోర్చా కార్యదర్శిగా వడ్లమూరి లక్ష్మి నియమితులైన సందర్భంగా రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిమర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps